www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ




ఎపి ఎంపిటిసి ఎన్నికల్లో ఆరుచోట్ల సిపిఐ గెలుపు 07

ఐదుచోట్ల విజయం, ఒకటి ఏకగ్రీవం

సంపుటి 29, సంచిక: 139 | ఆదివారం | 08-11-2026 | హైదరాబాద్ Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar** పేజీలు: 12 | వెల రూ. 5.00

శుభాకాంక్షలు



పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ప్రజాపక్షం' దీపావళి శుభాకాంక్షలు

సెలవు

దీపావళి సందర్భంగా 'ప్రజాపక్షం' కార్యాలయానికి ఆదివారం సెలవు. సోమవారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం మంగళవారం.

- ఎడిటర్

పదేళ్లు పాలమూరును ఎండబెట్టారు



- రూ.20 లక్షల కోట్ల బడ్జెట్ చేతికి వచ్చినా ప్రాజెక్టులు పూర్తి చేయలేదు
- ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టును పక్కనపెట్టి కాళేశ్వరం కడితే కూలిపోయింది
- కెసిఆర్ కుటుంబాన్ని పాతిపెట్టడమే వాళ్లకు సరైన శిక్ష
- ఎల్ నినో విషయంలోనూ బిఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం
- వికారాబాద్ జిల్లా హకీంపేట బహిరంగసభలో సిఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం
- రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పో ప్రారంభం



ప్రజాపక్షం/వికారాబాద్/కొండగల్

గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో పాలమూరు జిల్లాలో ఏ ప్రాజెక్టును మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పూర్తి చేయలేదని, పదేళ్లలో రూ.20 లక్షల కోట్ల బడ్జెట్ చేతికి వచ్చినా ప్రాజెక్టులు పూర్తి చేయలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ వరప్రదాయనిగా మారే ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టును పక్కకు పెట్టారని, ప్రాజెక్టు పేరు, స్థలం మార్చి, అంచనాలు పెంచి కాళేశ్వరం కట్టారని, అది కెసిఆర్ హయాంలోనే కుప్పకూలిందని విమర్శలు చేశారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం హకీంపేటలో నివారం రేవంత్‌రెడ్డి పర్యటించారు. హకీంపేటలో అగ్రి ఎక్స్‌పో స్టాళ్లను పరిశీలించారు. రైతుమేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించారు. అనంతరం ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమంలో రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. కాగా, బహిరంగభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఎల్‌నినో విషయంలోనూ బిఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దానివల్ల ప్రపంచవ్యాప్తంగా కరువు వస్తే తెలంగాణలోనే వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును తరువాయి 8లో



అరెస్టులు ఎదురైనా దేశమంతా

త్రివర్ణ జెండా మోసుకెళ్తా

- జాతీయ జెండాలు చేబూని జంతర్ మంతర్‌లోకి ప్రవేశిస్తే అరెస్టు చేస్తారా?
- మోదీ 120 ఏళ్ళు పాలించినా గాంధీ, నెహ్రూ, అంబేద్కర్ స్థాయికి చేరుకోలేరు
- సర్‌ను రద్దుచేయాలి.. సిఇసి జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించాలి
- సిజెపి వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే డిమాండ్
- నటుడు ప్రకాశ్ రాజ్ నేతృత్వంలో కొచ్చిలో భారీ జంతర్ మంతర్ నిరసన ర్యాలీ



కొచ్చి : కాక్రోచ్ జనతాపార్టీ(సిజెపి) శనివారం కేరళ రాష్ట్రం కొచ్చిలో భారీ ''జంతర్ మంతర్ ర్యాలీ'' నిర్వహించింది. ఎన్ని అరెస్టులు ఎదురైనా దేశమంతటా జాతీయ జెండాను మోసుకువెళతామని ర్యాలీలో ప్రసంగించిన సిజెపి వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే స్పష్టం చేశారు. ప్రజల ఆహార అలవాట్లు, వ్యక్తిగత సంబంధాలు, ఓటింగ్ హక్కులను నియంత్రించాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ దేశాన్ని 120 సంత్సరాలు పరిపాలించినాగానీ మీరు ఎన్నటికీ అంబేద్కర్, గాంధీ, నెహ్రూస్థాయికి చేరుకోలేరని మోదీని విమర్శించారు. భారీసంఖ్యలో యువకులు పాల్గొన్న ఈ ర్యాలీలో అందరూ జాతీయ జెండాలను చేతపట్టుకుని నడిచారు.రాజేంద్రమైదాన్ వద్ద ఈ ర్యాలీ ముగిసింది. ఈ మైదానంలోనే అభిజిత్ దీప్కే ప్రదర్శకులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రముఖ నటుడు, సిజెపి నాయకుడు ప్రకాశ్‌రాజ్ నాయకత్వంలో ఈ ర్యాలీ తరువాయి 8లో

నేటి నుంచి

4.5 లక్షల మందికి కొత్త పింఛన్లు

కొడంగల్‌లో పంపిణీ ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని అర్హులైన పేదలకు దీపావళి పండుగ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. 'చేయూత' పథకం ద్వారా నూతనంగా 4.5 లక్షల మందికి పింఛన్లు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఈ పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం తన స్వంత నియోజకవర్గమైన కొడంగల్‌లో ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్కతో తరువాయి 8లో

రూ.7.09 కోట్లు మాయం

- కీర్తన ఫిన్‌సర్వ్ ఖాతాలో నుంచి కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు
- గంట వ్యవధిలో 39 అక్రమ లావాదేవీలు
- పలు బ్యాంకు ఖాతాలకు నగదు బదిలీ

ప్రజాపక్షం/హైదరాబాద్

సైబర్ నేరగాళ్లు ఏకంగా ఓ ఆర్థిక సంస్థ ఖాతాపైనే కన్నేశారు. కేవలం గంట వ్యవధిలో 39 అక్రమ లావాదేవీల ద్వారా రూ.7.09 కోట్లను వివిధ ఖాతాలకు మళ్లించి భారీ దోపిడీకి పాల్పడ్డారు. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న కీర్తన ఫిన్‌సర్వ్ లిమిటెడ్ తరువాయి 8లో



ధాన్యం నిల్వాల కష్టాలకు చెక్

రైతులకు ధర భరోసా!

రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక సైలోల ఏర్పాటుకు సర్కారు కార్యాచరణ

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్ష

ప్రజాపక్షం/హైదరాబాద్

పంట చేతికొచ్చిన వెంటనే ధాన్యం అమ్ముకోవాల్సిన దుస్థితి నుంచి రైతులను గట్టెక్కించి, మార్కెట్‌లో గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వ చేసుకునే అవకాశం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేస్తోంది. కోతల సమయంలో తేమ పేరుతో ధర తగ్గించి కొనుగోలు చేసే పరిస్థితులకు ప్రత్యామ్నాయంగా రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక సైలోల వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.శనివారం సచివాలయంలో మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సైలోల ఏర్పాటుపై అధికారులతో సమీక్షించారు. తొలి దశలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 20 ప్రాంతాలను గుర్తించి ప్రైవేటు భాగస్వామ్యంతో సైలోలు నిర్మించడంతో పాటు, పౌర సరఫరాల సంస్థ నేరుగా నిర్మించే మరో నమూనాను కూడా పరిశీలిస్తున్నారు.ప్రతిపాదిత కేంద్రాల్లో ధాన్యం తూకం, తేమ పరీక్ష, నాణ్యత నిర్ధారణ, తరువాయి 8లో



ఇ-20 కాదు.. 420

- పెట్రోల్‌లో అధికశాతం ఇథనాల్ కలపడంపై రాహుల్‌గాంధీ మండిపాటు
- ఇంధనంలో వాస్తవ శాతంపై కేంద్రం స్పష్టత ఇవ్వాలని డిమాండ్




న్యూఢిల్లీ : దేశంలో ఇ–20 పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమం అంశం రాజకీయ వివాదానికి దారితీసింది. ఈ అంశానికి సంబంధించి మోదీ ప్రభుత్వంపై ప్రతిపక్షనేత, కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. కర్ణాటక ప్రభుత్వం సేకరించిన నమూనాల పరీక్ష ఫలితాలను ఉటంకిస్తూ, దేశవ్యాప్తంగా అమ్ముడవుతున్న ఇంధనంలో వాస్తవ ఇథనాల్ శాతంపై కేంద్రం స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇ–20 కార్యక్రమం కాస్త 420గా మారిందని మండిపడ్డారు. ఇది ప్రజల కార్ల నుంచి పెట్రోల్ దొంగిలించడమేనని ఆరోపించారు. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ ఉంటుందని ప్రభుత్వం చెబుతోందని, అయితే కర్ణాటకలోని ఏడు జిల్లాల నుండి సేకరించిన నమూనాలపై జరిపిన పరీక్షల్లో అంతకంటే ఎక్కువ స్థాయిలు ఉన్నట్లు వెల్లడైందని రాహుల్ అన్నారు. మొత్తం 14 నమూనాలను పరీక్షించగా, వాటిలో 11 నమూనాల్లో ఇథనాల్ శాతం తరువాయి 8లో

ఇల్లు.. పేదల ఆత్మగౌరవం

- భద్రత, భరోసా కల్పించే చిరునామా
- 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నామన్నారు. ఇల్లు అనేది కేవలం నాలుగు గోడల నిర్మాణం కాదని, ప్రతి పేద కుటుంబానికి ఆత్మగౌరవం, తరువాయి 8లో



- బ్యాంకు పతనంతో రాజకీయ సంక్షోభం
- తాత్కాలిక అధ్యక్షుడుగా అలియానా ప్రమాణ స్వీకారం
- నష్టపరిహారం చెల్లిస్తామని ప్రకటన

పరాగ్వే దేశాధ్యక్షుడి

గృహనిర్బంధం

అసున్సియోన్ : మధ్య దక్షిణ అమెరికాలో సముద్ర సరిహద్దులేని దేశం పరాగ్వేలో తీవ్ర రాజకీయ సంక్షోభం నెలకుంది. దీంతో దేశాధ్యక్షుడు శాంటియాగో పెనా అరెస్టుకు గురయ్యారు. ఆయన అమెరికా దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మిత్రుడు, మిత వాద రాజకీయ నాయకుడు. ప్రస్తుతం గృహనిర్బంధంలో ఉన్నారు. ఆయనస్థానంలో దేశ ఉపాధ్యక్షుడు పెడ్రో అలియానా తాత్కాలిక అధ్యక్షుడుగా ప్రమాణస్వీకారం చేశారు. దేశంలో ఆయన ప్రైవేటు వ్యాపారాలకు సంబంధం ఉన్న ప్రముఖ బ్యాంకు పతనం కావడంతో ఖాతాదారులు ఎలాంటి లావాదేవీలు నిర్వహించలేకపోయారు. దేశంలోని 60 లక్షల జనాభాలో దాదాపు సగం అంటే 30 లక్షల మంది ప్రజలు, తరువాయి 8లో



తిండిపోతు డేగ



మనుషులేకాదు... ఒక్కోసారి జంతువులు, పక్షులు కూడా అతిగా తినే స్థాయని అమెరికాలోని వర్జీనియా రాష్ట్రంలో చోటు చేసుకున్న సంఘటన స్పష్టం చేస్తుంది. ఒక కుటుంబం పెరట్లో పెంచుకుంటున్న కోళ్లను విపరీతంగా తినడంతో ఆ డేగ తాత్కాలికంగా ఎగిరే సామర్థ్యాన్ని కోల్పోయింది. డేగలు సాధారణంగా చిన్న క్షీరదాలు, ఇతర పక్షులు, సరీసృపాలను వేటాడి ఆహారంగా తీసుకుంటాయి. తమ బలమైన పంజాలతో ఎరను పట్టుకుని, పదునైన వంపు తిరిగిన ముక్కుతో మాంసాన్ని చీల్చి తింటాయి. ఇవి ఒకేసారి ఎక్కువ ఆహారం తీసుకోగలిగినా, సమర్థంగా ఎగరడానికి అవసరమైన శరీర బరువును సాధారణంగా కాపాడుకుంటాయి. ఎగరడానికి గణనీయమైన శక్తి అవసరం. శరీర బరువు అధికమైతే నేల నుంచి పైకి లేవడం, గాలిలో దిశ మార్చుకోవడం, ఎక్కువసేపు ఎగరడం కష్టమవుతాయి. కాగా, ఈ ఘటనలో డేగకు పెరట్లోని కోళ్ల రూపంలో సులభంగా ఆహారం దొరికింది. వాటిని విపరీతంగా తినడంతో దాని శరీర బరువు పెరిగి, సాధారణంగా ఎగరలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో వన్యప్రాణి సంరక్షకులు అక్కడికి చేరుకుని, దాని ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, కోలుకోవడానికి అవసరమైన సహాయం అందించారు.

విఫల ప్రయోగం..



పని ఎక్కువగా ఉంటే, 'మేము మనుషులమా?యంత్రాలమా?' అని ఆగ్రహించడం మనకు తెలుసు. అయితే, యంత్రాలు కూడా అలసిపోతాయని చైనాలో జరిగిన ఒక ప్రయోగం స్పష్టం చేసింది. షాంఘై నగరంలో అజీబాట్ (అనే రోబోటిక్స్ సంస్థ ఆరు హ్యూమనాయిడ్ రోబోల తో ఒక వినూత్న ప్రయోగం చేపట్టింది. మనుషుల్లా కనిపించే ఈ రోబోలు 24 గంటల పాటు ఒక కన్వీనియన్స్ స్టోర్‌లో పనిచేయించాలని నిర్ణయించింది. ఈ ప్రయోగానికి సంస్థ 'రోబోట్స్ నెవర్ క్లాక్ అవుట్' (రోబోలకు పని వేళలతో సంబంధం లేదు) అనే పేరు పెట్టింది. వినియోగదారులకు స్వాగతం పలకడం, వారికి కావాల్సిన వస్తువులను అందించడం, అరల్లో సరుకులను సర్దడం, కాఫీ, వేడి ఆహార పదార్థాలను సిద్ధం చేయడం, శుభ్రం చేయడం వంటి పనులను ఈ రోబోలకు అప్పగించారు. 24 గంటల ప్రయోగంలో ఆరు రోబోలు కలిపి 1,730 పనులను పూర్తి చేశాయి. ఇందులో 683 సార్లు వినియోగదారులకు స్వాగతం పలకడం, 369 సార్లు వస్తువులను గుర్తించి అందించడం, 147 సార్లు కాఫీ తయారు చేయడం వంటి పనులు ఉన్నాయి. అయితే రెండు రోబోలు మాత్రం తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించలేకపోయాయి. శుభ్రత పనులు చేపట్టిన ఒక రోబో చెత్తబుట్ట నిండిపోవడంతో సమస్యను పరిష్కరించలేకపోయిం ది. నిర్ణీత మార్గాన్ని వదిలి దుకాణం బయటకు వెళ్లిపోయి, తిరిగి లోపలికి రాలేకపోయింది. మరో రోబో అరల్లో సరుకుల కొరతను గుర్తించడంలో ఇబ్బందిపడింది. మిగిలిన నాలుగు రోబోలు మాత్రం కొంతవరకు మెరుగైన పనితీరు కనబరిచాయి. మొత్తంమీద ఈ ప్రయోగం ఆధునిక రోబోటిక్స్ ఎదుర్కొంటున్న పరిమితులను బయటపెట్టింది. కృత్రిమ మేధ సాయంతో రోబోలు సూచనలను అర్థం చేసుకుని అనేక పనులు చేయగలుగుతున్నాయి. అయితే అనూహ్య పరిస్థితులు ఎదురైనప్పుడు తమ కదలికలను నియంత్రించుకోవడం, సమస్యలకు తక్షణ పరిష్కారాలు కనుగొనడం ఇంకా వాటికి సవాలుగానే మిగిలింది. అందువల్ల దుకాణాల్లో మనుషుల పర్యవేక్షణ లేకుండా నిరంతరాయంగా పనిచేసే స్థాయికి హ్యూమనాయిడ్ రోబోలు ఇంకా చేరుకోలేదని ఈ ప్రయోగం సూచిస్తోంది.

రబ్బరు బ్యాండ్లతో భారీ బంతి



అమెరికాలోని డెట్రాయిట్‌కు చెందిన క్లాడ్ పి.మూర్ అనే వ్యక్తి తన పదకొండేళ్ల శ్రమతో అరుదైన ప్రపంచ రికార్డు సాధించాడు. వేలాది రబ్బరు బ్యాండ్లను ఒకదానిపై మరొకటి చుడుతూ ఏకంగా 11,578 పౌండ్ల (5,251.69 కిలోల) బరువున్న భారీ బంతిని తయారుచేశాడు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ఈ బంతిని ప్రపంచంలోనే అతిపెద్ద రబ్బరు బ్యాండ్ల బంతిగా గుర్తించింది. మూర్‌కు చిన్నప్పటి నుంచే రబ్బరు బ్యాండ్లతో బంతులు తయారుచేయడం అలవాటు. అతను హీమోఫీలియా అనే రక్తస్రావ సంబంధిత వ్యాధితో బాధపడేవాడు. వైద్య పరీక్షలు, చికిత్సల కోసం ఆసుపత్రులకు వెళ్లినప్పుడు అక్కడ సమయం గడిపేందుకు రబ్బరు బ్యాండ్లతో చిన్న బంతులు తయారుచేసేవాడు. ఆ చిన్ననాటి అలవాటే క్రమంగా పెద్ద అభిరుచిగా మారింది. 2015లో సహోద్యోగులు భారీ బంతిని తయారుచేయాలని సవాలు విసరడంతో మూర్ ఈ ప్రయత్నాన్ని ప్రారంభించాడు. బంతి పరిమాణం పెరుగుతూ రావడంతో దాన్ని గ్యారేజీలో ఉంచడం కూడా కష్టమైంది. చివరకు దానిని ఒక గదికి తరలించాడు. ఈ ప్రయత్నానికి కుటుంబ సభ్యులు, స్నేహితులు కూడా సహకరించారు. ఈ ఏడాది ఆగస్టు 29న డెట్రాయిట్‌లోని బెల్లె ఐల్లో క్రేన్ సాయంతో బంతిని బయటకు తీసి అధికారికంగా తూకం వేశారు. గిన్నిస్ ప్రతినిధి సమక్షంలో దాని బరువును నిర్ధారించారు. రెండు రోజుల క్రితం అతనికి అధికారిక ధ్రువీకరణ పత్రం కూడా లభించింది.

అలుపులేని బాటసారి!



ప్రపంచాన్ని కాలినడకన చుట్టి రావాలనే లక్ష్యంతో 28 ఏళ్ల క్రితం ఇంటి నుంచి బయలుదేరిన బ్రిటన్ సాహస యాత్రికుడు కార్ల్ బుష్బీ ఎట్టకేలకు తన స్వస్థలానికి చేరుకున్నాడు. దాదాపు 50 వేల కిలోమీటర్లు, నాలుగు ఖండాలు, 30 దేశాల మీదుగా సాగిన ఆయన సుదీర్ఘ ప్రయాణం ఈనెల 2వ తేదీన ముగిసింది. 57 ఏళ్ల వయసులో ఇంగ్లండ్‌లోని హల్ నగరానికి చేరుకున్న ఆయనకు కుటుంబ సభ్యులు, వందలాది మంది ప్రజలు ఘన స్వాగతం పలికారు. పదేళ్లుగా చూడని తల్లి ఏంజెలాను కలుసుకుని భావోద్వేగానికి గురయ్యాడు. తన 36 ఏళ్ల కుమారుడిని, 12 ఏళ్ల మనవరాలిని కూడా కలుసుకున్నాడు. 1998 నవంబర్ 1న దక్షిణ చిలీలోని పుంటా అరెనాస్ నుంచి బుష్బీ తన యాత్ర ప్రారంభించాడు. ఎలాంటి మోటారు వాహనాల సహాయం తీసుకోకుండా, కాలినడకన మాత్రమే ప్రయాణించి ఇంటికి చేరుకోవాలని రెండు నిబంధనలు పెట్టుకున్నాడు. ఈ ప్రయాణంలో ఆయన దట్టమైన అమెజాన్ ప్రాంతపు అడవులు, ప్రమాదకరమైన దారియన్ గ్యాప్, ఎడారులు, మంచుతో కప్పుకున్న ప్రాంతాలను దాటాడు. అలాస్కా నుంచి రష్యా మధ్య నున్న బెరింగ్ జలసంధిలో మంచుపై ప్రయాణించాడు. కాస్పియన్ సముద్రాన్ని ఈదుకుంటూ దాటాడు. చివరి దశలో ఇంగ్లిష్ ఛానల్‌ను కూడా ఈదుకుంటూ దాటాడు. వాస్తవానికి 10 నుంచి 12 ఏళ్లలో యాత్ర పూర్తి చేయాలని ఆయన భావించాడు. కానీ అనేక అవాంతరాలతో అది 28 ఏళ్లకు చేరింది. ఈ సాహసయాత్రపై ప్రముఖ జర్మన్ దర్శకుడు వెర్నర్ హెర్జోగ్ డాక్యుమెంటరీ రూపొందిస్తున్నారు.

– బిఎస్‌ఎస్ మైత్రేయి

ఎన్నికల కమిషన్ పిల్లిమొగ్గలు

ఓటరు జాబితాల ముమ్మర సవరణ (ఎస్‌ఐఆర్) పేరుతో భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) కోట్లాదిమంది పేర్లను జాబితాలనుంచి తొలగించటంపై ప్రతిపక్ష ఇండియా కూటమి, జన్ జడ్ సిజెపి, విద్యార్థి సంఘాలు, స్వతంత్ర ప్రజాసంఘాలు, వేదికలు ఉవ్వెత్తున సాగిస్తున్న ఆందోళనలు, రెండోవైపున సుప్రీంకోర్టులో ఉక్కిరిబిక్కిరి మధ్య ఎన్నికల కమిషన్ తన తప్పులు తగ్గించుకునే ప్రయత్నంగా 'సర్' ప్రక్రియ అమలులో మార్పులు ప్రకటిస్తున్నది. ఫారం 6(ఓటరుగా నమోదు)కు జత చేసిన సర్ డిక్లరేషన్, ఫారం 6లో భాగం కాదని ముందు వాదించిన ఇసి విమర్శలు తట్టుకోలేక అది అదనపు డిక్లరేషన్ అంది. ఆ తర్వాత అది ఎలక్ట్రానిక్ దరఖాస్తులకే పరిమితం అంది. ఫారం 6లో ఏ మార్పు అయినా చేసే అధికారం పార్లమెంటుకు తప్ప ఇసికి ఎక్కడిదని సుప్రీంకోర్టు ధర్మాసనం నిలదీశాక, ఆ అదనపు డిక్లరేషన్‌ను తొలగించింది. ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరులేని పాత ఓటర్లు ఫారం 6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు అంది. అయితే ఫారం 6 తొలిసారి ఓటర్ల రిజిస్ట్రేషన్‌కు ఉద్దేశించింది తప్ప పాత ఓటర్లకు కాదని, క్రితం జాబితాలో పేరున్న ఓటర్లు తమ పేర్లు సర్‌లో తొలగించబడితే, తిరిగి చేర్పును కోరుతూ ఆ ఫారం సమర్పిస్తే చట్టప్రకారం శిక్షించబడతారనే విషయం బహిర్గతమైనాక, తొలగించే ఓటర్లకు న్యాయం చేసే అవకాశంగా సుప్రీంకోర్టు ఇసి రక్షణకు వచ్చి ఫారం 6 కింద ఓటు పునరుద్ధరణకు అనుమతించింది. బూత్‌స్థాయి అధికారులు ఓటరు ఎన్యూమరేషన్ ఫాంలు సక్రమంగా పంపిణీ చేయలేదని, ఫాంలు తిరిగి కలెక్ట్ చేసుకోలేదని, వారి తప్పుకు ఓటర్లను ఆఫీసు చుట్టూ ఎందుకు తిప్పుకుంటారని సుప్రీంకోర్టులో నిలదీయగా, ఓటర్లు తిరగనక్కర్లేదని, బిఎల్‌ఒలే ఇంటింటికీ వెళ్లి అటువంటి ఫారాలు పూర్తి చేయించి తీసుకువస్తారని, అలాంటి ఓటర్లు అందరూ ఇంటివద్ద ఉండనవసరం లేదనీ, ఎవరో ఒకరు ఉండి వివరాలు తెలియజేస్తే సరిపోతుందని ఎన్నికల కమిషన్ ఒక సడలింపు ఇచ్చింది. తాజాగా మరొక సౌకర్యం ప్రసాదించింది. సర్ పూర్తి అయిన రాష్ట్రాల్లో ఓటర్ల సమ్మరీ రివిజన్ జరుగుతున్నందున అక్కడ పేరు కోల్పోయిన పాత ఓటర్లు ఫారం 6 సమర్పించి ఓటు హక్కు పునరుద్ధరణ కోరవచ్చు. కాగా సర్ ప్రక్రియ పొడిగించబడిన 7 రాష్ట్రాల్లో (ఢిల్లీ, మహారాష్ట్ర, హర్యానా, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, తెలంగాణ, నాగాలాండ్)లో గడ ఎన్యూమరేషన్ ఫారాలు తీసుకుని, తిరిగి ఇవ్వని ఓటర్లకు ఇప్పుడు తిరిగి ఇచ్చే మరో అవకాశం కల్పించింది. ఫారాలుతిరిగి ఇవ్వని వారిని ఎఎస్‌డిడి (గైరు హాజరు, నివాసం మార్పు, మరణం, రెండుచోట్ల ఓటు) కేటగిరిలో పెట్టి ఇసి వారి ఓట్లు తొలగించటం తెలిసిందే. దేశం మొత్తం మీద ఈ కేటగిరి కింద తొలగించబడిన ఓట్లు 13కోట్లకుపైగా ఉన్నాయి. ఒకసారి ఓటరు జాబితాలో చేరిన వారిని (మరణాలు మినహాయించి) తొలగించే హక్కు ఇసికి ఏ చట్టం కింద ఉందన్న ప్రశ్న ముందుకు వచ్చింది. నివాసం మారినవారు ఓటు పునరుద్ధరించుకునేందుకు సుప్రీంకోర్టు ఒక మార్గం సూచించింది. తొలగించబడిన అటువంటి ఓటర్ల జాబితాలను వారి పోలింగ్ బూత్‌లవారీ తయారుచేసి అక్కడ ప్రదర్శించాలని, ఆ విషయాన్ని ప్రచారం చేసి నిర్దేశించిన గడువులోగా వచ్చి పాత ఓటును పరిశీలించుకుని ఓటు పునరుద్ధరణ చేసుకునే అవకాశం ఇవ్వాలని సూచించింది. డూప్లికేట్ ఓటర్ల పేరు తొలగించినందున వారికీ ఇదే అవకాశం కల్పించవచ్చు. అదే సమయంలో, అడ్రసుమారిన ఓటర్లు కొత్త అడ్రసుతో సమర్పించే ఫారం 8లను మూలనపెట్టకుండా వారి అడ్రసు మార్పును అంగీకరించి 'సర్' ప్రక్రియను వర్తింపజేయవచ్చు. నోటీసు ఇచ్చి విచారణ జరపకుండా ఏ ఓటరునూ జాబితానుంచి తొలగించకూడదనే నిర్దేశనను ఎన్నికల కమిషన్ ఉల్లంఘించినందున, ఆ నేరాన్ని సరిదిద్దుకునే అవకాశాన్నిపై ప్రొసీజరల్ మార్పులు ఇస్తున్నాయి.

అయితే 'సర్' ప్రక్రియ ద్వారా పాలక బిజెపిని సర్వసాధారణంగా వ్యతిరేకించే దళితులు, మైనారిటీలు, బలహీనతరగతుల ఓట్లను ఇసి ఉద్దేశపూర్వకంగా తొలగించిందనేది ఇసిపై ప్రధాన ఆరోపణ. బిజెపి అధికారాన్ని శాశ్వతం చేసే వ్యూహాన్ని సిఇసి జ్ఞానేశ్‌కుమార్ అమలు జరుపుతున్నారని, అతన్ని తొలగించాలనేది ఇండియా కూటమి డిమాండ్. హర్యానా, మహారాష్ట్ర, కర్నాటకల్లో బిజెపికి అనుకూలంగా కొన్ని నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితాల్లో గుండుగుత్తగా చేర్పులు, తొలగింపులను గణాంకాలతో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధి బహిరంగపరిచినప్పటికీ సిఇసి చర్యలు తీసుకోకపోగా ఎదురుదాడి చేయటం ఇండియా కూటమి ఆందోళనకు ప్రాతిపదిక. సిఇసి బిజెపి పక్షపాతానికి ఒక్క ఉదాహరణ చాలుః పశ్చిమ బెంగాల్‌లో ఇసి తొలగించిన 90లక్షల ఓటర్ల విజ్ఞప్తుల పరిశీలనకు సుప్రీంకోర్టు హైకోర్టు ద్వారా నియమించిన న్యాయాధికారుల ట్రిబ్యునల్స్ దాదాపు 30లక్షల పేర్లను సరైనవిగా నిర్ణయించి ఓటరు జాబితాలో చేర్చాలని నిర్ణయిస్తే, వాటిపై ఇసి అధికారులు అప్పీలు దాఖలు చేశారన్న వార్త దిగ్భ్రాంతికరం. ఆ అధికారం ఎవరికుందీ, ఎవరు ఆ ఉత్తర్వు ఇచ్చారు, ఎవరు అమలు జరిపారన్న దానిపై స్పష్టత లేదు. బంగ్లాదేశ్ నుంచి పశ్చిమ బెంగాల్, అసోంలలోకి చొరబడిన వలసదారులు 3 కోట్లమందికి ఓటు ఇవ్వాలా, మయన్మార్‌నుంచి చొరబడిన రోహింగ్యాలకు ఓటు ఇవ్వాలా అని హోంమంత్రి అమిత్ షా, ఇతర బిజెపి నాయకులు దేశవ్యాప్తంగా 'మహాపాదయాత్ర' సభల్లో ప్రశ్నిస్తున్నారంటే, తూర్పు రాష్ట్రాల్లో ప్రధానంగా ముస్లింలే లక్ష్యంగా సర్ అమలు జరిగిందని భావించవచ్చు. చొరబాటుదారుల తరఫున ఎవరూ వకాల్తా తీసుకోరు. అయితే 'సర్' ప్రక్రియలో ఎంతమంది విదేశీయులను ఇసి గుర్తించిందో వెల్లడించాలని కోరితే ఉలకరు, పలకరు. ప్రతిపక్ష ఆందోళనతో ఒక మూలకు నెట్టబడిన బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్‌లు దానిపై బురద చల్లటానికి చొరబాటుదారుల ఆరోపణ చేస్తున్నారు. చొరబాటుదారులను అంతర్జాతీయ చట్టాల ప్రకారం గుర్తించటం, వెనక్కు పంపటం, కేంద్ర ప్రభుత్వ బాధ్యత. ఆ పేరుతో ఈ దేశీయులైన ముస్లింల ఓటుహక్కు కూడా హరించటం రాజ్యాంగ విరుద్ధం. ప్రభుత్వ పథకాల మేలు పొందటానికి ఆధారంగా ఉన్న 'ఆధార్'ను తొలగించి, దాని స్థానంలో ఓటరు గుర్తింపు కార్డు ప్రవేశపెట్టాలనే మోదీ ప్రభుత్వ ప్రయత్నం పేదల కడుపుమీద కొట్టే అమానుషమైన ఆలోచన. సుప్రీంకోర్టులో విచారణ కొనసాగేకొలది ఎన్నికల కమిషన్ ఇంకెన్ని మెలికలు తిరుగుతుందో చూదాం! బిజెపి ఎంతగా కొమ్ముగాసినా జ్ఞానేశ్‌కుమార్ నేతృత్వంలోని భారత్ ఎన్నికల కమిషన్ కోల్పోయిన విశ్వసనీయతను పునరుద్ధరించజాలదు!! కాబట్టి ఆయన్ను తొలగించటమే తనను తాను రక్షించుకునే మార్గం. ●

వాస్తవాలు ప్రతిబింబించని

భారతదేశ పేదరికం గణాంకాలు

జ్ఞాన్ పాఠక్

భారతదేశంలో కార్మికుల వాస్తవ సంపాదన (రియల్ ఇన్‌కం)లో మార్పు రాలేదు. ఇటీవల సంవత్సరాలలో ఉపాధి వృద్ధి నాణ్యత తక్కువగా ఉంది. ప్రపంచ బ్యాంకు 2026 అక్టోబర్ 30న భారతదేశాన్ని ఉద్దేశించి విడుదల చేసిన 'పేదరికం – సమానత్వం' నివేదిక ప్రకారం, భారతదేశంలో తీవ్ర పేదరికం 2.6 శాతానికి తగ్గినట్లు నివేదించారు. 'పేదరికం, సంపద, గ్రహం (పావర్టీ, ప్రాస్పరిటీ, ప్లానెట్) – 2026' నివేదికకు 'పేదరిక నిర్మూలనకు కేంద్రం కర్తవ్యం' అని పేరు పెట్టినప్పటికీ, భారతదేశానికి సంబంధించినంత వరకు ఇది పాక్షికంగా మాత్రమే నిజమనిపిస్తోంది. ఈ పేదరిక తగ్గింపు సంఖ్యకు, తీసుకున్న కొలమాన విధానం, ఆధారంగా ఎంపిక చేసిన సంవత్సరం తదితరాంశాలతో సంబంధం ఉంది. ఇది 2026 నాటి క్షేత్రస్థాయి వాస్తవికతను ప్రతిబింబించదు.

2026లో విడుదలైన సంవత్సరాల నాటి డేటా సామాన్య ప్రజలలో చాలా గందరగోళాన్ని సృష్టించింది. ప్రపంచ బ్యాంకు 2021లో లెక్కించిన పిపిపి (కొనుగోలు–శక్తి–సమానత) ఆధారంగా డేటాను లెక్కించింది. భారతదేశ పేదరికం అంచనా ఆదాయంపై కాకుండా వినియోగ వ్యయంపై ఆధారపడి ఉందని, ఇది కొలమానాన్ని తగ్గిస్తుందని, వాస్తవికతను తక్కువగా ప్రతిబింబిస్తుందని దాని ఫుట్‌నోట్స్ ఒకటి అంగీకరించింది. ప్రస్తుత ధరలతో సర్దుబాటు చేసినప్పుడు, భారతదేశం వంటి దిగువ మధ్యతరగతి దేశంలో $4.20 వద్ద దారిద్ర్య రేఖ సుమారు $5.32 అవుతుంది. అప్పుడు పేదరికం శాతం 14.2 శాతం కాకుండా 33 నుండి 36 శాతం మధ్య ఉంటుంది. అదేవిధంగా, $3 అంతర్జాతీయ దారిద్ర్య రేఖ సుమారు $3.73 అవుతుంది. 2026 నాటికి తీవ్ర పేదరికం శాతం కేవలం 2.6 కాకుండా సుమారు 14.2 ఉంటుంది.

సంక్షేమ పథకాలు, విద్య, ఆరోగ్యం, ఆహార ధాన్యాలు లేదా ప్రజలకు ఇచ్చే నగదు వంటి వస్తురూప ప్రభుత్వ సహాయాన్ని కూడా కలిపి లెక్కించిన, పాత, వివాదాస్పద పేదరికపు గణాంకాల ఆధారంగా భారత ప్రభుత్వం తయారుచేసిన వినియోగ వ్యయంపై భారతదేశం, భారతీయులు ఆధారపడకూడదు. ఆదాయం ఆధారంగా పేదరికాన్ని భారతదేశం అంచనా వేయదు. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఒ) ప్రకారం, 2025లో పనిచేసే వారి పేదరిక ప్రమాణం కూడా 3.6 శాతంగా ఉంది. పిఐబి విడుదల చేసిన సమాచారం ప్రకారం, భరించలేని వైద్య ఖర్చుల కారణంగా ప్రతి సంవత్సరం 5.5 కోట్ల మంది ప్రజలు పేదరికంలోకి జారిపోతున్నారు. అంతేకాకుండా, తన మొదటి రెండు పర్యాయాల 10 ఏళ్ల పాలనలో 25 కోట్లకు పైగా ప్రజలను పేదరికం నుండి బయటకు తీసుకువచ్చామని ప్రధాని నరేంద్ర మోదీ కూడా పదేపదే చెప్పారు. ఈ గణాంకాలే భారత పేదరిక గణాంకాలు విశ్వసనీయం కాదని సూచిస్తున్నాయి.

ఇక కార్మిక శక్తి విషయానికొస్తే, ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం, ఇటీవలి కాలంలో అంటే 2017, 2023 మధ్య, సుమారు 13.4 కోట్ల మందికి పైగా ఉపాధి లభించింది. ఇది పని చేసే వయస్సు గల జనాభా పెరుగుదలకు దాదాపు రెట్టింపు. ఈ పెరుగుదలలో అధిక భాగం గ్రామీణ మహిళలు వేతనంతో కూడిన పనిలోకి ప్రవేశించడం, ప్రతి కుటుంబానికి సంపాదించే వారి సంఖ్యను పెంచడంతో సాధ్యమైంది. 2026 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం, 2027 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం మధ్య కార్మిక శక్తి భాగస్వామ్యం, ఉపాధి రేట్లు స్థిరంగా ఉండటంతో, కార్మిక మార్కెట్ పరిస్థితులు చాలావరకు పటిష్టంగా కొనసాగుతున్నాయి. అయితే, ఈ రెండు త్రైమాసికాల మధ్య యువత నిరుద్యోగం 14.6 నుండి 15.9శాతానికి పెరిగింది, ముఖ్యంగా గ్రామీణ యువతులలో ఇది అధికంగా ఉంది. అంతేకాకుండా, ఉపాధి వృద్ధి సాపేక్షంగా తక్కువ ఉత్పాదకత గల కార్యకలాపాలలో కేంద్రీకృత మై ఉండటంతో, వాస్తవ ఆదాయాలు చాలావరకు మారలేదు.

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని కుటుంబాలు గణనీయమైన సంక్షేమ ప్రయోజనాలను పొందాయని, గ్రామీణ భారతదేశంలో వేగవంతమైన పురోగతి గ్రామీణపట్టణ అంతరాన్ని గణనీయంగా తగ్గించిందని ఆ నివేదిక పేర్కొంది. అయినప్పటికీ, పేదరికంలోనే ఉన్న అనేక కుటుంబాలు గ్రామీణ ప్రాంతాల్లోనే నివసిస్తున్నాయి. అక్కడ ఉత్పాదకత తక్కువగా ఉండటంతో పాటు, నాణ్యమైన వ్యవసాయేతర ఉపాధి అవకాశాలు కూడా చాలా పరిమితంగా ఉన్నాయి. పేదరికం కూడా భౌగోళికంగా మరింత కేంద్రీకృతమైంది. చాలా రాష్ట్రాలలో జీవన ప్రమాణాలు మెరుగుపడినప్పటికీ, ఉత్తర ప్రదేశ్ నుండి పశ్చిమ బెంగాల్ వరకు విస్తరించి ఉన్న ఒకే ప్రాంతంలోని కుటుంబాలు భారతదేశంలోని పేద జనాభాలో సుమారు 57 శాతంగా ఉన్నాయి. ఫలితంగా, జాతీయ పేదరికాన్ని మరింత తగ్గించడం అనేది ఈ రాష్ట్రాలలో ఉత్పాదక ఉపాధిని కల్పించడంపైనే ఎక్కువగా ఆధారపడి ఉంటుంది.

కార్మిక మార్కెట్, స్థూల ఆర్థిక డేటాను సవరించినప్పుడు లేదా కొత్త డేటా అందుబాటులోకి వచ్చినప్పు డు, పేదరికంపై ఈ సూచనాత్మక మైక్రోసిమ్యులేషన్ ఆధారిత అంచనాలను నవీకరిస్తామని ఆ నివేదిక పేర్కొంది. ప్రస్తుత పురోగతికి ప్రధానంగా బలమైన వినియోగ వృద్ధి, పెరుగుతున్న ఉపాధి (ముఖ్యంగా మహిళలలో), ఆహార రాయితీలతో సహా విస్తరించిన సామాజిక బదిలీలు దోహదపడ్డాయి. పేదరికం తగ్గుతున్న కొద్దీ, అది తక్కువ విద్య, తక్కువ ఆస్తులు, స్థిరమైన ఉపాధికి పరిమిత అవకాశాలు, అధిక ఆధారపడటం నిష్పత్తులు ఉన్న కుటుంబాలలో ఎక్కువగా కేంద్రీకృతమైంది. అయితే, వేతన వ్యత్యాసాలు స్పష్టంగానే ఉన్నాయి. ఎందుకంటే 2023లో అగ్రశ్రేణి 10 శాతం కార్మికుల మధ్యస్థ ఆదాయాలు, దిగువ 10 శాతం కార్మికుల ఆదాయాల కంటే సుమారు 13 రెట్లు ఎక్కువగా ఉన్నాయి.

వివిధ పేదరిక రేఖల వద్ద, ఆ నివేదిక 2023 సంవత్సరానికి, అంటే మూడు సంవత్సరాల క్రితం నాటి డేటాను వేర్వేరుగా అంచనా వేసింది. అంతర్జాతీయ దారిద్ర్య రేఖ రోజుకు $3.00 డాలర్లు, దీని కంటే తక్కువ ఆదాయం ఉన్న వారిని తీవ్ర పేదరికంలో ఉన్నవారిగా పరిగణిస్తారు. భారతదేశంలో ఈ రేటు 2.6 శాతంగా ఉంది. దిగువ – మధ్యఆదాయ దేశాల ప్రమాణాల ప్రకారం, రోజుకు $4.20 ఆదాయం వద్ద భారతదేశ దారిద్ర్యం రేటు 16.1 శాతంగా ఉంది. అలాగే, ఎగువ–మధ్య ఆదాయ దేశాల దారిద్ర్య రేఖ రోజుకు $8.30 డాలర్ల వద్ద భారతదేశ దారిద్ర్యం రేటు 80 శాతంగా ఉంటుంది.

ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం, భారతదేశానికి భారీ సంపద అంతరం ఉంది. ప్రపంచ సంపద ప్రమాణం 2017లో $25 డాలర్లుగా ఉండగా, 2021 నాటికి అది $28 డాలర్లకు పెరిగింది. ఈ నివేదిక భారతదేశ సంపద అంతరం స్కోరును 4.9గా పేర్కొంది. వినియోగం ఆధారిత భారతదేశ గిని స్కోరు 23గా ఉంది. 2025 నివేదికలో ఇది 25.5 డాలర్లుగా ఉండగా, ఆ తర్వాత ప్రపంచంలో నాలుగవ అత్యంత సమానత్వ దేశంగా పేర్కొనబడింది.

అయితే, ఆదాయం లేదా సంపద ఆధారిత అసమానతలలో, ప్రపంచ అసమానతల డేటాబేస్ (వరల్డ్ ఇనిక్వాలిటీ డేటాబేస్) భారతదేశాన్ని అత్యంత అసమాన దేశాలలో ఒకటిగా పేర్కొంది. దేశంలోని అత్యంత సంపన్నులైన 1 శాతం మంది 40 శాతం సంపదను కలిగి ఉండగా, అట్టడుగున ఉన్న 50 శాతం మందికి జాతీయ ఆదాయంలో కేవలం 15 శాతం మాత్రమే దక్కుతోంది. అత్యంత సంపన్నులైన 10 శాతం మంది ఆదాయం, అట్టడుగున ఉన్న 10 శాతం మంది ఆదాయం కంటే సుమారు 13 రెట్లు ఎక్కువగా ఉంది. వేతనాలు, శ్రామిక శక్తిలో భాగస్వామ్యానికి సంబంధించి తీవ్రమైన అసమానతలు ఉన్నాయి. ముఖ్యంగా మహిళల శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు సుమారు 15.7 శాతంగా మాత్రమే ఉంది.

ప్రపంచ బ్యాంక్ రూపొందించిన 'మల్టీడైమెన్షనల్ పావర్టీ మెజర్' (బహుముఖీన పేదరిక సూచిక) ప్రకారం, 2022లో భారతదేశంలో పేదరిక రేటు 15.5శాతంగా ఉంది. రోజువారీ వినియోగం 3 డాలర్ల కంటే తక్కువగా ఉన్న వారి శాతం 5.3గా ఉంది. కుటుంబంలో ఏ ఒక్క పెద్ద వ్యక్తి కూడా ప్రాథమిక విద్య పూర్తి చేయని పరిస్థితి 13.8 శాతం కుటుంబాల్లో ఉంది. అలాగే, నిర్ణీత ప్రమాణాలు కలిగిన తాగునీటి సౌకర్యం లేని వారు 6.4 శాతం, పారిశుధ్య సౌకర్యం లేని వారు 29.6 శాతం, విద్యుత్ సౌకర్యం లేని వారు 1 శాతం మంది ఉన్నారు.

పేదరిక రేటును పరిశీలిస్తే పట్టణ జనాభాలో 8.6 శాతం, గ్రామీణ జనాభాలో 19.3 శాతం, పురుషులలో 15.7శాతం, మహిళలలో 16.6 శాతం, 14 ఏళ్లలోపు పిల్లలలో 21.8 శాతం, 15–64 ఏళ్ల మధ్య వయస్సు గలవారిలో 14.4 శాతం, 65 ఏళ్లు పైబడిన వారిలో 14 శాతంగా ఉంది. విద్యార్హతల పరంగా చూస్తే, 16 ఏళ్లు పైబడి విద్య అందని వారిలో 21.3 శాతం, ప్రాథమిక విద్య పూర్తి చేసిన వారిలో 17.3 శాతం, మాధ్యమిక విద్య పూర్తి చేసిన వారిలో 14 శాతం, ఉన్నత విద్య (టెర్షియరీ లేదా పోస్ట్‌సెకండరీ) పూర్తి చేసిన వారిలో 7.4 శాతం పేదరికంలో ఉన్నా రు.

ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, భారత ప్రభుత్వం 'ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ యోజన' (పిఎంజికెవై) ద్వారా 81.35 కోట్ల మంది పేదలకు ఒక్కొక్కరికి నెలకు 5 కిలోల ఆహార ధాన్యాలను అందిస్తోంది. అలాగే, 'అంత్యోదయ అన్న యోజన' (ఎఎవై) కింద 2.17 నుండి 2.5 కోట్ల కుటుంబాలకు నెలకు 35 కిలోల ఆహార ధాన్యాలను అందజేస్తోంది. కాబట్టి, పేదరికానికి సంబంధించి ప్రభుత్వ సొంత గణాంకాలను కాదనలేము. ప్రభుత్వం ఈ పథకాలను దేశంలోని శ్రామిక శక్తికి సామాజిక భద్రత కల్పించే మార్గంగా కూడా చూపిస్తోంది. అంతేకాకుండా, అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఒ)ను కూడా ఈ వాదనతో ఒప్పించడంలో ప్రభుత్వం విజయం సాధించింది. భారతదేశంలో సుమారు 90 శాతం మంది అసంఘటి త రంగ కార్మికులు ఉన్నారని, వారికి సామాజిక భద్రతా రక్షణ చాలా తక్కువగా ఉందని లేదా అస్సలు లేదని ఇక్కడ పేర్కొనడం గమనార్హం.

దీపావళి వెలుగులు... కాలుష్యపు నీడలు..

పండుగలు మానవ నాగరికతకు, సంస్కృతి, సంప్రదాయం, సామాజిక ఐక్యత, మానవ సంబంధాలకు ప్రతీకలు. దీపావళి అంటే చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతం. అయితే ఆధునిక కాలంలో పండుగ సంబరాల్లో అంతర్భాగంగా మారిన బాణసంచా వినియోగం పర్యావరణానికి, ప్రజారోగ్యానికి, మానవ భద్రతకు తీవ్రమైన సవాలుగా పరిణమిస్తోంది. కొన్ని క్షణాల పాటు ఆనందాన్ని పంచే బాణసంచా, అనంతరం రోజుల తరబడి కాలుష్యాన్ని, అనారోగ్యాన్ని, ప్రమాదాలను మిగల్చడం ఆందోళనకరం. దీపావళిని కేవలం వేడుకగా కాకుండా పర్యావరణ బాధ్యతతో కూడిన సామాజిక ఉద్యమంగా చూడాల్సిన అవసరం ఉంది.

బాణసంచా తయారీలో పొటాషియం నైట్రేట్, గంధకం, బొగ్గు, క్లోరేట్లు, పెర్క్లోరేట్లు వంటి రసాయనాలను ఉపయోగిస్తారు. రంగురంగుల వెలుగుల కోసం బేరియం, స్ట్రాన్షియం, రాగి, సోడియం, అల్యూమినియం, మెగ్నీషియం వంటి లోహ సమ్మేళనాలను వినియోగిస్తారు. వీటి దహనం వల్ల PM2.5, PM10 సూక్ష్మ ధూళికణాలతోపాటు సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్లు, కార్బన్ మోనాక్సైడ్ వంటి కాలుష్య కారకాలు వాతావరణంలోకి విడుదలవుతాయి. PM2.5 కణాలు ఊపిరితిత్తుల లోతైన భాగాల్లోకి ప్రవేశించి రక్తప్రసరణ వ్యవస్థపై కూడా ప్రభావం చూపగలవు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, ఆస్తమా, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడేవారు అధిక ప్రమాదాన్ని ఎదుర్కొంటారు. కళ్ల మంట, దగ్గు, గొంతు ఇబ్బంది, శ్వాస తీసుకోవడంలో సమస్యలు తక్షణ ప్రభావాలు కాగా, దీర్ఘకాలంలో గుండె, శ్వాసకోశ వ్యాధుల ప్రమాదం పెరగవచ్చు. దీపావళి సమయంలో బాణసంచా కాల్చడం వల్ల గాలిలో సూక్ష్మ ధూళికణాల సాంద్రత గణనీయంగా పెరుగుతుంది. అంతేకాకుండా బాణసంచా అవశేషాలు నేల, నీటిని కలుషితం చేస్తాయి.

ప్రమాదాలు – మానవీయ ప్రభావం

బాణసంచా ప్రమాదంలో కుటుంబానికి జీవనాధారమైన వ్యక్తి గాయపడితే, అతని శారీరక బాధతో పాటు కుటుంబ ఆదాయం నిలిచిపోవడం, పిల్లల చదువు దెబ్బతినడం, వైద్య ఖర్చులు పెరగడం వంటి సమస్యలు తలెత్తుతాయి. అందువల్ల ప్రమాదం వ్యక్తిగత గాయంతో ముగియకుండా కుటుంబ ఆర్థిక, సామాజిక భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది. బాణసంచాను ఇళ్లలో, వంటగదుల సమీపంలో, ఇంధన నిల్వల వద్ద ఉంచకూడదు. బహిరంగ ప్రదేశాల్లో పెద్దల పర్యవేక్షణలో, తగిన దూరం పాటిస్తూ వినియోగించాలి. పేలని టపాసులను తిరిగి వెలిగించకూడదు. కాలిన గాయాలపై ఐస్, నూనె, టూత్‌పేస్ట్ రాయకుండా ప్రవహించే సాధారణ ఉష్ణోగ్రత నీటితో సుమారు 20 నిమిషాలు చల్లబరిచి వైద్య సహాయం పొందాలి. కంటి గాయాలైతే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలి.

భారతదేశంలో తమిళనాడులోని శివకాశి బాణసంచా పరిశ్రమకు ప్రసిద్ధి చెందిన కేంద్రం. ఈ పరిశ్రమ తయారీ కార్మికులు, రవాణా, ప్యాకేజింగ్, ముద్రణ, రసాయనాల సరఫరా, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారాలకు ఉపాధి కల్పిస్తోంది. పరిశ్రమ సృష్టించే ఆదాయంతోపాటు కాలుష్యం వల్ల పెరిగే వైద్య ఖర్చులు, కోల్పోయే పని దినాలు, ప్రమాద బాధితుల పునరావాస వ్యయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. దీనికి 'కాలుష్యకారుడే ఖర్చు భరించాలి' (Polluter Pays Principle) అనే సూత్రాన్ని సమర్థంగా అమలు చేయాలి. భద్రతా ప్రమాణాలు, కాలుష్య నియంత్రణ నిబంధనలు ఉల్లంఘించే సంస్థలు పూర్తి బాధ్యత వహించాలి. CSIR, NEERI పరిశోధనలతో అభివృద్ధి చేసిన గ్రీన్ క్రాకర్స్, సంప్రదాయ బాణసంచాతో పోలిస్తే కొన్ని కాలుష్య ఉద్గారాలను తగ్గించేలా రూపొందించబడ్డాయి. అయితే ఇవి పూర్తిగా కాలుష్యరహితమైనవి కావు. ధృవీకరించిన ఉత్పత్తులనే కొనుగోలు చేయడంతోపాటు బాణసంచా వినియోగాన్ని సాధ్యమైనంతవరకు తగ్గించాలి.

గ్రీన్ దీపావళి – సమిష్టి బాధ్యత

గ్రీన్ దీపావళి అంటే మట్టి ప్రమిదలు వెలిగించడం, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించడం, ప్లాస్టిక్ రహిత అలంకరణలు, మొక్కలు నాటడం, శబ్ద కాలుష్యాన్ని తగ్గించడం, పేదలకు సహాయం చేయడం కూడా ఇందులో భాగమే. కుటుంబాలు, అపార్ట్‌మెంట్ సంఘాలు కలిసి పర్యావరణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఆదా చేసిన మొత్తంతో పేద విద్యార్థులకు పుస్తకాలు అందించడం, సామాజిక సేవా కార్యక్రమాలకు సహకరించడం ద్వారా పండుగకు మరింత అర్థాన్ని తీసుకురావచ్చు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వాలు, పరిశ్రమలు, విద్యాసంస్థ లు, వైద్య రంగం, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలి. బాణసంచా తయారీ, నిల్వ, రవాణా, విక్రయ కేంద్రాల్లో అగ్నిమాపక పరికరాలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, శిక్షణ పొందిన సిబ్బంది తప్పనిసరిగా ఉండాలి. ఆసుపత్రు లు, పాఠశాలలు, వృద్ధాశ్రమాల పరిసరాల్లో తగిన పరిమితులు అమలు చేయాలి. స్వచ్ఛంద సంస్థలు స్థానిక భాషల్లో పోస్టర్లు, సామాజిక మాధ్యమ ప్రచారాలు, పాఠశాల పోటీలు నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంచవచ్చు. ప్రథమ చికిత్స, అగ్నిమాపక భద్రతపై శిక్షణ ఇవ్వడంతోపాటు ప్రమాద బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం, విద్యా సహకారం, ఉపాధి పునరావాసం అందించాలి. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 జీవించే హక్కును, ఆర్టికల్ 48A పర్యావరణ పరిరక్షణలో ప్రభుత్వ బాధ్యతను, ఆర్టికల్ 51A(g) ప్రకృతి పరిరక్షణలో పౌరుల విధిని స్పష్టం చేస్తున్నాయి. దీపావళి వెలుగులు మన ఇళ్లను మాత్రమే కాకుండా మన ఆలోచనలను కూడా ప్రకాశింపజేయాలి. సంప్రదాయాన్ని గౌరవిస్తూనే శాస్త్రీయ దృక్పథాన్ని, పర్యావరణ బాధ్యతను, మానవ భద్రతను ఆచరణలో పెట్టాలి. కొన్ని క్షణాల సంబరాల కోసం ఒక కుటుంబం తన ఆత్మీయుడిని కోల్పోకూడదు. మన భావితరాలకు అందించాల్సింది కాలుష్యపు మబ్బులు కాదు, స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన జీవితం, సురక్షితమైన సమాజం, పచ్చని ప్రకృతి. అదే నిజమైన దీపావళి. అదే బాధ్యతాయుతమైన నాగరికతకు నిదర్శనం.

గిలకత్తుల వెంకటరమణ గౌడ్
9866878769



విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు విప్లవాత్మక చర్యలు

- ఎస్‌టిఎఫ్ రాష్ట్ర విద్యా మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి : ఎస్‌టిఎఫ్ నేతల పిలుపు

ప్రజాపక్షం/హైదరాబాద్ : విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు రాష్ట్రాన్ని దేశంలోనే విద్యారంగంలో అగ్రగామిగా నిలబెడతాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయుల సంఘం (ఎస్‌టిఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 15న హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని ఇంజనీర్స్ భవన్‌లో నిర్వహించనున్న రాష్ట్ర విద్యా మహాసభ పోస్టర్‌ను శనివారం ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పలు కీలక చర్యలు చేపడుతోందని తెలిపారు. ఎస్‌టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు, ప్రధాన కార్యదర్శి యు.పోచయ్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు మహాసభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యా సంస్కరణలు, ఉపాధ్యాయుల సమస్యలు, విద్యారంగ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై మహాసభలో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులకు న్యాయం చేయడం, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం, ప్రభుత్వ విద్యా వ్యవస్థను పటిష్ఠం చేయడం కోసం ఎస్‌టిఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పి.రామమూర్తి, ఎస్.కె.మన్సూర్ అలీ, లచ్చిరాం, బండి నరసింహులు, కుర్ర యాదగిరి, మద్దెల రాజేశం తదితరులు పాల్గొన్నారు.

32 గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.1.60 కోట్ల ఎక్స్‌గ్రేషియా

- కామారెడ్డిలో 15, నిజామాబాద్‌లో 17 మందికి సాయం

ప్రజాపక్షం/నిజామాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రూ.5 లక్షల గల్ఫ్ ఎక్స్‌గ్రేషియా పథకంలో భాగంగా మరో 32 మంది గల్ఫ్ కార్మికుల మృతుల కుటుంబాలకు మొత్తం రూ.1.60 కోట్ల ఆర్థిక సాయం మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయాన్ని తెలంగాణ ప్రభుత్వ ఎన్‌ఆర్‌ఐ అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈనెల 3న సాధారణ పరిపాలన (ఎన్‌ఆర్‌ఐ) శాఖ జారీ చేసిన జిఓ నెం.1603 ద్వారా ఈ ఆర్థిక సాయానికి పరిపాలన అనుమతి లభించింది. ఇందులో కామారెడ్డి జిల్లాకు చెందిన 15 మంది మృతుల కుటుంబాలకు రూ.75 లక్షలు, నిజామాబాద్ జిల్లాకు చెందిన 17 మంది మృతుల కుటుంబాలకు రూ.85 లక్షలు మంజూరు చేశారు. ఒక్కో కుటుంబానికి రూ.5లక్షల చొప్పున మొత్తం కోటి 60 లక్షల ఆర్థికసాయాన్ని ప్రభుత్వం ఆమోదించింది. 2023 డిసెంబర్ 7 నుంచి తెలంగాణకు చెందిన కార్మికులు బెహ్రాయిన్, కువైట్, ఇరాక్, ఓమన్, ఖతర్, సౌదీ అరేబియా, యుఎఈ దేశాల్లో మరణించిన సందర్భంలో వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం గతంలో నిర్ణయించింది.

ఖేలో ఇండియా తెచ్చేందుకు ఎంతో కృషి చేశాం

- క్రీడల అభివృద్ధికి రూ.800 కోట్లు కేటాయించాం
- ప్రతిభ ఉన్నవారికే పతకాలు
- క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణలో త్వరలో ఖేలో ఇండియా క్రీడలు ప్రారంభం కానున్న నేపథ్యంలో యావత్తు దేశ క్రీడాకారుల దృష్టి తెలంగాణపై మళ్లింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో క్రీడా వాతావరణం, క్రీడాకారులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, భవిష్యత్ కార్యాచరణపై క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరితో 'ప్రజాపక్షం' ప్రత్యేక ఇంటర్వ్యూ ఈ విధంగా ఉంది.

ప్రశ్న: తెలంగాణకు ఖేలో ఇండియా క్రీడలు రావడం వెనుక ప్రభుత్వ కృషి ఏమిటి?

మంత్రి : ఖేలో ఇండియా క్రీడలు తెలంగాణకు అంత సులభంగా రాలేదు. రాష్ట్రానికి ఈ పోటీలను తీసుకురావడానికి ప్రభుత్వం ఎంతో కృషి చేసింది. క్రీడల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాం. రాష్ట్రానికి ఖేలో ఇండియా రావడం క్రీడారంగ అభివృద్ధికి ఒక మంచి అవకాశంగా భావిస్తున్నాం.

ప్రశ్న: రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ఎంత ప్రాధాన్యం ఇస్తోంది?

మంత్రి : క్రీడల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.800 కోట్లు కేటాయించింది. క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. క్రీడల్లో ప్రతిభ చూపేవారిని గుర్తించి ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వారికి ఆర్థిక సహాయం అందించడంతో పాటు అర్హతను బట్టి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తున్నాం.

ప్రశ్న: ఇతర దేశాలతో పోలిస్తే తెలంగాణలో క్రీడా మౌలిక సదుపాయాల పరిస్థితి ఎలా ఉంది?

మంత్రి : దక్షిణ కొరియాలో కేవలం 32 ఎకరాల విస్తీర్ణంలోనే క్రీడా కేంద్రాన్ని ఏర్పాటు చేసి, దాని ద్వారా అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నారు. అక్కడ అందుబాటులో ఉన్న పరిమిత స్థలంలోనే క్రీడా పతకాల పంట పండిస్తున్నారు. మన రాష్ట్రంలో వేలాది ఎకరాల భూమి అందుబాటులో ఉంది. సరైన ప్రణాళిక, పట్టుదలతో ముందుకెళ్తే అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయడానికి మనకు అపారమైన అవకాశాలున్నాయి.



ప్రశ్న: ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రభుత్వం ఎలా ప్రోత్సహిస్తోంది?

మంత్రి : క్రీడల్లో రాణించే వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఆర్థిక సహాయం, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ వారి ప్రతిభకు తగిన గుర్తింపు ఇస్తున్నాం. క్రీడాకారులు తమ లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన సహకారం అందించడమే మా ఉద్దేశం. ఇటీవల ఆసియా క్రీడల్లో రెండు స్వర్ణ పతకాలు సాధించిన చికితకు కూడా త్వరలో అన్ని విధాలా సహకారం అందిస్తాం.

ప్రశ్న: క్రీడల ద్వారా యువతకు ఎలాంటి ప్రయోజనం కలుగుతుంది?

మంత్రి : క్రీడలు కేవలం పతకాలకే పరిమితం కావు. ఆటల ద్వారా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే అవకాశం ఉంటుంది. క్రీడాకారుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. యువత చదువుతో పాటు క్రీడలపైనా ఆసక్తి పెంచుకోవాలి. ప్రతిభను సరైన దిశలో ఉపయోగించుకుంటే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చు.

ప్రశ్న: క్రీడల్లో ఆర్థిక స్థితి ఎంతవరకు ప్రభావం చూపుతుంది?

మంత్రి : క్రీడలు డబ్బున్నవారి సొత్తు కాదు. ఎవరి వద్ద నైపుణ్యం, ప్రతిభ, కష్టపడే తత్వం ఉంటాయో వారే పతకాలు సాధిస్తారు. ఆర్థిక పరిస్థితులు ప్రతిభకు అడ్డంకి కాకూడదు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఎంతోమంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారు. వారిని గుర్తించి సరైన శిక్షణ, ప్రోత్సాహం అందిస్తే అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరు. ప్రతిభకు తగిన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం.

ప్రశ్న: ఖేలో ఇండియా పోటీల ద్వారా రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం కలగనుంది?

మంత్రి : ఖేలో ఇండియా పోటీల నిర్వహణతో రాష్ట్రంలో క్రీడలపై ఆసక్తి మరింత పెరుగుతుంది. యువ క్రీడాకారులకు జాతీయ స్థాయి పోటీలను దగ్గరగా చూసే అవకాశం లభిస్తుంది. క్రీడా రంగంలో తెలంగాణను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఈ పోటీలు దోహదపడతాయి. రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని బలోపేతం చేయడంతో పాటు ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించడమే మా ముందున్న లక్ష్యం.

హరీశ్‌రావు కాదు.. అబద్ధాల రావు

- రైతుల కష్టాలపై బిఆర్‌ఎస్ రాజకీయం
- దేవాదుల ద్వారా గతం కంటే 89 శాతం అధికంగా నీటి ఎత్తిపోతలు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శలు


ప్రజాపక్షం/హైదరాబాద్: కరువు పరిస్థితులను అడ్డుపెట్టుకుని రైతులను తప్పుదోవ పట్టించేందుకు బిఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు అసత్య ప్రచారం చేస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. హరీశ్‌రావు కాదు.. అబద్ధాల రావు అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. బోర్లలో నీళ్ల లేక పంటలు ఎండిపోతుంటే విద్యుత్ కోతల వల్ల పంటలు ఎండుతున్నాయంటూ ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కరెంటు కోతల కారణంగా ఇప్పటివరకు ఒక్క ఎకరం కూడా ఎండిపోలేదని, విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించామని స్పష్టం చేశారు. సిఎల్‌పి మీడియా సెంటర్లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడగా రైతుల కష్టాలపై రాజకీయాలు చేయడం తగదన్నారు. ఏప్రిల్ నుంచే రైతులను అప్రమత్తం చేస్తున్నామని, నీటి లభ్యత ఆధారంగా పంటలు సాగు చేసుకోవాలని సూచించామని తెలిపారు. ప్రభుత్వం ఎక్కడా క్రాప్ హాలిడే ప్రకటించలేదని స్పష్టం చేశారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా తమ ప్రభుత్వం గతం కంటే అధికంగా నీటిని ఎత్తిపోస్తోందని ఆది శ్రీనివాస్ వివరించారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో 86.127 టిఎంసిలు ఎత్తిపోస్తే, తమ ప్రభుత్వం 2024–25లో 18.067 టిఎంసిలు, 2025–26లో 18.20 టిఎంసిలు ఎత్తిపోసిందన్నారు. గత



ప్రభుత్వ వార్షిక సగటుతో పోలిస్తే 89 శాతం అధికంగా నీటిని వినియోగంలోకి తెచ్చామని పేర్కొన్నారు. ప్రస్తుత ఏడాది తొలి ఐదు నెలల్లోనే 16.71 టిఎంసిలు ఎత్తిపోశామని, సీతారామసాగర్ ద్వారా మరో 8.10 టీఎంసీలు ఎత్తిపోసినట్లు తెలిపారు. మొత్తం 24.81 టిఎంసిల నీటితో వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించామన్నారు. మేడిగడ్డ కుంగిపోవడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో సీపేజీ సమస్యలు గత ప్రభుత్వ వైఫల్యాలకు నిదర్శనమని విమర్శించారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు నిర్మాణానికి మహారాష్ట్రతో చర్చలు ప్రారంభించామని తెలిపారు. కృష్ణా జలాల పంపిణీలో గత ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేసిందని, ఏపికి 512 టిఎంసిలు, తెలంగాణకు 299 టిఎంసిలు అంగీకరించిందని ఆరోపించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణకు 558 టిఎంసిల న్యాయమైన వాటా సాధించేందుకు పోరాడుతున్నారని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

రైతన్న కన్నీరు.. పట్టించుకోని ప్రభుత్వం

- కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి
- బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉపనేత తన్నీరు హరీశ్‌రావు



ప్రజాపక్షం/సిద్దిపేట : రాష్ట్రంలో కరువు పరిస్థితుల వల్ల ఒకవైపు దాదాపు 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు కన్నీళ్లు పెడుతుంటే.. మరొకవైపు పండిన కాస్త పంటను అమ్ముకుందామంటే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో, ముఖ్యంగా దొడ్డు వడ్లు పండించిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేట మార్కెట్ యార్డులో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బిఆర్‌ఎస్‌ఎల్పీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, సిద్దిపేట, మెదక్ తదితర జిల్లాల్లో కురుస్తున్న అకాల వర్షాల వల్ల కళ్లాలలో, ఐకెపి సెంటర్లలో, పిఎసిఎస్ సెంటర్లలో, మార్కెట్ యార్డులలో పోసిన వడ్లు తడిసిపోయి, వరదకు కొట్టుకుపోతున్నాయన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఏ కొనుగోలు కేంద్రానికి కూడా ప్యాడీ క్లీనర్లు గానీ, టార్పాలిన్ కవర్లు గానీ, మాయిశ్చర్ మీటర్లు గానీ చేరలేదు. వడ్లు కొన్న తర్వాత తరలించడానికి అవసరమైన లారీల ట్రాన్స్‌పోర్ట్ టెండర్లు ఇంతవరకు ఫైనల్ చేయలేదు; ఏ గ్రామం వడ్లు ఏ మిల్లుకు వెళ్లాలనే 'మిల్ అలాట్‌మెంట్' కూడా ఇప్పటికీ జరగలేదన్నారు. మూలిగే నక్క మీద తాటిపండు పడ్డట్టుగా రైతుల పరిస్థితి తయారైంది. అసలు మార్కెటింగ్‌శాఖ మంత్రి నిధులు అడగడం లేదా? లేక ఆర్థిక శాఖ మంత్రి మార్కెటింగ్ శాఖను చిన్నచూపు చూస్తున్నారా? అని ప్రశ్నించారు. మరోవైపు మార్కెటింగ్ శాఖలో పోస్టులన్నీ ఖాళీగా పెట్టి ఇన్‌ఛార్జీల పాలన నడిపిస్తున్నారు. స్వయంగా సిద్దిపేటలోనే మార్కెట్ సెక్రటరీ పోస్టు ఖాళీగా ఉంది, జిల్లా మార్కెటింగ్ అధికారి పోస్టు కూడా ఖాళీగానే ఉంది. ఒక్కో అధికారి నాలుగు జిల్లాలకు, 20 మార్కెట్ యార్డులకు ఇన్‌ఛార్జిగా ఉంటే రైతులకు ఏరకంగా మేలు జరుగుతుంది? వెంటనే మార్కెటింగ్ శాఖలో ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చి, ఖాళీలను భర్తీ చేయాలి. ఇన్‌ఛార్జి వ్యవస్థను రద్దు చేసి ప్రతి జిల్లాకు, ప్రతి మార్కెట్‌యార్డుకు శాశ్వత అధికారులను నియమించాలని వ్యవసాయ శాఖ మంత్రిని డిమాండ్ చేశారు.

దీపావళితో ప్రతి ఇంటా సుఖసంతోషాలు

- ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం ప్రజాపాలనలో భాగంగా ప్రజల జీవితాల్లోని చీకట్లను తొలగించి, వారి బతుకుల్లో కొత్త వెలుగులు నింపే లక్ష్యంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. అన్ని వర్గాల సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళికి విశిష్టమైన ప్రాధాన్యత ఉందన్నారు. దీపాల వెలుగులతో ఇళ్లను, పరిసరాలను అలంకరించుకుని ప్రజలంతా పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. దీపావళి కాంతులు ప్రతి ఇంటా సుఖసంతోషాలను నింపాలని, ప్రజల జీవితాలు ఆయురారోగ్యాలు, సిరిసంపదలు, శాంతి సౌభాగ్యాలతో వెల్లివిరియాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. పండుగ సంబరాల వేళ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ కాలుష్యానికి తావులేకుండా, ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చిన్నారులు, పెద్దలు అందరూ సురక్షిత వాతావరణంలో దీపావళి పండుగను ఆనందంగా జరుపుకోవాలని సిఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

ప్రతి ఇంటా దీపావళి వెలుగులు: భట్టి

దీపావళి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు నింపాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

బిసి విద్యార్థులకు అగ్రికల్చర్‌లో 60 సీట్లు

- 8 నుంచి దరఖాస్తులు.. 13వ తేదీ చివరి గడువు: బడుగు సైదులు

ప్రజాపక్షం/హైదరాబాద్ : బిసి విద్యార్థులకు వ్యవసాయ విద్యలో ఉన్నత అవకాశాలు కల్పించేలా పిజెటిఎయు అనుబంధ కళాశాలల్లో బిఎస్‌సి (ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సుల్లో 60 స్పాన్సర్డ్ సీట్లను భర్తీ చేయనున్నట్లు మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బిసి గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు తెలిపారు. ఈనెల 8 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభమవుతాయని, 13వ తేదీతో గడువు ముగుస్తుందని పేర్కొన్నారు.

టిజి ఎప్‌సెట్-2026 ర్యాంకులతో ప్రవేశాలు

ఇంటర్‌లో బైపిసి లేదా తత్సమాన కోర్సు పూర్తి చేసి, టిజి ఎప్ సెట్ 2026లో అర్హత సాధించిన తెలంగాణ బిసి విద్యార్థులు మాత్రమే ఈ సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని సైదులు సూచించారు. అభ్యర్థులు బిసి గురుకుల జూనియర్ కళాశాలల్లో చదివి ఉండాలి లేదా బిసి సంక్షేమ వసతి గృహాల్లో బోర్డర్లుగా ఉండి ఇంటర్ విద్యను అభ్యసించి ఉండాలన్నారు. అభ్యర్థుల ఎంపిక ఎప్ సెట్ ర్యాంకుల ఆధారంగా జరుగుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంత విద్యార్థుల ఆదాయం రూ.2 లక్షలకు మించకూడదన్నారు. దరఖాస్తు రుసుము రూ.200 చెల్లించి, అవసరమైన ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అర్హులైన విద్యార్థులు ug.mjptbcwreis.net లేదా mjptbcwreis.telangana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సైదులు తెలిపారు. సందేహాల కోసం 040 23328266 నంబరులో హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని, mjpadmissioncell@gmail.comకు మెయిల్ చేయవచ్చని పేర్కొన్నారు.

రాహుల్‌గాంధీని అడ్డుకుంటామనడం సిగ్గుచేటు : బీర్ల

ప్రజాపక్షం/హైదరాబాద్ : కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తెలంగాణకు వస్తే అడ్డుకుంటామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు వ్యాఖ్యానించడం సిగ్గుచేటని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ కుటుంబానికి చెందిన రాహుల్ గాంధీని అడ్డుకునే దమ్ము, ధైర్యం బిజెపి నేతలకు లేదన్నారు. శనివారం సిఎల్‌పి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ వైపు కన్నెత్తి చూసినా తెలంగాణ ప్రజలు సహించరని హెచ్చరించారు. తెలంగాణ ప్రజలు ఎనిమిది మంది బిజెపి ఎంపిలను గెలిపించినా రాష్ట్రానికి కేంద్రం చేసిందేమీ లేదని విమర్శించారు. తెలంగాణ ప్రయోజనాలను పట్టించుకోకుండా రాజకీయ విమర్శలకు దిగుతున్న బిజెపి నాయకులను ప్రజలు నిలదీస్తారని బీర్ల అయిలయ్య హెచ్చరించారు.



ముర్రేడు ముంపు ప్రాంతాల్లో కూనంనేని సాంబశివరావు పర్యటన

- అధికారులతో కలిసి రిటైనింగ్ వాల్ మార్గాల పరిశీలన
- త్వరలో రక్షణ గోడల పనులు ప్రారంభం

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ముర్రేడు వాగు వరద ముప్పునకు శాశ్వత పరిష్కారంగా రక్షణ గోడల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. ముర్రేడువాగుపై రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.50.50 కోట్ల నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో శనివారం ఆయన సంబంధిత శాఖాధికారులు స్థానిక నాయకులు ప్రజలతో కలిసి వాగు పరివాహక ప్రాంతాల్లో విస్తృతంగా క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. శ్రీనగర్, ప్రశాంతినగర్, సాయినగర్ తదితర ముంపునకు గురైయ్యే లోతట్టు కాలనీలను వాగు పరిసరాలను ప్రత్యక్షంగా పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ గత పాలకులు ఈ దీర్ఘకాలిక సమస్యను పూర్తిగా విస్మరించడంతో ఏళ్ల తరబడి భారీ వర్షాలకు వాగు పొంగి ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారన్నారు. శ్మశానవాటికలకు వెళ్లే మార్గాలు సైతం మునకకు గురైన కష్టాలు పడ్డారని గుర్తు చేశారు. ప్రజల కష్టాలను స్వయంగా చూసి ముంపు సమస్యకు రక్షణ గోడ నిర్మాణమే శాశ్వత పరిష్కారమని భావించి మూడేళ్లగా నిరంతరం పట్టుబట్టి రూ.50.50 కోట్ల నిధులను తీసుకొచ్చామని చెప్పారు. త్వరలోనే పనులకు శ్రీకారం చుట్టి బాధితులకు వరద భయాల నుండి పూర్తి విముక్తి కలిగిస్తామని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నియోజకవర్గాభివృద్ధికి రాజీలేని రీతిలో నిరంతరం శ్రమిస్తామని ఆయన పునరుద్ఘాటించారు. కూనంనేని వెంట నాయకులు నేరెళ్ల రమేష్, వాసిరెడ్డి మురళీ, లగడపాటి రమేష్ చౌదరి, మిరియాల రాము, నూనావత్ గోవింద్, సపావత్ రవితోపాటు పలువురు అధికారులు బస్తీల వాసులు పాల్గొన్నారు.

రేవంత్ హోరు... జెన్ జీ, జెన్ ఆల్ఫా జోరు..



వెలిచాల రాజేందర్ రావు
సీనియర్ కాంగ్రెస్ నాయకులు

నాయకుడి కథను గెలుపుల లెక్కతో మాత్రమే చదవలేం. ఓటమి తర్వాత వేసిన అడుగులూ చూడాలి. 2018 లో కొడంగల్‌లో ఓడి, 2019లో మల్కాజిగిరి నుంచి గెలవడం, 2023లో కామారెడ్డిలో కెసిఆర్‌కు సవాల్ విసిరి ఓడినా, కొడంగల్‌లో విజయం సాధించడం, ఇది గేమ్ ఓవర్ కాదు, పిక్చర్ అభీ బాకీ హై అన్న రాజకీయ ప్రయాణం. ఓటమి ఒక ఎపిసోడ్ మాత్రమే. నెక్స్ట్ ఎపిసోడ్ రాయాల్సింది పట్టుదల, అభిమన్యుడి ధైర్యం, అర్జునుడి గురి ఉండాలి. చివరికి ప్రజల జీవితాల్లో కనిపించే ఫలితమే అసలైన స్కోర్.

కల పెద్దది, దారి గట్టిది

రైతు కుటుంబంలో పుట్టి, హైదరాబాద్‌లో ఫైన్ ఆర్ట్స్ చదివిన రేవంత్ రెడ్డి, రాజకీయాల్లోకి రాకముందే ఒక రోజు ముఖ్యమంత్రి అవుతా అని అన్నారని సన్నిహితుడి జ్ఞాపకం. అప్పట్లో అది పెద్ద మాట. వెనక్కి చూస్తే తనకు తానే పెట్టుకున్న టార్గెట్. జెడ్‌పిటిసి మెంబర్ నుంచి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపి, ముఖ్యమంత్రి దాకా ప్రతి మెట్టూ పోరాటంతోనే. పడితే లేవాలి, లేస్తే ముందుకు నడవాలి.. ఆ ప్రయాణం చెప్పే సింపుల్ లెసన్ ఇదే. వివేకానందుడి మాటల్లో: లేవండి, మేల్కొనండి, లక్ష్యం చేరే వరకు ఆగకండి.

రీల్స్ దాటి రియల్ లైఫ్ మార్చే ఆలోచనలు

ఓట్ సే వాయిస్.. వాయిస్ సే ఛాయిస్..

18 ఏళ్లకే ఓటు వేస్తున్న యువత 21 ఏళ్లకే చట్టసభలకు ఎందుకు పోటీ చేయకూడదు? ఎమ్మెల్యే, ఎంపిగా పోటీ చేసే కనీస వయస్సును 25 నుంచి 21కి తగ్గించాలనే ఆలోచనతో, తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంటుకు పంపాలన్న ప్రతిపాదన చర్చకు వచ్చింది. తీర్మానం ఒక్కటే చట్టం మార్చదు. రాజ్యాంగ, చట్ట సవరణలు పార్లమెంటు పరిధిలోనే. అయినా మన ఫ్యూచర్ గురించి మనమే మాట్లాడాలి అనే జెన్ జీ మాటను జాతీయ వేదికకు తీసుకెళ్లడం మంచి స్టార్ట్. అప్నా ఫ్యూచర్, అప్నా ఫైస్లా యువత పోస్టర్లు మోసే చేతులుగానే కాదు, పాలసీ రాసే మైండ్స్‌గానూ ఎదగాలి.

క్లాస్ రూమ్ నుంచి ప్లే గ్రౌండ్ దాకా ఫుల్ పవర్

యంగ్ ఇండియా పాఠశాలలు, స్కిల్స్ యూనివర్సిటీ, క్రీడా విశ్వవిద్యాలయం వీటి అసలు వాల్యూ భవనాల పేర్లలో కాదు, పిల్లలకు దక్కే అవకాశాల్లో ఉంది. మంచి టీచర్లు, ల్యాబ్స్, డిజిటల్ లెర్నింగ్, కోచింగ్, పోషకాహారం. ఫ్యూచర్ రెడీ అని చెప్పడం ఈజీ కాదు. అసలు స్కోర్ బోర్డ్ మాత్రం ఉద్యోగం దొరికిందా, ఆటగాడు ఎదిగాడా, చేతికి స్కిల్ వచ్చిందా అన్నదే. డిగ్రీ కే సాత్ స్కిల్ భీ, మెడల్ కే సాత్ మౌకా భీ అప్పుడే ఫుల్ ప్యాకేజ్. జెన్ ఆల్ఫాకి కలలు చూపడమే కాదు, వాటిని చేరే స్టెప్స్ కూడా వేయాలి.



ఫామ్ నుంచి ఫ్యూచర్ సిటీ దాకా..

ఎఐ, లైఫ్ సైన్సెస్, ఆధునిక పరిశ్రమలు, భారత్ ఫ్యూచర్ సిటీతెలంగాణకు కొత్త అవకాశాల తలుపులు తెరవగలవు. కానీ, సిటీ సూపర్ అంటే ప్రజల జీవితం కూడా సూపర్ కావాలి. డెవలప్‌మెంట్ కా మత్లబ్ స్కైలైన్ మాత్రమే కాదు, ఇంటింటి ఇన్‌కం కూడా. రైతుకు నీరు, మార్కెట్, నిల్వ, ప్రాసెసింగ్; కార్మికుడికి గౌరవ వేతనం, భద్రత, స్కిల్; యువతకు స్థానిక ఉద్యోగం ఇవి ప్యాకేజీలో ఉండాలి. హైదరాబాద్‌తో పాటు కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ కూడా గ్రోత్ మ్యాప్‌లో బలమైన కేంద్రాలవ్వాలి. రైతు, వర్కింగ్ క్లాస్, టెక్ రంగం కలిసి నడిచినప్పుడే తెలంగాణ రైజింగ్ – 2047కు రియల్ మీనింగ్ వస్తుంది.

విజన్ వైరల్ కావాలి, డెలివరీ గ్రౌండ్ మీద కనిపించాలి

రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, మహిళల ప్రయాణ సౌకర్యం వంటి పథకాలు అర్హుల చేతికి సమయానికి చేరాలి. నాణ్యమైన పాఠశాల, పనిచేసే ఆసుపత్రి, స్థిరమైన ఉద్యోగం, ఆదాయం ఇచ్చే వ్యవసాయం కూడా అంతే ముఖ్యం. రీల్స్‌లో విజన్ ఒక నిమిషం.. గ్రౌండ్ మీద డెలివరీకి రోజువారీ పని కావాలి. చుక్కాని ఉంటేనే పడవ గమ్యానికి చేరుతుందిప్రకటనకు టైమ్ లైన్, అమలుకు అకౌంటబులిటీ, ప్రజలకు కనిపించే రిజల్ట్ జత కావాలి.

బర్త్ డే విష్‌కి మించి, ప్రజల ఆశ

ఈ జన్మదినం సందర్భంగా తెలంగాణ ప్రజల తరఫున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు. ఈ ఆలోచనలు యువతకు చదువు, క్రీడ, ఉద్యోగం, నాయకత్వంలో నిజమైన అవకాశాలుగా మారాలి; రైతు, కార్మికుడి జీవితాల్లోనూ మార్పు కనిపించాలి. జహా చాహ్, వహా రాహ్ (ఎక్కడ ఆకాంక్ష ఉంటుందో.. అక్కడ దారి ఉంటుంది...) కానీ ఆ దారిని తెరవాల్సింది నిర్ణయాలూ, అమలూ. బర్త్ డే విష్ మాటల్లో... అసలైన గిఫ్ట్ యువతకు తెరుచుకునే కొత్త ద్వారాల్లో.

డైరెక్టర్ కార్యాలయం, హెరిటేజ్ డిపార్ట్‌మెంట్
(పూర్వపు పురావస్తు మరియు మ్యూజియం శాఖ) తెలంగాణ ప్రభుత్వం, గన్‌ఫౌండ్రీ, హైదరాబాద్.
ఫైల్ నెం. S1/934/2024 టెండర్ల ఆహ్వాన ప్రకటన (NIT) - (2వ పిలుపు) తేదీ: 06-11-2026
కింది ప్రదేశంలో తవ్వకాలు జరుపుతున్నారు:

క్ర.సం.	పని పేరు	ECV
1.	నారాయణపేట్ జిల్లా, కృష్ణ మండలం, ముడుమల్ గ్రామంలో మెగాలిథిక్ శ్మశానవాటిక	రూ.39,97,300/-

టెండర్ల దాఖలు స్వీకరణకు చివరి తేదీ: 16-11-2026 మరియు అదే రోజు మధ్యాహ్నం 3.00 గంటలకు టెండర్లు తెరవబడతాయి. మరిన్ని వివరాల కోసం దయచేసి సందర్శించండి: tender.telangana.gov.in.
సం/- ప్రొఫెసర్ అర్జున్ రావు కుతడి, డైరెక్టర్
DIPR R.O. No. : 13319-PP/CL/ADVT/2026-27, Date: 07-11-2026

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
గాజులరామారం సర్కిల్-57

NIT No. & Date	పని పేరు	అంచనా విలువ / ఇసివి	డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ	బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం	టెండర్ ఆహ్వానించు అథారిటీ వివరాలు
29/DB/EE/ Gajularamaram Circle-57/ CMC/2026-27	సిసి రోడ్లు : 1	రూ. 35.00 లక్షలు	09.11.2026 మ.2.00 గం.లకు	12.11.2026 మ.2.30 గం.ల వరకు	ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 9154299633; హెడ్ డ్రాఫ్ట్స్‌మెన్, సెల్ నెం. 9063836115

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గాజులరామారం సర్కిల్-57, సిఎంసి.
DIPR R.O. No. : 13299-PP/CL/ADVT/2026-27, Date: 07-11-2026



సమస్యల పరిష్కారానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు వినతి

ప్రజాపక్షం/కూకట్‌పల్లి : కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారం, స్థానిక అభివృద్ధి అంశాలపై రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్‌తో కాంగ్రెస్ పార్టీ జెఎసి నాయకులు శనివారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్థానికంగా నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనులు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు తదితర అంశాలపై మంత్రితో కాంగ్రెస్ నాయకులు చర్చించారు. ప్రజల సమస్యలను సావధానంగా విన్న మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ సానుకూలంగా స్పందించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాధు ప్రతాప్ రెడ్డి, ఏ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పట్లోళ్ల నాగిరెడ్డి, కూకట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు శేరి సతీష్‌రెడ్డి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి బి.సంజీవరావు, క్రిస్టియన్ మైనార్టీ చైర్మన్ మేకల మైఖేల్, డివిజన్ సీనియర్ నాయకులు కొండల్‌రెడ్డి, ఇసుక శ్రీనివాస్‌రెడ్డి, డివిజన్ మాజీ కాంగ్రెస్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్, కంటెస్టెడ్ కార్పొరేటర్ అభ్యర్థి పెసరి విట్టల్‌రెడ్డి, అల్లాపూర్ సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్ వంతెనకు మోక్షమెప్పుడు?

ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : ఘట్‌కేసర్‌లో రైల్వే వంతెన నిర్మాణం, రహదారి విస్తరణ పనులను వేగవంతం చేయడంతో పాటు పెండింగ్ అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ కోరారు. ఈ మేరకు శనివారం అఖిలపక్ష నాయకులు మాజీ ఎంపిపి బండారి శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్, మారం లక్ష్మీ రెడ్డి, చితల యాదయ్య, బచ్చు ప్రమోద్ గుప్తా, సిరాజ్, బచ్చు నాగేష్‌కుమార్ గుప్తాలు కలిసి మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. వంతెన నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న మిగిలిన ఇళ్ల యజమానులకు పరిహారం అందించి, తొలగింపు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఇళ్ల సమస్యతో రహదారి విస్తరణ, వంతెన నిర్మాణ పనులు నిలిచిపోతున్నాయని వివరించారు.అలాగే లక్కీ వైన్స్ నుంచి మాధవరెడ్డి వంతెన వరకు సిసి రహదారి, కరీంగూడ చౌరస్తా నుంచి సాయిగూడెం వరకు రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేసి ఘట్‌కేసర్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు.

'మహిళల కొనుగోళ్లు' పరిశోధనపై డాక్టరేట్

ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : మహిళలు అన్‌లైన్‌లో చిన్న వంటగది ఉపకరణాలను కొనుగోలు చేసే సమయంలో ప్రభావితం చేసే అంశాలపై పరిశోధన చేసి అనురాగ్ విశ్వవిద్యాలయ పరిశోధక విద్యార్థి సంతోష్ కుమార్ కూర డాక్టరేట్ పట్టా సాధించారు. అక్టోబర్ 9న నిర్వహించిన తుది మౌఖిక పరీక్షలో పరిశోధనను విజయవంతంగా పూర్తి చేశారు. ఉత్పత్తుల ధర నాణ్యత వినియోగ సౌలభ్యం, ఉపయోగకర ఆన్‌లైన్ సమీక్షలు మహిళల కొనుగోలు నిర్ణయాలపై చూపే ప్రభావాన్ని ఆయన విశ్లేషించారు. ఈ పరిశోధనకు నిర్వహణ విద్యావిభాగం సహ ఆచార్యులు డా.జి మహేందర్ మార్గదర్శకత్వం వహించారు. తుది పరీక్షకు కర్ణాటక ఎన్‌ఐటి సూరత్కల్ సహ ఆచార్యులు డా.బాజునా సి.మోహన్ బాహ్య పరీక్షకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా వ్విద్యాలయ డీన్లు విభాగాధిపతులు సంతోష్ కుమార్‌ను అభినందించారు. పరిశోధనకు మార్గదర్శకత్వం వహించిన డా.జి.మహేందర్‌ను సైతం ప్రశంసించారు.

అండర్-14 ఆర్చరీ పోటీల్లో లక్ష్మికి స్వర్ణం




ప్రజాపక్షం/బోడుప్పల్: జిల్లా స్థాయి అండర్–14 ఆర్చరీ పోటీల్లో ఉప్పల్ ప్రాంతానికి చెందిన విద్యార్థిని చామల లక్ష్మి అభయ్‌రెడ్డి ప్రథమస్థానంతో స్వర్ణపతకం సాధించింది. ఉప్పల్‌లోని మెరిడియన్ పాఠశాలలో ఆమె ఆరవ తరగతి చదువుతూ చిన్నతనం నుండే క్రీడల పట్ల ఆసక్తి కనపరిచేది. కోచ్ స్రవంతి వద్ద శిక్షణ పొందుతున్న విద్యార్థిని జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని కనపరచిన అద్భుత ప్రతిభతో ప్రథమస్థానం దక్కించుకొంది. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం లక్ష్మి ని అభినందిస్తూ భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో విజేతగా నిలవాలని ఆకాంక్షించారు.

1500 మందికి ఉచిత రేషన్ కిట్లు

ప్రజాపక్షం/చర్లపల్లి: సమాజ సేవే లక్ష్యంగా ముకుల్ మాధవ్ ఫౌండేషన్ (ఎంఎంఎఫ్), ఫినోలెక్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో చర్లపల్లిలో నిర్వహించిన భారీ ఉచిత రేషన్ కిట్ల పంపిణీ కార్యక్రమానికి ఉప్పల్ ఎంఎల్‌ఎ బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా నమోదు చేసుకున్న అర్హులైన పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులతో కూడిన 1500 రూపాయల విలువతో కూడిన రేషన్ కిట్లను అందచేశారు.

విద్యుత్ షాక్‌తో కార్మికుడు మృతి



ప్రజాపక్షం/శామీర్‌పేట : విద్యుత్ షాక్‌తో కార్మికుడు మృతి చెందిన సంఘటన జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. జీనోమ్‌వ్యాలీ ఇన్స్‌పెక్టర్ గురువయ్య గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు మండలం, క్షీరసాగర్ గ్రామానికి చెందిన గుడిపల్లి నరేందర్‌రెడ్డి (40) అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని హెచ్‌బిఎల్ ఇంజనీరింగ్ లిమిటెడ్ కంపెనిలో క్యాజువల్ వర్కర్ (షిఫ్ట్ ఆపరేటర్)గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి సమయంలో విధులు నిర్వహిస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై కిందపడిపోయాడు. గమనించిన తోటి కార్మికులు, యాజమాన్యం అతడిని అంబులెన్స్‌లలో మెడిసిటి ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సిఐ గురువయ్య గౌడ్ తెలిపారు.

మెరుగైన మౌలిక సదుపాయాల అమలుకు

ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక

ఎంఎంసి కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : పారిశుద్ధ్య నిర్వహణను పటిష్టం చేయడం, ప్రజలకు మెరుగైన రహదారి సదుపాయాలు కల్పించడం, పచ్చద నం పెంపొందించడం, మౌలిక సదుపాయాల నిర్వహణను మెరుగుపరిచేందుకు పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక చేపడుతామని ఎంఎంసి కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి అన్నారు. ఉప్పల్ సర్కిల్ పరిధిలో శనివారం విస్తృతంగా క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గత తనిఖీల్లో గుర్తించిన సమస్యలపై తీసుకున్న చర్యలను కమిషనర్ స్వయంగా పరిశీలించారు. గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్ వద్ద పేరుకుపోయిన చెత్తను పూర్తిస్థాయిలో తొలగించి, ఆ ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం ద్వారా పరిశుభ్రతను కాపాడాలని ఘన వ్యర్థాల నిర్వహణ విభాగం అధికారులను ఆదేశించారు. రాంకీ సంస్థతో సమన్వయం చేసుకుంటూ గుర్తించిన అన్ని జివిపిల ను నిర్ణీత సమయంలోగా శుభ్రపరచాలని, చెత్త తొలగింపులో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు.

పారిశుద్ధ్య కార్మికుల హాజరును పరిశీలించిన కమిషనర్, దీర్ఘకాలంగా విధులకు హాజరుకాని కార్మికులపై తగిన చర్యలు తీసుకోవాలని, ప్రత్యామ్నాయ సిబ్బందిని ఏర్పాటు చేసి పారిశుద్ధ్య సేవలకు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. ఫుట్‌పాత్‌లు, రహదారుల మార్జిన్‌ల వెంట పెరిగిన పిచ్చిమొక్కలు, పొదలను తొలగించి పాదచారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. నాలా ఫెన్సింగ్‌ను కప్పివేసిన తీగజాతి మొక్కలు, అనవసర వృక్షాలను తొలగించాలని అధికారులను ఆదేశించారు.నాలా వెంబడి రహదారులపై ఉన్న గుంతలను పూడ్చడం, ప్యాచ్‌వర్క్ పనులను పూర్తి చేయడంతో పాటు, రహదారులపై పేరుకుపోయిన నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను వెంటనే తొలగించాలన్నారు. ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో పగటిపూట వీధి దీపాలు వెలుగుతున్న విషయాన్ని గమనించిన కమిషనర్, విద్యుత్ వృథాను అరికట్టేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఉప్పల్ భగాయత్‌లో ప్రతిపాదిత ఎంఎంసి స్పోర్ట్స్ అరేనా స్థలాన్ని సందర్శించి, రాబోయే నెలల్లోపే స్థానిక ప్రజలు, యువత, చిన్నారులు వినియోగించుకునేలా మైదానాన్ని సమతలంగా తీర్చిదిద్ది, అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.



ఎంఎంసి పాత దుస్తుల సేకరణ : 'వస్త్రసేత' వినూత్న కార్యక్రమం ప్రారంభం

ఇళ్లల్లో పేరుకొనిపోయే పాత దుస్తులను అవసరమైన నిరుపేదలకు అందివ్వటంతో పాటు పునర్వినియోగంలోకి తెచ్చే లక్ష్యంగా మల్కాజిగిరి నగరపాలక సంస్థ వినూత్న కార్యక్రమం చేపట్టింది. దీని కోసం ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి శనివారం 'వస్త్రసేత' పేరిట నూతన కార్యక్రమాన్ని ప్రధాన కార్యాలయంలో ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంఎంసి పరిధి ప్రాంతాల్లో పాత దుస్తుల సేకరణ కోసం ప్రత్యేక వాహనాల ద్వారా అన్ని సర్కిల్ ప్రాంతాల్లో సేకరిస్తామని, వీటిని అవసరం ఉన్న వారికి వినియోగించుకొనేందుకు ఇవ్వగా మిగిలిన వాటిని అప్‌సైక్లింగ్ విధానంతో తిరిగి ఉపయోగపడే వస్తువులుగా మార్చేందుకు ప్రణాళిక సిద్ధం చేసామన్నారు. తమ ఇళ్లల్లో పేరుకొని పోయే పాత దుస్తులు తరచు చెత్తలో పడేస్తుంటారని, దీనివల్ల పర్యావరణానికి తీవ్రమైన నష్టం వాటిల్లుతోందన్నారు. పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజలందరూ భాగస్వాములై స్వచ్ఛందంగా తమ ఇళ్లలోని పనికి రాని దుస్తులను అందించాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, చీఫ్ సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, స్వచ్ఛ భారత్ మిషన్ బృందం, గూంజ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు ఎత్తివేతకు 15 నుండి రిలే నిరసన దీక్షలు

జెఎసి హెచ్చరిక



ప్రజాపక్షం/జవహర్ నగర్ : జవహర్ నగర్ డంపింగ్ యార్డును తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 15 నుండి రిలే నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట సమితి (జెఎసి) చైర్మన్ షేక్ షావలి ప్రకటించారు. నవంబర్ 7న శనివారం కీసర సర్కిల్, జవహర్ నగర్‌లోని నీలం రాంచంద్రయ్య భవనంలో జరిగిన జెఎసి కో కన్వీనర్ల సమావేశం అనంతరం ఆయన మీడియా సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు.

30 గ్రామాల పరిధిలోని 40లక్షల మంది ప్రజల ఆరోగ్యం, భద్ర త కోసం ఈ పోరాటం జరుగుతోంది. గడువు తేదీతో కూడిన స్పష్టమైన లిఖితపూర్వక ప్రణాళికను ప్రభుత్వం ప్రకటించకపోతే, రిలే దీక్షల అనంతరం కలెక్టరేట్ ముట్టడి, ప్రభావిత ప్రాంతాల్లో పాదయాత్రలు చేపడతాం.

నాయకుల తీరుపై అసంతృప్తి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు (కాంగ్రెస్, బిజెపి) ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటూ కాలయాపన చేస్తున్నాయని మండిపడ్డారు. ఎంపి ఈటల రాజేందర్, డిసిసి అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ ఇటీవల చేపట్టిన కార్యక్రమాలు ప్రజా ఆందోళనల ఫలితమేనని, అయితే పర్యావరణ అనుమతుల రద్దు, నిధులపై ఇప్పటికీ స్పష్టత లేదని పేర్కొన్నారు.

మచ్చ బొల్లారం చెత్త తరలింపుపై హెచ్చరిక

మచ్చ బొల్లారానికి చెందిన చెత్తను జవహర్ నగర్‌కు తరలించేందుకు ప్రభుత్వం భూ కేటాయింపులు జరుపుతున్నట్లు వస్తున్న వార్తలపై జెఎసి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అదే నిజమైతే ప్రజా గ్రహా న్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించింది. ఈ సమావేశంలో జెఎసి గౌరవ సలహాదారు లు రావల్ కోల్ నర్సింహ్మ గౌడ్, మాజీ కార్పొరేటర్ మేకలలిత యాదవ్, కోశాధికారి శివబాబు, కోకన్వీనర్లు సిపిఐ, సిపిఐఎం,నాయకులు శివ నారాయణ, ఆలూరి రాజశేఖర్, వివిధ రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

భూముల అమ్మకాలపై చర్చకు సిద్ధం

బండి రమేష్ సవాల్



ప్రజాపక్షం/కూకట్‌పల్లి: తెలంగాణ ప్రభుత్వం భూములను అమ్ముకుంటోందంటూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసిన ఆరోపణలను టిపిసిసి ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ తిప్పికొట్టారు. అభివృద్ధి, సంక్షేమం, ప్రభుత్వ భూముల విక్రయాలపై తాను బహిరంగ చర్చకు సిద్ధమని, దమ్ముంటే కృష్ణారావు తన ఆరోపణలపై నిలబడాలని సవాల్ విసిరారు. శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గ పార్టీ కార్యాలయం హేమదుర్గ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బండి రమేష్ మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేసే సమయంలో నోరు సంభాళించుకుని మాట్లాడాలని హెచ్చరించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలను దృష్టిలో పెట్టుకుని సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల ను కొనసాగిస్తోందన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కృష్ణారావు, టిఆర్‌ఎస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. గత టిఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంపై భారీగా అప్పుల భారం మోపిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల అక్రమణలు, అక్రమ నిర్మాణాలకు కృష్ణారావు, ఆయన అనుచరులే కారణమని ఆరోపించారు. హౌసింగ్ బోర్డు అభివృద్ధికి రూ. 2వేల కోట్ల ఖర్చు చేశానన్న కృష్ణారావు వ్యాఖ్యలపై ఆధారాలు చూపించాలని, దీనిపైనా బహిరంగ చర్చకు సిద్ధమని తెలిపారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కృష్ణారావు కూకట్‌పల్లి అభివృద్ధికి ఏ ల్యాండ్‌మార్క్ ప్రాజెక్టులు తీసుకొచ్చారో ప్రజలకు వివరించాలని బండి రమేష్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఐటి, పారిశ్రామిక రంగాల తో పాటు అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెందుతోందన్నారు. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం 11ఎకరాలు కేటాయించిందని, తొలి విడుతలో 400 ఇళ్ల నిర్మాణం ప్రారంభమైందని తెలిపారు. రెండో విడత లో మరో 3వేల ఇళ్ల నిర్మాణం త్వరలో ప్రారంభమవుతుందని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రతి డివిజన్‌లో పర్యటిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని బండి రమేష్ పేర్కొన్నా రు.

పెళ్లి పత్రికలు పంచడానికి వెళ్లి అనంతలోకాలకు..

పెళ్లి కూతురు ఇంట్లో పత్రికలు ఇచ్చి తిరుగు వస్తుండగా కెమికల్ ట్యాంకర్ ఢీకొని పెళ్లి కొడుకు తండ్రి, పెద్ద నాన్న దుర్మరణం

ప్రజాపక్షం/శామీర్‌పేట : మరి కొద్ది రోజుల్లో ఆ ఇంట్లో పెళ్లి బాజాలు మోగాల్సి ఉండగా పెళ్లి కొడుకు తండ్రి, పెద్ద నాన్న రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన హృదయ విదారక సంఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కీసర మండలం, యాద్గార్‌పల్లికి చెందిన పుట్ట శ్రీరాములు (46) తన కుమారుడి పెళ్లి ఈ నెల 20న నిశ్చయించారు. పెళ్లి కొడుకు తండ్రి పుట్ట శ్రీరాములు తన సోదరుడైన పుట్ట చిత్తయ్య (60) తో కలిసి పెళ్లి కూతురు గ్రామమైన పాములపర్తిలో పెళ్లి పత్రికలు ఇవ్వడానికి (ఎపి 29 పి 2834) నెంబర్ గల ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. పత్రికలు ఇచ్చి తిరుగు ప్రయాణంలో మూడుచింతలపల్లి మున్సిపాలిటి నాగిశెట్టిపల్లిలోని ఫౌల్ట్రీపామ్ వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన పారిశ్రామిక వ్యర్థజలాల కెమికల్ ట్యాంకర్ (టిజి 12యు 6246) వాహనాన్ని డ్రైవర్ అతి వేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతు వీరిద్దరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అన్నదమ్ములు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ ఘోర రోడ్డు ప్రమాదాన్ని చూడటానికి ప్రజలు పెద్ద ఎత్తున గుమిగూడారు. ఘటన స్థలానికి చేరుకున్న బంధువుల రోదనలతో అక్కడ ఉన్నవారు కన్నీటి పర్యంతమయ్యారు. పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.








ఖైదీల వ్యవసాయ క్షేత్రం పర్యవేక్షణాధికారిగా అశోక్‌కుమార్

ప్రజాపక్షం/చర్లపల్లి: చర్లపల్లి ఖైదీల వ్యవసాయ క్షేత్రం పర్యవేక్షణాధికారిగా అశోక్ కుమార్ శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు అశోక్ కుమా ర్ నిజామాబాద్ జైలు పర్యవేక్షణాధికారిగా పనిచేసి బదిలీపై చర్లపల్లికి వచ్చారు. చర్లపల్లి వ్యవసాయ క్షేత్రంలో పర్యవేక్షణాధికారిగా పనిచేసిన భరత్ హెడ్ ఆఫీసుకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా జైలు సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. అధికారులు, ఖైదీల సహకారంతో జైలు అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.



జీడిమెట్ల ఇఎస్ఐ అస్పత్రిలో ఎఐటియుసి కమిటీ ఏర్పాటు

ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ : జీడిమెట్ల ఇఎస్ఐ ఆస్పత్రిలో మెడికల్ ఎంప్లాయీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అనుబంధ కార్మికుల సమావేశం శనివారం నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కామ్రేడ్ ఎండి యూసుఫ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ కార్మికులంతా ఐక్యంగా సంఘటితమై పోరాడినప్పుడే తమ సమస్యలను సాధించుకోగలమన్నారు. జీడిమెట్ల ఇఎస్ఐ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు వెంటనే బకాయి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ విషయాన్ని ఆస్పత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అనంతరం జీడిమెట్ల ఇఎస్ఐ అస్పత్రి ఎఐటియుసి కమిటీని ప్రకటించారు. అధ్యక్షురాలిగా వాణి, ప్రధాన కార్యదర్శిగా గిరి, ఉపాధ్యక్షులుగా చంద్రకళ, షహనాబేగం, కార్యదర్శులుగా సోని, బాబురావు, చంద్రకళ, కోశాధికారిగా కుమారస్వామిని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా హరినాథరావు, సలహాదారుగా శ్రీనివాస్‌లను నియమించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షుడు హరినాథరావు, ఇఎస్ఐ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా దీపావళి పండుగ

ప్రజాపక్షం/చర్లపల్లి: భారతీయ సంస్కృతికి, సంప్రాదాయాలకు ప్రతీకగా నిలిచే దీపావళి చెడుపై మంచి, చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగని నారాయణ పాఠశాల ఎజిఎం పురుషోత్తంరెడ్డి అన్నారు.ఇసిఐఎల్ నారాయణ సిబిఎస్‌సి పాఠశాలలో ప్రిన్సిపల్ మంజు భార్గవి ఆధ్వర్యంలో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని దీపాలంకరణ,రంగోలి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలను ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యార్థులు జ్ఞానం క్రమశిక్షణ, మానవత్వం అనే వెలుగులను తమ జీవితాల్లో నింపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే సిఎం రేవంత్ లక్ష్యం

కంజర్ల విజయలక్ష్మి

ప్రజాపక్షం/తాండూరు: మహిళా సాధికారతే సిఎం రేవంత్ అన్న లక్ష్యమని కంజర్ల విజయలక్ష్మి అన్నారు. శనివారం కంజర్ల విజయలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యాన తాండూరులో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సిఎం రేవంత్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని అందరి సమక్షంలో కంజర్ల విజయలక్ష్మి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒంటరి మహిళలకు నిత్యావసర సరుకులను అందజేశారు. మహిళ సాధికారత కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

చిన్నారులకు కొండంత అండ బిఎస్‌ఆర్

కష్టకాలంలో భరోసా...చిన్నారులతో దీపావళి సంబరాలు



ప్రజాపక్షం/తాండూరు: ఏడాది క్రితం తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారుల కు ఆర్‌బిఎల్ సిఇఒ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి అండగా నిలిచారు. యాలాల మండల పరిధి హాజీపూర్‌కు చెందిన భవాని, శివలీల చిన్నారులు బస్సు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయిన విషయం తెలిసిందే. శనివారం ఆ చిన్నారులతో కలసి బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి దీపావళి సంబరాలు జరుపుకోవడంతో పాటు చిన్నారుల జీవితాలలో వెలుగు నింపడానికి ముందు కొచ్చారు. ఏడాది క్రితం వారిని పరామర్శించిన ఆర్‌బిఎల్ సిఈఒ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి చిన్నారుల చదువు, భవిష్యత్తుకు అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. నాడు ఇచ్చిన మాటకు కట్టబడి దీపావళి పండుగ సందర్భంగా శనివారం చిన్నారులను కలిసి ఆప్యాయంగా పలకరించడంతో పాటు వారికి స్వీట్లు, ఆర్థిక సహాయం అందజేసి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్నారులతో కొంత సమయాన్ని గడిపిన శ్రీనివాస్‌రెడ్డి వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కష్టకాలంలో ఇచ్చిన భరోసాను మరిచిపోకుండా ఏడాది గడిచినా అదే ఆప్యాయతో చిన్నారులను పలకరించి పండుగ ఆనందాన్ని పంచుకోవడంతో పాటు వారికి ఆర్థికంగా అండగా నిలువడం పట్ల గ్రామ పెద్దలు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దలు, మండల నాయకులు, గ్రామ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్‌ఎచ్‌ఎం ఉద్యోగులు నిరవధిక సమ్మె

ప్రజాపక్షం/వికారాబాద్ : వైద్యాఆరోగ్య శాఖ నేషనల్ హెల్త్ మిషన్ విభాగంలో 20సంవత్సరాలుగా వివిధ విభాగాల్లో 77కేడరల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఓట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని 26రోజులుగా నివవధిక సమ్మె చేస్తున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమ్మె చేస్తున్న ఉద్యోగులకు సరైన హామీ ఇవ్వడం లేదని అవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు నిరంత రం అందుబాటులో ఉంటూ వైద్య ఆరోగ్య సేవలు అందిస్తున్న కరోనా, ఎటువంటి పరిస్థితుల్లోనైనా విధులు నిర్వహించామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో 31శాతం ఉన్న ప్రసవాలను 70శాతానికి పెంచామన్నారు. మాతా–శిశు ఆసుపత్రుల్లో మాతృమరణాల రేటును తగ్గించామన్నారు. రాష్ట్రంలో శిశుమరణాల రేటు 15నుండి 5శాతానికి తగ్గించామన్నారు. ఐబి నిర్మూలనలో జాతీయస్థాయిలో తెలంగాణను3వ స్థానంలో ఉంచామన్నారు. ఎన్‌ఎచ్‌ఎం ఉద్యోగులను ప్రభుత్వం గుర్తించి క్రమబద్ధీకరణ చేయాలన్నారు.

ఆధునిక దంత వైద్య సేవలు అందించడమే లక్ష్యం



ప్రజాపక్షం/ఎల్‌బినగర్ : ప్రజలకు ఆధునిక దంత వైద్య సేవలు అందించడమే లక్ష్యం అని డాక్టర్ చిలువేరు మనోజ్ కుమార్ అన్నారు. శనివారం కర్మన్ ఘాట్‌లోని మాధవ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్ట్రీమ్ డెంటల్ కేర్, మ్యాక్సిలోఫేషియల్ అండ్ ఇంప్లాంట్ సెంటర్‌ను సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యతమైన వైద్య సేవలు అందించి వారి మన్ననలు పొందాలని వారు అకాంక్షించారు. పేద ప్రజలకు సరసమైన ధరలకు సేవలు అందే విధంగా కృషి చేయాలని డాక్టర్‌ను కోరారు. అనంతరం డాక్టర్ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ చిలువేరు ప్రభుత్వ దంత వైద్య కళాశాల, ఆసుపత్రి, విజయవాడలో ఓరల్ అండ్ మ్యాక్సిలోఫేషియల్ సర్జరీ విభాగంలో పీజీ(ఎండిఎస్) పూర్తి చేశారు. అనంతరం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ బోధనతో పాటు వైద్య సేవల్లో అనుభవం సంపాదించారు. ప్రస్తుతం స్ట్రీమ్ డెంటల్ కేర్ ద్వారా సాధారణ దంత వైద్యం, దంత ఇంప్లాంట్లు, రూట్ కెనాల్ చికిత్స, ఓరల్ అండ్ మ్యాక్సిలోఫేషియల్ సర్జరీ, ముఖ ఎముకల ఫ్రాక్చర్ల చికిత్స, దంతాల అమరిక, కాస్మెటిక్ డెంటిస్ట్రీ తదితర ఆధునిక వైద్య సేవలను అందించనున్నారు. నాణ్యమైన వైద్యం, అందుబాటులో ఉండే వైద్య సేవలను అందించడమే తమ ప్రధాన లక్ష్యమని డ. మనోజ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాధవ నగర్ కాలనీ అధ్యక్షులు గోపాల్ ముదిరాజ్, పలువురు వైద్యులు, స్థానికులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం జిజిఎం ఆసుపత్రిలో ఘనంగా శిశు సంరక్షణ దినోత్సవం



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : వనస్థలిపురంలోని జిజియం ఏరియా ఆసుపత్రిలో మదర్ తెరిసా చారిటబుల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో శనివారం శిశు సంరక్షణ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెడియట్రిషన్ డాక్టర్. శ్వేత ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పిల్లలకు మొదటి సంవత్సరం చాలా ముఖ్యమని వారు తీసుకునే జాగ్రతలు వల్ల మొత్తం జీవితం సులువుగా ఉంటుందన్నారు. ఆరోగ్యకరమైన బిడ్డ పుట్టాలని, తల్లులు న్యూట్రిషన్ ఫుడ్ అండ్ మంచి ఆహారం తీసుకున్నప్పుడే తల్లి కాన్పు జరుగుతందన్నారు. తల్లి పాలు 6 నెలల పాటు ఇవ్వడం మంచిదని, సకాలంలో టీకా వేపించడం వల్ల పిల్లలకు ఇన్ఫెక్షన్ రాకుండాదోహదపడుతుందని ఆమె తెలిపారు.పరిశుభ్రమైన నీళ్ల తాగడం వల్ల బిడ్డ మొదటి సంవత్సరం ఆరోగ్యకరంగా ఉంటారని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం ఆసుపత్రిలో గర్భిణీలు వైద్యం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మదర్ తెరిసా చారిటబుల్ సొసైటీ చైర్మన్ చేపూరి శంకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి. నాగేందర్, సిఎస్ఆర్ఎంఓ దామోదర్ రావు, ఆర్ఎంఓ రుచిక సంధ్య, డాక్టర్ అబ్దుల్ రెహమాన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎండిన పంటలకు పరిహారం చెల్లించాలి



ప్రజాపక్షం/కొందుర్గు: ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పర్వతాపూర్ సర్పంచ్ బోయ అశోక్ కోరారు. శనివారం కొందుర్గు మండల పరిధిలోని పర్వతాపూర్ గ్రామంలో ఎడిపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బోయ అశోక్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాలు కురవక పంటలు ఎండిపోతున్నాయని, దాంతో రైతులు తీవ్ర నష్టాలకు గురి కావాల్సి వస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులతో సర్వేలు నిర్వహించి నష్టపరిహారం చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కొందుర్గు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం ఇచ్చేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. నష్టపోయిన ప్రతి ఎకరాకు రూ.50వేల చొప్పున నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎఒ వాసవి, ఉప సర్పంచ్ దామోదర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అరుణ, వార్డు సభ్యులు మరాఠి సురేష్, రైతులు గాలయ్య, కుమార్ పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలకు భంగం కలిగించకుండా భవనం నిర్మించండి

ప్రజాపక్షం/కొందుర్గు: మహనీయుల విగ్రహాలకు భంగం కలిగించకుండా గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను మరో ప్రాంతంలో చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శనివారం కొందుర్గు మడల కేంద్రంలో బిక్షపతి ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నేతలు మాట్లాడుతూ అభివృద్ధికి అడ్డంగా లేము కానీ మహనీయుల విగ్రహాల ముందు నిర్మాణాన్ని అపివేసే ప్రదేశంలో కట్టడాలను కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

యువతకు విదేశీ భాషల్లో ఉచిత శిక్షణ

జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ అధికారి కోట్ల నవీన్ కుమార్ రెడ్డి

ప్రజాపక్షం/రంగారెడ్డి: మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే లక్ష్యంతో తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్ అండ్ కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్ (టిజిఎంఎస్‌సి,సిసిసి), హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ, స్టడీ మెటీరియల్ పంపిణీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ అధికారి కోట్ల నవీన్ కుమార్ రెడ్డి తెలిపారు. మైనారిటీ వర్గాలకు చెందిన అర్హులైన అభ్యర్థులకు జపనీస్, జర్మన్, ఫ్రెంచ్, కొరియన్ భాషల్లో 45 రోజుల పాటు ఉచిత ఫౌండేషన్ కోర్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముస్లిం, క్రైస్తవ, సిక్కు, జైన, పార్సీ, బౌద్ధ మతాలకు చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని, ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులతో పాటు ఉద్యోగ అవకాశాలను అన్వేషిస్తున్న నిరుద్యోగ యువతకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. అర్హులకు స్టడీ మెటీరియల్ కూడా ఉచితంగా అందజేస్తారని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ నవంబర్ 10వ తేదీతో ముగుస్తుందని, ఆ తర్వాత తరగతులు ప్రారంభమవుతా యని వెల్లడించారు. అదేవిధంగా తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టిజిపిఆర్‌బి) నిర్వహించే పోలీస్ కానిస్టేబుల్,సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) పరీక్షలతో పాటు టిజిపిఎస్ సి గ్రూప్ 1,గ్రూప్2,గ్రూప్3,గ్రూప్4 పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న మైనారిటీ నిరుద్యోగ యువతకు ఉచితంగా పుస్తకాలు, స్టడీ మె టీరియల్ అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నవంబర్ 12, 2026లోగా జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

సిద్దాపూర్‌కు డంపింగ్ యార్డు రానివ్వం

- మరో ప్రాంతానికి తరలింపు
- ముఖ్యమంత్రితో సహా మంత్రుల సమన్వయంతో స్థల పరిశీలన
- పేదల ఆస్తులను పరిరక్షించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు
- ఆర్‌డి, తహసీల్దార్ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తా
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి



ప్రజాపక్షం/షాద్‌నగర్/కొత్తూరు: సిద్దాపూర్‌కు చెత్త డంపింగ్ యార్డును రానివ్వమని..మరో ప్రాంతానికి తరలించేందుకు స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వివరించారు. శనివారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ డివిజన్‌లోని నందిగామ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎంపిడివో ఆఫీస్, మహిళా సమాఖ్య ఆఫీస్, అంగన్‌వాడి భవనం, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, బస్‌స్టేషన్‌ను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి ప్రారంభించారు. తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి, నందిగామ నుండి నర్సప్పగూడ వరకు రూ.7కోట్ల నిర్మించనున్న బిటి రోడ్డుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సిద్దాపూర్ చెత్త డింపింగ్ యార్డు విషయాన్ని ముఖ్యమంత్రితో సహా మంత్రుల వద్దకు తీసుకువచ్చారని వివరించారు. దాంతో ముఖ్యమంత్రి స్పందించి మరో ప్రాంతానికి తరలించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఏళ్ళ తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు రీ సర్వేలను ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వివరించారు. శాటిలైట్ సిస్టమ్ ద్వారా భూముల రీ సర్వేలు చేసి క్యూఆర్ కోడ్‌తో కూడిన నూతన పట్టాదారు పాస్‌పుస్తకాలను రైతులకు అంధించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రీ సర్వేలు పూర్తి చేయడంతోపాటు సర్వే మ్యాప్‌లను సైతం రైతులను అందిస్తామని, ఎలాంటి భూ సమస్యలు లేకుండా శాశ్వత పరిష్కారాలను చూపించడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లేడు చౌదరిగూబ మండల పరిధిలోని వెంకిర్యాల గ్రామంలో ఏళ్ళ తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను జిల్లా కలెక్టర్‌తో సహా రెవిన్యూ అదనపు కలెక్టర్, తహశీల్దార్‌లు వెళ్ళి పరిష్కరించడంతోపాటు నూతన పట్టాదారు పాస్‌పుస్తకాలను ఇచ్చామని గుర్తు చేశారు. ఫరూక్‌నగర్ మండల పరిధిలోని వెల్‌జర్ల గ్రామంలో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, త్వరలోనే ఈ సమస్యను నియంత్రించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో మొదటి విడతలో 70రెవిన్యూ గ్రామాలను ఎంపిక చేసి 10,400 గ్రామాల్లో రీ సర్వేలు సైతం పూర్తి చేశామని గుర్తు చేశా రు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 10లక్షల రెవిన్యూ ధరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే 80శాతం పరిష్కరించినట్లు తెలిపారు.

2.25లక్షల ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు పూర్తి

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రెండు విడుతల్లో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లలో ఇప్పటి వరకు 2.25లక్షల ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవడంతోపాటు గృహప్రవేశాలు చేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వివరించారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ఇందిరమ్మ లబ్ధిదారులతో కలిసి ఈ దీపావళి..మా దీపావళి అనే కార్యక్రమాన్ని కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల బిల్లు సైతం పెండింగ్‌లో లేకుండా నేరుగా లబ్దిదారుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని, మధ్యవర్తుల ప్రమయం, అవినీతి లేకుండా పారదర్శకంగా పరిపాలన సాగిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి మొదటి విడతలో 3500ఇందిరమ్మ ఇండ్లు, రెండవ విడతలో 2000వేల ఇండ్లు మంజూరు చేశామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను ప్రణాళిక బద్దంగా అమలు చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వివరించారు. పదేళ్ళల్లో బిఆర్ఎస్ చేయలేని పనులు తాము చేస్తున్నామని, దాంతోనే బిఆర్ఎస్ నేతలు నోటికి వచ్చినట్లు అబద్దాలు మాట్లాడుతున్నాయని మండిపడ్డారు. కాళేశ్వరం పేరుతో లక్ష కోట్ల నిధులు నీటి పాలు చేశారని, వీటన్నింటిని కప్పి పుచ్చుకునేందుకే ప్రజా ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు మొదలు పెట్టారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, కిరణ్మయి, ఆర్‌డిఓ సరిత, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పిటిసిలు శ్యాంసుందర్‌రెడ్డి, విశాల శ్రావణ్‌రెడ్డి, మార్కెట్ కమిటి చైర్ పర్సన్ సులోచన, కాశీనాథ్‌రెడ్డి, మండల పార్టీల అధ్యక్షులు, సింగిల్ విండోల చైర్మెన్లు, సర్పంచులు పాల్గొన్నారు.

22ఎ భూ సమస్యలపై చొరవ చూపాలి

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/షాద్‌నగర్: 22ఏ భూ సమస్యలను నియంత్రించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ కోరారు. శనివారం నందిగామ మండల కేంద్రానికి మంత్రి వచ్చిన నేపథ్యంలో ఎమ్మెల్యే పలు సమస్యలను వారి దృష్టికి తీసుకు వెళ్ళారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ శాఖల పరిధిలో ఉన్న 22ఏ నిషేధిత భూ సమస్యలతో సామాన్య ప్రజలు, రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.దీనిపై సమగ్ర విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. చిన్న చిన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు స్థానిక ఆర్‌డిఒలకు, తహశీల్దార్లకు అధికారాలు ఇచ్చేందుకు కృషి చేయాలని మంత్రిని ఎమ్మెల్యే కోరారు. రైతులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఈ విషయాలను మీ దృష్టికి తీసుకువస్తున్నట్లు వివరించారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ త్వరలో నే రెవిన్యూ సమస్యలను పరిష్కరించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి మా ట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అందిస్తున్న ఇందరమ్మ ఇళ్లు అద్భుతంగా ఉన్నాయని, నాణ్యత ప్రమాణాలతో నిర్మిస్తున్నారని వివరించారు. ఇందిరమ్మ ఇండ్లతో పేదల ముఖాల్లో సంతోషం వ్యక్తమవుతుందని, ఇలాగే కొనసాగిస్తే రాష్ట్రంలో నిలువ నీడలేని పేదవాడంటూ ఎవరూ మిగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎల్..3 జాబితాలోని సాంకేతిక సమస్యలను పరిష్కరించి మరి కొంతమందికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చేలా చూడాలని కోరారు. నియోజకవర్గంలో రూ.200కోట్లతో ప్రభుత్వం అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ పాఠశాలను నిర్మిస్తుండటం భావితరాల భవిష్యత్‌కు భరోసా కలిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపిలు శివశంకర్ గౌడ్, ప్రియాంక గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ, మండల పార్టీల అధ్యక్షుడు ఎల్లా రం శేఖర్‌రెడ్డి, దేపల్లి కుమారస్వామి గౌడ్, రాయికల్ శ్రీనివాస్, రమేష్, పురుషోత్తంరెడ్డి, చంద్రశేఖర్, మున్సిపల్ చైర్మెన్ బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్, సయ్యద్ సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

21లోగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలి

అధికారులకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆదేశాలు



ప్రజాపక్షం/రంగారెడ్డి: అర్హులైన ప్రతి ఓటరుకు తుది ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తామని రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులైన ఓటర్లకు మరో అవకాశం కల్పించేలా సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శనివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన, డూప్లికేట్ (ఎఎస్‌డిడి) కేటగిరీలలో గుర్తించబడి ముసాయిదా జాబితాలో పేర్లు లేని అర్హులైన ఓటర్లకు మరో అవకాశం కల్పించాలని ఎన్నికల సంఘం నిర్ణయించిందన్నారు. అర్హులైన ఓటర్ల జాబితాలను పోలింగ్ కేంద్రాలు,గ్రామ పంచాయతీలు, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రదర్శించడంతో పాటు ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి అర్హులైన ఓటర్లను సంప్రదించి ఎన్యుమరేషన్ ఫారాలు అందజేయాలని, వాటి సమర్పణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనుబంధం ఎ,బి,సి ద్వారా అవసరమైన వివరాలు, ప్రకటన పత్రాలు సమర్పించవచ్చని తెలిపారు. సంబంధిత ఇఆర్ఓ, ఎఇఆర్ఓ, బిఎల్ఓలకు నేరుగా లేదా ఇసిఐ నెట్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇప్పటికే అదే చిరునామాలో నివసిస్తున్న వారు తగిన ప్రకటనతో పాటు ఎన్యుమరేషన్ ఫారం సమర్పించాలని సూచించారు. రాష్ట్రంలోనే మరో ప్రాంతానికి నివాసం మారిన వారు పాత, కొత్త చిరునామాల వివరాలతో పాటు నివాస ధ్రువీకరణ పత్రాన్ని జత చేసి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో కొత్త ఓటరు నమోదుకు ఇప్పటికే ఫారం6 సమర్పించిన వారు తిరిగి ఎన్యుమరేషన్ ఫారం సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియపై విస్తృత ప్రచారం నిర్వహించి ఈ నెల 21వ తేదీలోగా పూర్తి చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి శారదాదేవి,ఎన్నికల విభాగం అధికారి రవీంద్ర దత్తు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించండి



ప్రజాపక్షం/శంకర్‌పల్లి: మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని గ్రామ సర్పంచ్ బలవంత్ రెడ్డి చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి వస్తోందని, దీంతో దుర్వాసనతో పాటు దోమల బెడద పెరిగి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామంలో మురుగు కాలువల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. అదేవిధంగా ప్రధాన రహదారులపై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలని,వివిధ కాలనీల్లో సిసి రోడ్లు లేకపోవడంతో వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. సర్పంచ్ వినతిపై ఎమ్మెల్యే కాలె యాదయ్య సానుకూలంగా స్పందించి, గ్రామ అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు బలవంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జడ్జిగా ఎంపికైన ఆగీరు లక్ష్మీ ప్రసాద్‌ను అభినందించిన మాజీ ఎమ్మెల్యే



ప్రజాపక్షం/షాద్‌నగర్: నూతనంగా జడ్జిగా ఎంపికైన ఆగీరు లక్ష్మీ ప్రసాద్‌ను స్థానిక మాజీ శాసన సభ్యులు వై.అంజయ్య యాదవ్ అభినంధించారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలో వారి నివాసానికి వెళ్ళి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి ప్రత్యేకంగా అభినంధించారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ చిన్నతనంలోనే న్యాయమూర్తిగా ఎంపిక కావడం అభినందనీయమని, భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్‌ను బంగారుమయంగా మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పివైస్ చైర్మన్ ఈట గణేష్, మున్సిపల్ అధ్యక్షుడు ఎంఎస్ నటరాజన్, కౌన్సిలర్ ఎస్పీ శివ, మాజీ కౌన్సిలర్ వెంకట్‌రాంరెడ్డి, నందకిశోర్, నాయకులు చీపిరి రవి యాదవ్, జమాల్‌ఖాన్, శివాజీ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఎలక్ట్రానిక్ వస్తువులతో వినియోగదారులకు మోసం

- నకిలీ ఐఫోన్లు, ఆపిల్ వాచీలను అసలైనవిగా నమ్మించి విక్రయం.. ఒకరి అరెస్ట్
- నిందితుడి నుంచి 2 ఐఫోన్లు,4 స్మార్ట్ వాచీలు, 7చెవిలో పెట్టుకునే పరికరాలు స్వాధీనం
- మరో నిందితుడి కోసం పోలీసుల గాలింపు

ప్రజాపక్షం/రంగారెడ్డి: నకిలీ, నకలుగా తయారు చేసిన ఐఫోన్లు, ఆపిల్ వాచీలు, చెవిలో పెట్టుకునే పరికరాలను అసలైనవిగా నమ్మించి విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్న వ్యక్తిని రాయదుర్గం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి పలు ఎలక్ట్రానిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనపై నేర సంఖ్య 1267/2026 తో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నవంబర్ 7న అల్తమాష్ (26) అనే వ్యక్తిని అరెస్టు చేశారు. ఇతను హైదరాబాద్‌లోని మలక్‌పేట, సైదనగర్‌లో నివాసం ఉంటూ నకిలీ ఎలక్ట్రానిక్ వస్తువుల విక్రయానికి పాల్పడుతున్నట్లు గుర్తించారు.ఇతని స్వస్థలం ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ జిల్లా మురాద్‌నగర్ కాగా నిందితుడు నకిలీ, క్లోన్ చేసిన ఐఫోన్లు,ఆపిల్ వాచీలు, చెవిలో పెట్టుకునే పరికరాలను అసలైనవిగా నమ్మించి విక్రయిస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైందని పేర్కొన్నారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులలో రెండు ఐఫోన్లు (వాటిలో ఒకటి నకిలీది),నాలుగు నకిలీ ఆపిల్ వాచీలు,స్మార్ట్ వాచీలుతో పాటు ఏడు నకిలీ చెవిలో పెట్టుకునే పరికరాలు ఉన్నాయి. ఈ నేరంలో ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన ఆవేష్ ఖాన్ అనే మరో వ్యక్తి కూడా పాల్గొన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ప్రస్తుతం అతను పరారీలో ఉండటంతో ఆ చూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అరెస్టు చేసిన అల్తమాష్‌ను న్యాయస్థానంలోహా జరుపరిచి రిమాండ్‌కు తరలించారు.మాదాపూర్ సహాయ పోలీస్ కమిషనర్ మార్గదర్శకత్వంలో, రాయదుర్గం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో డిటెక్టి వ్ ఇన్‌స్పెక్టర్ కె.రామిరెడ్డి,నేర విభాగం సిబ్బంది సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడిని పట్టుకోవడంలో కృషి చేసిన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్, నేర విభాగం సిబ్బందిని సహాయ పోలీస్ కమిషనర్ అభినందించారు.



తాళం వేసిన ఇండ్లే టార్గెట్

ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్ : తాళం వేసిన ఇండ్లను టార్గెట్‌గా చేసుకొని చోరీలకు పాల్పడుతున్న సంఘటన షాద్‌నగర్ పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణ సిఐ సీతారాం శనివారం సాయంత్రం తెలిపిన వివరాల ప్రకారం మున్సిపాలిటి పరిధిలోని ఈశ్వర్ కాలనీకి చెందిన రమేష్ అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి అనారోగ్య పరిస్థితుల నేపథ్యంలో హైద్రాబాద్‌లో ఉన్న మేనమామతో కలిసి ఆసుపత్రికి వెళ్ళినట్లు తెలిపారు. ఈనేపద్యంలో ఇంటికి తాళం వేసుకొని కుటుంబ సమేతంగా వెళ్ళి తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి తాళం పగలగొట్టి ఉండటంతోపాటు బీరువాలోని బంగారు, వెండి ఆభరణాలు చోరికి గురైనట్లు తెలిపారు. దాంతో బాధితుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న నేపద్యంలో సాంకేతిక ఆధారాలతో నిందితుడిని నవంబర్ 7వ తేదిన జగానాథ ప్రభు (32) అనే యువకుడిని అదుపులోకి తీసుకొని విచారించగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. దాంతో నింధితుడి నుండి బంగారు చెవి కమ్మలు, గొలుసులు, నల్లపూసల దండ, బ్రేస్‌లెట్ వంటి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. ఈ కేసులో క్రైమ్ డిఎస్ఐ శివారెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ రవీందర్, కానిస్టేబుల్ మోహన్‌లు కేసును చేదించడంతో కీలక పాత్ర పోషించినట్లు పట్టణ సిఐ సీతారాం తెలిపారు.



ప్రభుత్వం ధాన్యం కోనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

రంగారెడ్డి జిల్లా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి డిమాండ్



ప్రజాపక్షం/యాచారం : ప్రభుత్వం జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ధాన్యం కోనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రంగారెడ్డి జిల్లా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు (సిపిఐ పార్టీ సినీయర్‌నాయకులు)కొంతంమాధవరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం యాచారం మండల పరిధిలోని మొండిగౌరెల్లి, చింతపట్ల,నల్లవెల్లి, మంథన్‌గౌరెల్లి,తమ్మలోనిగూడ గ్రామాల్లో రైతు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అయా గ్రామాల్లో కరువుతో ఎండిపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రైతులు అరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టు బాటు ధర రావాలంటే తక్షణమే ధాన్యం కోనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఎల్ నినో కరువు నివారణ కోసం ప్రభుత్వం కరువు సహయక చర్యలు చెపట్టాలని డిమాండ్ చేశారు. కరువుతో ఎండిపోయిన పంటలను ప్రభుత్వం గుర్తించి నష్ట పరిహరం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలను దళారుల పాలు కాకుండా కాపాడాలన్నారు.ఎండి పోయిన పంటల పరిశీలనకు ప్రభుత్వం ఉప సంఘం ఎర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కరువుతో ఎండిపోయిన పంటలను సమగ్ర సర్వే చేసి పూర్తి స్థాయి నష్టపరిహరం ఇచ్చే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దెత్తున అందోలన చేస్తామని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో రైతుసంఘం నాయకులు బి.నర్సింహ్మ, టి.అమృత, డి.ప్రత్యూష, ఎస్.బాలరాజ్ తదితరులు పాల్గోన్నారు.

కేరళ బాహుబలి హల్‌చల్



ప్రజాపక్షం/కాచిగూడ: షాన్ ఏ షహర్ గ్రేటర్ హైదరాబాద్ మహానగర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సదర్ సంబురాలు ఆకట్టుకుంటున్నాయి. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని కాచిగూడ చప్పల్ బజార్‌లో యాదవ సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ ఉత్సవాల్లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వేడుకల్లో కేరళ నుంచి తీసుకువచ్చిన 'బాహుబలి' దున్నపోతు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. దున్నపోతుల ప్రదర్శనను తిలకించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, స్వయంగా 'బాహుబలి' దున్నపోతు ముకుతాడు పట్టుకుని శోభాయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, నిజాం కాలం నుంచి భాగ్యనగరంలో దీపావళి అనంతరం సదర్ వేడుకలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని.. ముఖ్యంగా యాదవ సమాజం ఆధ్వర్యంలో దున్నపోతులను అందంగా అలంకరించి నిర్వహించే ఈ సంప్రదాయ పండుగ దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిందని గుర్తుచేశారు. చిట్టబోయిన కుటుంబానికి చెందిన నంద కిషోర్ యాదవ్, లడ్డు యాదవ్‌తో పాటు వారి సోదరులు ప్రతి సంవత్సరం సామూహికంగా ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. వేడుకల్లో చిట్టబోయిన లడ్డు యాదవ్, చిట్టబోయిన నందకిషోర్ యాదవ్, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గౌతమ్ రావు, బిజెపి నాయకులు బీరెల్లి మనోజ్ యాదవ్, చిట్టి శ్రీధర్, ప్రవీణ్, ముఖేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి బిల్లు చెల్లించొద్దు

కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు రామకృష్ణ

ప్రజాపక్షం/కంటోన్మెంట్: ప్రజలను నీటి బిల్లుల పేరుతో ఇబ్బందులకు గురిచేయడం సరికాదని.. ప్రజలు నీటి బిల్లుల రూపంలో ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జన్యవుల రామకృష్ణ స్పష్టం చేశారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కంటోన్మెంట్ ప్రజలను ఏ విధంగా మోసం చేస్తుందో చెప్పేందుకు నీటి బిల్లుల వ్యవహారమే నిదర్శనమని విమర్శించారు. సిఎం, ఇంచార్జి మంత్రి ఎన్నికల సమయంలో కంటోన్మెంట్ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒకసారి గుర్తు చేసుకోవాలని సూచించారు. ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, కంటోన్మెంట్ ప్రాంతానికి తగినంత నీటి సరఫరా పెంచాలని డిమాండ్ చేశారు.

'మాన్సూరా'లో పర్యావరణ వేడుకలు



ప్రజాపక్షం/బేగంపేట్: ప్రకృతిని పరిరక్షించి, భావితరాలకు పచ్చదనాన్ని అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని పలువురు ప్రముఖులు పిలుపునిచ్చారు. ప్రకాశ్‌నగర్‌లోని ప్రతిష్టాత్మక మాన్సూరా సైబర్ హైస్కూల్లో శనివారం పర్యావరణ దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. పర్యావరణ పరిరక్షణ, మొక్కల ప్రాధాన్యతపై విద్యార్థుల్లో అవగాహన పెంచే లక్ష్యంతో నిర్వహించిన కార్యక్రమంలో వంద మొక్కలను పంపిణీ చేశారు. వేడుకలకు ఇండోనేసియన్ న్యాయవాది, వేకప్ హ్యూమానిటీ ఆర్గనైజేషన్ అధ్యక్షులు అడ్వకేట్ సయ్యద్ నూర్, వరల్ ఎన్విరాన్మెంట్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సిహెచ్ భద్ర, జాతీయ చైర్‌పర్సన్ డాక్టర్ ఎ. జ్యోత్స్న, అడ్వకేట్ జి.లలిత్ కుమార్, డబ్ల్యూఈవో సభ్యులు ఆర్.లోకేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాపక్షం/అంబర్‌పేట్: మోహిని చెరువు హిందూ శ్మశానవాటికలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడెల్లి అజయ్ కుమార్ జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్‌కు వినతిపత్రం అందించారు. ఈ మేరకు శ్మశానవాటికలో విద్యుత్, లైటింగ్ సదుపాయాల మెరుగుదలకు అవసరమైన పనులను చేపట్టాలని కోరారు. కొత్తగా 50 సీసీ విద్యుత్ పోల్స్,100 కొత్త 70 వాట్స్ ఎల్ఈడీ స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని, ఇప్పటికే ఉన్న 30 పోల్స్‌కు దెబ్బతిన్న పాత కేబుల్ తొలగించి కొత్త కేబుల్ ఏర్పాటు చేయాలని,మూడు మినీ హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. శ్మశానవాటికకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన విద్యుత్, వెలుతురు సదుపాయాలు కల్పించడం అవసరమని అజయ్ కుమార్ పేర్కొన్నారు. ఈ పనులను సంబంధిత జీహెచ్‌ఎంసీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన నిధులు మంజూరు చేయడంతో పాటు వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కమిషనర్కు విజ్ఞప్తి చేశారు.

ట్రస్ట్‌లకు అధికారాలు ఇవ్వాలి

ప్రజాపక్షం/ఖైరతాబాద్: ఆత్మ గౌరవ భవనాలపై కులసంఘాల ట్రస్ట్‌లకు పూర్తి అధికారాలు ఇచ్చి, జీఓ14ను రద్దు చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో ప్రభుత్వం ఇచ్చిన జీఓ 14 పై బీసీ ప్రజాప్రతినిధుల ఫోరం ఆధ్వర్యంలో మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు పురుషోత్తం అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే బడుగుల లింగయ్య యాదవ్ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. హైదరాబాద్ నడిబొడ్డున బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల కోసం ఎకరా భూమి సుమారు రూ.200 కోట్లు మార్కెట్ విలువ కలిగిన 82 ఎకరాల భూమిని గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిందన్నారు. కుల సంఘాల ఆత్మగౌరవ భవనాలపై ప్రభుత్వ పెత్తనం తగదని, జీవో నెం.14ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ టీఎన్జీవో అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, బీసీ కమీషన్ మాజీ సభ్యుడు కిషోర్, గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షుడు అంబాల నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యరహిత దీపావళి జరుపుకోవాలి : రంగయ్య

ప్రజాపక్షం/నల్లకుంట: దీపావళి పండుగను పర్యావరణ హితంగా, కాలుష్యరహితంగా జరుపుకోవాలని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్సీహెచ్ రంగయ్య తెలుగు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే వివిధ రకాల కాలుష్యాలు ప్రకృతి విఘాతాలకు కారణమవుతున్నాయని, వాతావరణ సమతుల్యత లోపం నేపథ్యంలో ఎల్నినో వంటి విపత్కర పరిస్థితులు మరింత ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. భావితరాల మనుగడను కాపాడటం ఈ తరం ముందున్న అత్యవసర బాధ్యత అని, అందుకు ప్రతి ఒక్కరూ దీపావళిని దీపకాంతులతో, శబ్ద, వాయు కాలుష్యాలకు దూరంగా జరుపుకోవాలని శనివారం కౌన్సిల్ తరపున విడుదల చేసిన ప్రకటనలో కోరారు.

సైబరాబాద్‌లో అక్రమ నిర్మాణాలపై స్పెషల్ ఫోకస్

- పార్కుల అభివృద్ధి, వర్క్ ఫ్రం పార్క్ కాన్‌సెప్ట్‌కు శ్రీకారం
- మరో మూడు నెలల్లో 300 కొత్త పార్కులు
- 337 ప్రైవేట్ ఎస్‌టిపిలకు నోటీసులు
- పనిచేయకుంటే చర్యలు
- ఆర్థిక క్రమశిక్షణ కారణంగా ఇండియా ఏ-ప్లస్ క్రెడిట్ రేటింగ్
- సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జి. సృజన



ప్రజాపక్షం/హైదరాబాద్ : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) పరిధిలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో పాటు అక్రమ నిర్మాణాల నిరోధానికి కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ డాక్టర్ జి. సృజన స్పష్టం చేశారు. కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా ప్రతినిధుల ఇష్టాగోష్టి సమావేశంలో ఆమె మాట్లాడారు. నగరంలో అక్రమ నిర్మాణాల తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారించామని, ఇప్పటికే కార్పొరేషన్ పరిధిలో దాదాపు 1,100 అక్రమ నిర్మాణాలను కూల్చివేశామని తెలిపారు. అయ్యప్ప సొసైటీ, మాదాపూర్ గురుకుల్ ట్రస్ట్ భూముల్లో ఉన్న అక్రమ నిర్మాణాలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని విస్పష్టంగా ప్రకటించారు. ఈ విషయంలో తమపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవని, కూల్చివేతల సమయంలో కోర్టు కేసులు, చట్టపరమైన ప్రక్రియల కారణంగానే కొంత ఆలస్యం జరుగుతోందన్నారు. సైబరాబాద్‌ను రాబోయే రోజుల్లో ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దేందుకు బహుముఖ ప్రణాళికలను అమలు చేస్తున్నట్లు కమిషనర్ వెల్లడించారు. నగరంలో ట్రాఫిక్ ఫ్రీ ఫ్లో సాధించేందుకు వీలుగా రోడ్లపై ఉన్న బాటిల్ నెక్‌లను తొలగించడం, జంక్షన్ల రీడిజైనింగ్ చేపడుతున్నామని చెప్పారు. ట్రాఫిక్ నిపుణులతో సంప్రదించి, రాబోయే 5 నుండి 10 సంవత్సరాల అవసరాలకు అనుగుణంగా 'మొబిలిటీ చార్టర్' సిద్ధం చేస్తున్నామని తెలిపారు. భారీ వర్షాలు కురిసినా రోడ్లపై నీరు నిలవకుండా, అరికాలు కూడా మునగని రీతిలో డ్రైనేజీ వ్యవస్థలను బలోపేతం చేస్తున్నామని, 76 వార్డుల్లో 10 రకాల ఇంకుడు గుంతలను నిర్మించబోతున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ఐటి ఉద్యోగులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు 'వర్క్ ఫ్రమ్ పార్క్' కాన్సెప్ట్‌ను తీసుకొస్తున్నట్లు సృజన చెప్పారు. మరో మూడు నెలల్లో సంక్రాంతి నాటికి 300 కొత్త పార్కులను అందుబాటులోకి తేస్తామన్నారు. ఐటి ప్రాంగణాలు ఎక్కువగా ఉన్న మాదాపూర్, శేరిలింగంపల్లి సర్కిళ్లలో తొలి దశగా పార్కులను అభివృద్ధి చేస్తున్నామని, వీటిలో హైస్పీడ్ వైఫై, పవర్ అవుట్‌లెట్లు, సీటింగ్, కేఫెటేరియా సౌకర్యాలను సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అలాగే హైదరాబాదును చిల్డ్రన్ ఫ్రెండ్లీ సిటీగా మలిచేందుకు సమగ్ర ప్రణాళికలు రచిస్తున్నామన్నారు. కార్పొరేషన్‌లో రీయూజ్ (శుద్ధి చేసిన) నీటి వినియోగాన్ని గణనీయంగా పెంచినట్లు తెలిపారు. ల్యాండ్‌స్కేపింగ్, గార్డెనింగ్ కోసం ప్రతిరోజూ 1.60 లక్షల లీటర్ల రీసైకిల్డ్ నీటిని ఉపయోగిస్తున్నామని, పార్కుల్లో భూగర్భ జలాల తోడకాన్ని నిలిపివేశామన్నారు. భవన నిర్మాణదారులకు సైతం శుద్ధి చేసిన నీటినే వాడాలని నోటీసులు జారీ చేశామన్నారు. కార్పొరేషన్ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీలు, హైరైజ్ బిల్డింగ్స్‌లో ఉన్న 337 ప్రైవేట్ ఎస్‌టిపిలు నిరంతరం పనిచేయాలని, లేదంటే రూల్స్ ప్రకారం ఆక్యుపెన్సీ సర్టిఫికేట్‌లను రద్దు చేయడంతో పాటు భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. చెత్త నిర్వహణలో వినూత్న పద్ధతులు పాటిస్తున్నామని, గ్రీన్ వేస్ట్ ప్రాసెసింగ్ కోసం వార్డుకో సెంటర్ ఏర్పాటుతో పాటు కొబ్బరి బొండాల వ్యర్థాలను ప్రాసెస్ చేసి లభించే పీచును రోడ్ల నిర్మాణంలో ఉపయోగిస్తామన్నారు. చికెన్ వ్యర్థాలను అక్రమంగా చేపల మేతగా వాడే విధానాన్ని అరికడతామన్నారు. కార్పొరేషన్ పరిధిలో రూ.850 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో పూర్తి పారదర్శకత కోసం, ప్రతి పని ప్రదేశంలో ప్రాజెక్టు వివరాలు, వ్యయం, ఏజెన్సీ పేరు, పర్యవేక్షక అధికారి ఫోన్ నెంబర్‌తో కూడిన సమాచార బోర్డులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్పొరేషన్ పాటిస్తున్న కఠిన ఆర్థిక క్రమశిక్షణ కారణంగా ఇండియా ఏప్లస్ క్రెడిట్ రేటింగ్ లభించిందని సృజన ఆనందం వ్యక్తం చేశారు.

ఔట్‌సోర్సింగ్ విధానం ఔట్?

ఎండి, జెఎండి ఏం చేస్తున్నారు?

ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: చాలీ చాలని జీతాలతో నెట్టుకొస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై జలమండలి కక్షకట్టిందా? అంటే జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే అవుననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అండగా నిలిచిన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంకు విలువ ఇవ్వకుండా ఆయన పరువు తీస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు లేకుండా చేసేందుకు జలమండలిలో కుట్రపన్నుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే జలమండలిలో మీటర్ రీడర్ల నియామకానికి జారీ చేసిన టెండర్లు ఆందోళనకు ఆజ్యం పోశాయి. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకం, సేవలకు సంబంధించి జిఓ నెం: 60ను కొత్త టెండర్లలో ప్రస్తావించకపోవడంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో అలజడి మొదలయ్యింది. ఇప్పటి వరకు 16 ఏజెన్సీల ద్వారా నిర్వహించిన పనులను ప్రస్తుతం హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్ మూడు రీజియన్లను విడదీస్తూ మూడు టెండర్లు జారీ చేయడం కూడా వివాదాస్పదంగా మారింది. ఈ విషయంలో ఎండి, జాయింట్ ఎండీల అంగీకారం లేదనే ప్రచారం జరుగుతోంది. మరి ఎవరి ప్రోద్బలంతో ఔట్‌సోర్సింగ్ అనే పదం లేకుండా టెండర్‌లు పిలిచారు? అనేది అంతుచిక్కడం లేదు.

పక్కాగా కుట్ర?

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల స్థానంలో థర్డ్ పార్టీతో సేవలు పొందితే సంబంధిత ఉద్యోగుల పట్ల జలమండలికి ఎటువంటి బాధ్యత ఉండదు. ఇప్పటికే ఆరుగురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మరణించినా జలమండలిలో ఎటువంటి కదలిక లేదు. మూడేళ్ల క్రితం చందానగర్ సెక్షన్‌లో జరిగిన రూ.కోటిన్నర వంటి అవినీతి అక్రమాలు చోటుచేసుకున్న సందర్భంలో తప్పు తమది కాదని పక్కదారి పట్టించేందుకు థర్డ్ పార్టీ ఉద్యోగులను నియమిస్తూ ఔట్‌సోర్సింగ్ విధానం లేకుండా చేయాలని ప్లాన్ వేశారని బాధిత ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారాలను పరిశీలించాల్సిన జలమండలి ఎండి, జాయింట్ ఎండీల మధ్యన సమన్వయం లేదని.. అందుకే ఈ విషయంలో వివాదాస్పదంగా మారిందనే చర్చ జరుగుతోంది. అయితే ఇంత జరుగుతున్నా ఎండి కె.అశోక్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదు? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే జలమండలిని దివాళా తీయించేలా ఎండి అశోక్‌రెడ్డి కంకణం కట్టుకున్నారని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మండిపడుతున్నారు.

పేద విద్యార్థులు చదువుకోవద్దా?

- ఫీజులకు ఇంకెన్నాళ్లు ఎదురుచూడాలి
- రూ.8500 కోట్లు తక్షణమే చెల్లించాలి
- విద్యార్థుల ర్యాలీలో ఎంపి ఆర్.కృష్ణయ్య



ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ : 'బిసి, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించొద్దా...? ఫీజుల కొరకు ఇంకెన్నాళ్లు ఎదురుచూడాలి' అంటూ జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఫీజుల బకాయిలు రూ.8500 కోట్లు చెల్లించి, విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇప్పించాలని డిమాండ్‌చేస్తూ బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్‌లు నిఖిల్ పటేల్, మోదీ రాందేవ్ అధ్యక్షతన వందలాది మంది విద్యార్థులు శనివారం హైదరాబాద్‌లోని అబిడ్స్ నుంచి బషీర్‌బాగ్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. దీనికి ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి, మాట్లాడారు. సిఎం రేవంత్ రెడ్డికి విద్యార్థుల ఆర్తనాదాలు వినిపించడం లేదా? ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తు కంటే సిఎంకు ఢిల్లీ పర్యటనలు, హైకమాండ్‌కు రక్షణ కల్పించడమే ఎక్కువైందని విమర్శించారు. డబ్బుల్లేవంటున్న ప్రభుత్వానికి ఏ బ్యాంకు నుంచైనా రుణం ఇప్పించేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. ప్రభుత్వ భూములు అమ్ముతున్నారు కాదా? వాటిలో నుంచి వచ్చిన డబ్బులను ఫీజులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సాక్షిగా విద్యార్థుల ఫీజులకు బడ్జెట్ ఇస్తామని ప్రకటించారు... కానీ ఇప్పటివరకు ఒక్క పైసా విడుదల చేయలేదని విమర్శించారు. విద్యార్థులకు పూర్తి ఫీజులు చెల్లించాలని, ఎపి తరహాలో ప్రతి విద్యార్థికి రూ.5 నుంచి 20 వేల వరకు స్కాలర్‌షిప్‌లు పెంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు.

మల్లికార్జున్‌నగర్ నూతన కార్యవర్గం



ప్రజాపక్షం/నల్లకుంట: బాగ్ అంబర్‌పేట్ మల్లికార్జున్‌నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన నూతన కార్యవర్గ ప్రతినిధులు కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డికి శాలువాకప్పితో సన్మానించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. మల్లికార్జున నగర్ కాలనీ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, కాలనీ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. మంత్రిని కలిసిన వారిలో... అసోసియేషన్ అధ్యక్షుడు చుక్క జగన్, ప్రధాన కార్యదర్శి ఎస్.మహేష్‌గౌడ్, కోశాధికారి ఎం.బాలశేఖర్, ఉపాధ్యక్షుడు ఆర్. నాగ చందర్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

మనస్తాపంలో విద్యార్థి ఆత్మహత్య

ప్రిన్సిపాల్, లెక్చరర్‌పై కేసు నమోదు

ప్రజాపక్షం/అమీర్‌పేట్: లెక్చరర్, ప్రిన్సిపాల్ ప్రవర్తనతో మనస్తాపం చెందిన ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి ఘటనకు కారకులైన ప్రిన్సిపాల్, లెక్చరర్‌పై కేసు నమోదు చేయడం జరిగింది. వివరాలలోకి వెళితే.. నల్లగొండ జిల్లాకు చెందిన లింగారెడ్డి కుమారుడు బల్కంపేట్‌లోని చెన్నై సమృత కాలేజీలో హోటల్ మేనేజ్మెంట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అతను బికె గూడలో నివాసముంటున్నాడు. వారం రోజుల క్రితం సదరు విద్యార్థి కాలేజీలోని ఓ లెక్చరర్‌కు సంబంధించి ఓ ఏఐ చిత్రాన్ని రూపొందించి తన స్నేహితుడికి చూపించాడు. ఈ విషయాన్ని అతని స్నేహితుడు సంబంధిత లెక్చరర్‌కు చెప్పడంతో ఆయన ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేయడం జరిగింది. దీంతో ఆగ్రహించిన ప్రిన్సిపాల్ అతని మొబైల్ తీసుకుని తల్లిదండ్రులను కాలేజీకి తీసుకురావాలని సూచించారు. ఈ విషయాన్ని సదరు విద్యార్థి తన సోదరుడికి తెలపగా ఆయన వచ్చి లెక్చరర్, ప్రిన్సిపాల్‌ను కలిసి ఇటువంటి ఘటనలు పునరావృతం కావని హామీ ఇచ్చారు. అయినప్పటికీ, ప్రిన్సిపాల్ మొబైల్ ఫోన్ తిరిగి ఇచ్చేందుకు నిరాకరిస్తూ తల్లిదండ్రులను తీసుకురావాల్సిందే అంటూ హెచ్చరించారు. దీంతో మనస్తాపం చెందిన సదరు విద్యార్థి గదిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన స్నేహితులు, స్థానికులు గది తలుపులు బద్దలుకొట్టి విద్యార్థిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమగ్ర విచారణ జరిపించాలి

ప్రజాపక్షం/ఖైరతాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్‌పై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని విశ్వవిద్యాలయ ఉద్యోగులు గవర్నర్‌ను కోరారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయంలో పదోన్నతులు, బదిలీలు, పరిపాలనా నిర్ణయాల విషయంలో సంబంధిత అధ్యాపకులు, ఉద్యోగుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. వైస్‌చాన్స్‌లర్‌కు, మహిళా అధ్యాపకురాలికి మధ్య ఉన్న పరిచయాన్ని వ్యక్తిగత కోణంలో తప్పుగా అర్థం చేసుకోవద్దని, ఒక సీనియర్‌గా, మార్గదర్శకుడిగా సమస్యల పరిష్కారానికి సలహాలు ఇవ్వడం సహజమని పేర్కొన్నారు. మీడియా సమావేశంలో రాజేశ్వర్ నాయక్, హేమలత, శ్రీనివాస్ యాదవ్, మాధవీలత, భార్గవి, టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలి



ప్రజాపక్షం/చిక్కడపల్లి: రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలోపు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీలో నిరుద్యోగ అభ్యర్థులు భారీ ధర్నా నిర్వహించారు. ఉద్యోగ నోటిఫికేషన్‌ల కోసం నిరుద్యోగ జేఏసీ తలపెట్టిన ర్యాలీని పోలీసులు పర్మిషన్ ఇవ్వకపోవడంతో నిరుద్యోగ జేఏసీ నాయకులు చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీలో నిరుద్యోగ అభ్యర్థులతో కలిసి భారీ ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుద్యోగ జేఏసీ నాయకులు శంకర్ నాయక్, ఇంద్ర నాయక్ మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకులు ఢిల్లీలో ర్యాలీలు తీయవచ్చు కానీ తెలంగాణలో మాత్రం ర్యాలీలకు ఎందుకు పర్మిషన్ ఇవ్వట్లేదని ప్రశ్నించారు. ఈ దేశంలో కాంగ్రెస్ పార్టీకి ఒక రాజ్యాంగం.. నిరుద్యోగులకు మరో రాజ్యాంగం అమలవుతుందా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి దాదాపుగా మూడు సంవత్సరాలు అవుతున్నా ఒక్క జనరల్ నోటిఫికేషన్ ఇవ్వలేదని, నిరుద్యోగుల బాధలు ప్రభుత్వానికి కనిపించట్లేదా? అని నిలదీశారు. వెంటనే మెగా డీఎస్సీ, గ్రూప్స్ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఉమ్మడి నల్లగొండఖమ్మంవరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్ సార్ మాట్లాడుతూ, జనవరిలోపు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నాయకులు కుమార్ రాథోడ్, రవి నాయక్, గణేష్, బాలు, నరేష్, బిందు, పోటీ పరీక్ష అభ్యర్థులు పాల్గొన్నారు.

అత్యాధునిక సోలార్ మాడ్యూల్



ప్రజాపక్షం/హైదరాబాద్‌సిటీ: దేశంలో పునరుత్పాదక ఇంధన రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు సౌర విద్యుత్ ఉత్పత్తిలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ప్రముఖ సోలార్ ఎనర్జీ సంస్థ అవాడా రూపొందించిన అత్యాధునిక జి12 సోలార్ మాడ్యూల్‌ను హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఎస్ఎఎస్ ఎనర్జీ అసోసియేట్స్, మోక్ష సోలార్ సంస్థల ఆధ్వర్యంలో ఈ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథి మాజీ ప్రత్యేక కార్యదర్శి(ఎనర్జీ) అజయ్ మిశ్రా, గౌరవఅతిథి ఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ (కమర్షియల్) చక్రపాణి, టిజిఆర్ ఇడిసి జనరల్ మేనేజర్ సత్య వరప్రసాద్, తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ కుమార్ బుర్రా, అసోసియేషన్ జనరల్ సెక్రటరీ హరిబాబు, అవాడా సంస్థ ప్రతినిధులు పంకజ్ ఉపాధ్యాయ్, అతుల్ మెష్రామ్, వేణుగోపా తదితరులు నూతన సోలార్ మాడ్యూల్ ప్రత్యేకతలు, సాంకేతిక సామర్థ్యం, ఆధునిక టాప్‌కాన్ టెక్నాలజీ ద్వారా లభించే ప్రయోజనాలను వివరించారు.సౌర విద్యుత్ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించడంతో పాటు పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని విస్తరించవచ్చని పేర్కొన్నారు. నాణ్యమైన సోలార్ మాడ్యూల్స్, అధునాతన సాంకేతికత అందుబాటులోకి రావడం దేశ ఇంధన భద్రత, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛ ఇంధన లక్ష్యాల సాధనకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సోలార్ పరిశ్రమకు చెందిన ప్రముఖులు, డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు, వ్యాపారవేత్తలు, పునరుత్పాదక ఇంధన రంగ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బార్ అండ్ రెస్టారెంట్‌లకు పెంచిన ప్రివిలేజ్ పన్ను రద్దు చేయాలి

బిసి పొలిటికల్ జెఎసి రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాచాల



ప్రజాపక్షం / హిమాయత్‌నగర్: రాష్ట్రంలో బార్ అండ్ రెస్టారెంట్ యజమానుల ఇబ్బందుల దృష్ట్యా ప్రభుత్వం పెంచిన ప్రివిలేజ్ ఫీజును వెంటనే ఉపసంహరించుకోవాలని బిసి పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్‌గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దాదాపు 1,250 బార్లు ఉన్నాయని, వాటిలో 62,500 మంది వరకు ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ఎక్సైజ్ శాఖ కమిషనర్ హరికిరణ్ ఇచ్చిన తప్పుడు నివేదికతో ప్రభుత్వం ప్రివిలేజ్ ఫీజు పెంచుతూ జిఒ తేవడం అన్యాయమన్నారు. దీంతో బార్ అండ్ రెస్టారెంట్ యజమానులు ప్రతిరోజు ప్రభుత్వానికి రూ.30వేలు పన్ను కట్టాల్సి వస్తుందని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వ జిఒతో బార్లు మూతపడే అవకాశం ఉన్నదని, లక్షలాది మంది ఉపాధి కరువై రోడ్డున పడే ప్రమాదం ఉన్నదన్నారు. ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు కనీస సమాచారం లేకుండా కమిషనర్ సొంత నిర్ణయాలు తీసుకొంటున్నట్టు ప్రచారం జరుగుతుందన్నారు. కొన్ని సందర్భాల్లో అధికారులు తీసుకొనే తప్పుడు నిర్ణయాలతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి ఎక్సైజ్ శాఖను ప్రక్షాళన చేయాలని, బార్ అండ్ రెస్టారెంట్ యజమానుల సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. సమావేశంలో జెఏసి నేతలు చాపలి వెంకటేశ్, శ్రీధర్ సిద్దార్థ్, రామ్ మాధవ్, మంజునాథ్ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మారుతి, లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ డిమాండ్

ప్రజాపక్షం/ముషీరాబాద్: సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని తెలంగాణ డాక్టర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చేతన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ధర్నాచౌక్ వద్ద ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ ఆధ్వర్యంలో సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ విదేశీ వైద్య విద్యార్థుల సత్యాగ్రహ దీక్ష 2026 చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ డాక్టర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చైతన్‌రెడ్డి మాట్లాడుతూ, విదేశాలలో వైద్య విద్యను పూర్తి చేసి ఇండియన్ మెడికల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షల్లో అర్హత సాధించిన వైద్య విద్యార్థులకు ఇండియాలో ఎంబిబిఎస్ పూర్తి చేసిన విద్యార్థులతో సమానంగా స్టయిఫండ్ చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకే రకమైన విద్యార్హతలు కలిగి, వివిధ ప్రభుత్వ హాస్పిటల్లో ఒకే రకమైన క్లినికల్ విధులు నిర్వహిస్తున్న విద్యార్థుల మధ్య వివక్షత చూపడం సరికాదన్నారు.

ఎపి ఎంపిటిసి ఎన్నికల్లో

ఆరు చోట్ల సిపిఐ గెలుపు

అమరావతి:ఎంపిటిసి ఎన్నికల్లో సిపిఐ విజయభేరీ మోగించింది. ఆరు స్థానాల్లో ఎర్రజెండా ఎగిరింది. ఐదు చోట్ల సిపిఐ అభ్యర్థులు ఘన విజయం సాధించగా ఒకచోట ఎన్నిక ఏకగ్రీవమైంది. పోలవరం జిల్లా ఎటపాక మండలం కష్ణవరంలో సున్నం పున్నమ్మ, కర్నూలు జిల్లా ఆలూరు మండలం మొలగవల్లి2లో చిలక కష్ణవేణి, కర్నూలు జిల్లా ఆస్పరి మండలం కైరుప్పలలో బంట్రోతు గౌరీ, అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం గోవిందంపల్లిలో చిట్టెమ్మ (ఏకగ్రీవం), కష్ణా జిల్లా గూడూరు మండలం కప్పలదొడ్డిలో యక్కల పీతాంబరధరరావు, అనంతపురం జిల్లా అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లిలో గౌని శారద ఎన్నికయ్యారు.



కృష్ణవరంలో పున్నమ్మ: పోలవరం జిల్లా, ఎటపాక మండలం, కష్ణవరం ఎంపిటిసి స్థానంలో సిపిఐ అభ్యర్థి సున్నం పున్నమ్మ 472 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. పార్టీకి కంచుకోటగా పేరొందిన కష్ణవరంలో మరోసారి సిపిఐ సత్తా చాటింది. పున్నమ్మ ఎన్నికతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎర్రజెండాలు చేతబట్టి బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కందుకూరి స్వర్ణ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పార్టీ పోరాటాలకు, ప్రజ విశ్వాసానికి ఈ విజయం నిదర్శనమన్నారు. నూతనంగా ఎన్నికైన సున్నం పున్నమ్మ ఓటర్లకు కతజ్ఞతలు తెలుపుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు, పేదల సమస్యల పరిష్కారానికి కషి చేస్తానని హామీ ఇచ్చారు.



మొలగవల్లిలో కష్ణవేణి:కర్నూలు జిల్లా, ఆలూరు మండలం, మొలగవల్లి ఎంపిటిసి2 స్థానంలో సిపిఐ అభ్యర్థి చిలక కష్ణవేణి 123 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. టిడిపి, కాంగ్రెస్ అభ్యర్థులను వెనక్కి నెట్టి గెలుపొందారు. అనంతరం రిటర్నింగ్ అధికారి ఆనంద్ రాజ్ కుమార్ నుంచి డిక్లరేషన్ ఫారాన్ని అందుకున్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు భూపేష్, ఎస్టి రాష్ట్ర నాయకుడు బంటనహాల్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కైరుప్పలలో బంట్రోతు గౌరీ: కర్నూలు జిల్లా, ఆస్పరి మండలం, కైరుప్పల గ్రామంలో సిపిఐ అభ్యర్థి బంట్రోతు గౌరీ 90 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. పేదలు, కార్మికులు, బడుగు బలహీన వర్గాల పక్షాన నిలిచే సిపిఐకి ప్రజలు మద్దతుగా నిలిచారని పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. యాటకల్లు, డి.కోటకొండ ఎంపిటిసి స్థానాల్లో పోటీ చేసిన సిపిఐ అభ్యర్థులు స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు.



గోవిందంపల్లిలో చిట్టెమ్మ ఏకగ్రీవం: అనంతపురం జిల్లా, బుక్కరాయసముద్రం మండలం, గోవిందంపల్లి ఎంపిటిసి స్థానానికి పోటీ చేసిన సిపిఐ అభ్యర్థి చిట్టెమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ల ప్రక్రియ అనంతరం ఇతర అభ్యర్థులెవరూ పోటీలో లేకపోవడంతో ఆమె ఎన్నిక ఏకగ్రీవమైనట్లు అధికారులు ప్రకటించారు. సిపిఐ నాయకులు, స్థానికులు ఆమెకు అభినందనలు తెలిపారు.




కప్పలదొడ్డిలో పీతాంబరధరరావు కష్ణాజిల్లా, పెడన నియోజకవర్గం గూడూరు మండలం కప్పలదొడ్డి ఎంపిటిసి స్థానంలో వైసిపి బలపరిచిన సిపిఐ అభ్యర్థి యక్కల పీతాంబరధరరావు 25 ఓట్లతో విజయం సాధించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ కమిటీ సభ్యుడు కేవీ ప్రసాద్, జిల్లా కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, ఎఐటిసి జిల్లా ప్రధాన కార్యదర్శి లింగం ఫిలిప్, కార్యదర్శి ఒంటిపులి లక్ష్మణరావు, పెడన నియోజకవర్గ నాయకుడు పేరొట్టి ఉమాకాంతం, సిపిఐ రాష్ట్ర చేనేత విభాగ నాయకుడు కట్ట హేమసుందరరావు తదితరులు ఆయనను కలిసి అభినందించారు.



అక్కంపల్లిలో శారద:అనంతపురం రూరల్ మండలం, అక్కంపల్లి ఎంపిటిసి స్థానంలో సిపిఐ అభ్యర్థి గౌని శారద విజయం సాధించారు. అధికార కూటమి బలపరిచిన అభ్యర్థి దూదేకుల అమీనాపై 76 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే సిపిఐపై ప్రజలకున్న ఆదరణతోనే గెలిచినట్లు గౌని శారద వెల్లడించారు. ఆమె ఎన్నికలతో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.

అయోధ్య చందా చోరీ నిగ్గు తేల్చాల్సిందే

• ఛార్జిషీటు దాఖలు చేస్తే సరిపోతుందా?• ఇంకా ఎన్నో ప్రశ్నలు మిగిలిపోయాయ్ • తప్పులు కప్పిపుచ్చుకునేందుకు మోదీ, ఆదిత్యనాథ్ ప్రయత్నాలు • దోషులకు శిక్షలు పడాలి: కాంగ్రెస్ డిమాండ్



న్యూఢిల్లీ:అయోధ్య రామాలయంలో అవినీతి (చందా చోరీ) నిగ్గు తేల్చాలిందేనని కాంగ్రెస్‌పార్టీ డిమాండ్ చేసింది.ఈ అవినీతి వ్యవహారంపై కాంగ్రెస్‌పార్టీ శనివారం తన దాడిని ముమ్మరం చేస్తూ,ప్రజలు సమర్పించిన కానుకలు,విరాళాలను దొంగిలించినవారికి శిక్షలు పడాల్సిందేనని కోరింది.దేవుడికి విరాళాలు సమర్పించడం దేశంలో ఉన్న విశ్వాసాలకు సంబంధించిన విషయమని,ఇది ఎవ్వరి ప్రైవేటు ఆస్తీకాదని,ఈ విషయంలో పూర్తి నిజాలు దేశ ప్రజల ముందుకు రావాల్సిందేనని కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఎక్స్ వేదికగా హిందీలో పోస్టింగ్ పెట్టారు.ఆయన మూడు ప్రశ్నలు కూడా సంధించారు.అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నవారిపై ఛార్జిషీటు నమోదు చేస్తే సరిపోతుందా?అయోధ్య ఆలయ ట్రస్ట్ యావత్ ఆర్థిక లావాదేవీల నిర్వహణకు సంబంధించి ఒక స్వతంత్ర దర్యాప్తు ఎందుకు చేయడం లేదు?సుప్రీంకోర్టు పర్యవేక్షణలో తదుపరి దర్యాప్తు,జవాబుదారీ విధానాన్ని నెలకొల్పేందుకు ప్రభుత్వం ఎందుకు మద్దతు ఇవ్వకుండా దూరంగా ఉండిపోయింది?అని జైరామ్ రమేశ్ ప్రశ్నించారు.''చందా చోరీ,అస్తా ధోకా' అని పేర్కొన్నారు.ప్రభుత్వానికి వారు చేసిన ప్రకటనలపైనే ఇప్పుడు అనేక ప్రశ్నలు సుప్రీంకోర్టులో ఎదురవుతున్నాయని,ఈ చోరీని కప్పిపుచ్చుకునేందుకు వారు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.ప్రభుత్వం తన వైపు నుండి వాస్తవాలను కోర్టుకు సమర్పించేకొద్దీ అనేక లోతైన ప్రశ్నలు ఇప్పుడు ఎదురవుతున్నాయని వ్రాశారు.నిధులు కాజేసిన దొంగలకు మౌనంగా ఉంటూ మద్దతు ఇచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోదీనీ,ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌నూ దేశ ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు.ఈ అవినీతిని మొదటి నుండీ ఎందుకు కప్పిపుచ్చుందుకు వారిద్దరూ ప్రయత్నం చేస్తున్నారని ప్రశ్నించారు.ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ట్రస్ట్ విజ్ఞప్తి మేరకు ఈ కేసులో ముగ్గురు సభ్యులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఈ ఏడాది జూన్ 13వ తూదీప ఏర్పాటు చేసింది.జూన్ 23వ తేదీన ఈ సిట్ తన ప్రాథమిక నివేదికను అదనపు ప్రధాన కార్యదర్శి(హోం) సంజయ్ ప్రసాద్‌కు కూడా ఇచ్చిందని సమాచారం ఉందని, ఆయన ఈ ట్రస్ట్‌లో ఎక్స్ అఫీషియో సభ్యుడుగా ఉన్నారని జైరామ్ రమేశ్ విమర్శించారు.జులై ఆరో తేదీన ఈ నివేదికపై ట్రస్ట్ సమావేశంలో చర్చ జరిగిందన్నారు.కోశాధికారి గోవింద్ దేవ్ గిరి పత్రికాగోష్ఠిలో ట్రస్ట్ సభ్యులు ఎవ్వరి విశ్వాసాన్ని దెబ్బతీయలేదని ప్రకటించారనానరు.చంపత్‌రాయ్ వ్యక్తిత్వం పట్ల విశ్వాసం వ్యక్తం చేశారని,మరో మాటలో చెప్పాలంటే బిజెపి,ఆర్ఎస్ఎస్,విహెచ్‌పిలకు సంబంధించిన వ్యక్తులందరినీ ట్రస్ట్ సమర్థించుకుందని రమేశ్ విమర్శించారు.సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో జులై 27వ తేదీన రెండోసారి దర్యాప్తు బృందాన్ని ఐజి కిరణ్ నాయకత్వంలో ఏర్పాటు చేశారని,ఇందులో కొత్తగా ఫోరెన్సిక్ విభాగం తరపున ఒక అధికారిని నియమించారని గుర్తుచేశారు.ఈ నివేదికను సిట్ ఆగస్టు 17వ తేదీన సీట్లు కవరులో సుప్రీంకోర్టుకు సమర్పించిందని చెప్పారు.కోర్టు ఆదేశాల మేరకు ఈ నివేదికను రహస్యంగా ఉంచారని,ఎందుకంటే దర్యాప్తు కొనసాగుతోందని,అందువల్ల పిటిషనర్లకు ఈ నివేదికను చూపించలేదన్నారు.రెండోసారి నివేదిక విశ్వసనీయత దెబ్బతినకుండా రహస్యంగా ఉంచినప్పుడు మొదటిసారి నివేదిక ట్రస్ట్ సమావేశంలో చర్చించేస్తాయివరకూ ఎలా బహిరంగంగా బయటకు పొక్కిందని ఆయన ప్రశ్నించారు.మొదటి నివేదికపై ట్రస్ట్ సమావేశంలో ఎలా చర్చించారని ప్రశ్నించారు.మొదటిసారి సిట్ నివేదికను అదనపు ప్రధాన కార్యదర్శి (హోం) సంజయ్ ప్రసాద్‌కు సమర్పించారని,ఆయనకు ట్రస్ట్ ఎక్స్‌అఫీషియో హోదా ఉందని,ట్రస్ట్‌తో సంబంధాలు ఉన్నాయన్నారు.ఇది చాలా తీవ్రమైన ప్రశ్న కాదా? అని జైరామ్ రమేశ్ ప్రశ్నించారు.మొదటిసారి సిట్ నివేదిక ఆధారంగా చంపత్ రాయ్‌ను బహిరంగంగా ట్రస్ట్ సమర్థించిందని,కానీ ప్రభుత్వం ఈ విషయంలో ఎంత నిష్పాక్షికత ఉందనే విషయం నిర్ధారించడానికి ఎలాంటి చర్యలు తీసుకుందని ప్రశ్నించారు.ఆ ఎనిమిదిమంది పైనా చార్జిషీటు దాఖలు చేస్తే సరిపోతుందా?సీనియర్ అధికారుల పాత్రపై స్వతంత్ర దర్యాప్తు చేయాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నించారు.

న్యూజిలాండ్ ఎన్నికల్లో హోరాహోరీ

వెల్లింగ్టన్:పసిఫిక్ మహాసముద్ర నైరుతీప్రాంత ద్వీపదేశం న్యూజిలాండ్‌లో దిగువసభ(హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్)కు శనివారం పోలింగ్ ప్రక్రియ జరిగింది.అధికార నేషనల్‌పార్టీ,ప్రధాన ప్రతిపక్షం లేబర్‌పార్టీ,ద్వితీయస్థాన ప్రతిపక్షం క్రాస్‌బెంచ్ ఈ ఎన్నికల్లో హోరాహోరీగా తలపడుతున్నాయి.ఈ రెండు పార్టీల మధ్యా సర్వే నివేదికల ప్రకారం స్వల్ప తేడా మాత్రమే ఉంది.120 మంది సభ్యులుగల పార్లమెంటుకు 72 మంది ఎంపీలను ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు.మిగిలినవారిని ఓట్లశాతం ప్రకారం ఎన్నుకుంటారు.అక్టోబరు ఒకటో తేదీన న్యూజిలాండ్ పార్లమెంటును రద్దుచేసి ఎన్నికల ప్రకటన చేశారు.ఎన్నికల్లో ఎవరికీ మెజార్టీ రాకపోతే సంప్రదింపులు చేయడానికి,రాజీపడటానికి సిద్ధంగా ఉండాలని రెండుపార్టీల నాయకులు పిలుపు ఇచ్చారు.ఎన్నికలపోరు సంక్లిష్టంగా ఉందని లక్సన్ అన్నారు.

ఐఎల్-76 ఎండి విమానం న్యోమాలో విజయవంతంగా ల్యాండ్



న్యూఢిల్లీ : రష్యాకు చెందిన భారత వైమానిక దళ రవాణా విమానం లఢాఖ్‌లోని న్యోమా వైమానిక స్థావరంలో విజయవంతంగా ల్యాండ్ అయింది. ప్రపంచంలో ఈ విమానం సాధించిన అత్యంత ఎత్తయిన ల్యాండింగ్ ఇదేనని వైమానిక దళం పేర్కొంది. ఈ వైమానిక స్థావరం సుమారు 13,000 అడుగుల ఎత్తులో, చైనాతో ఉన్న వాస్తవ నియంత్రణ రేఖ (ఎల్ఏసి) నుండి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉంది. 'భారత వైమానిక దళానికి చెందిన ఐఎల్–76 ఎండి విమానం న్యోమాలో విజయవంతంగా ల్యాండ్ అయి చరిత్ర సృష్టించింది. విమానం నిరంతర సామర్థ్యానికి ఇది ఒక అద్భుతమైన నిదర్శనం. సిబ్బంది అసాధారణ నైపుణ్యం, కచ్చితత్వం, వృత్తి నైపుణ్యం దీనికి తోడయ్యాయని పేర్కొంది. ఈ ల్యాండింగ్‌ను భారతదేశం వ్యూహాత్మక వాయు రవాణా సామర్థ్యాన్ని బలోపేతం చేసే ఒక మైలురాయిగా ఐఎఫ్ అభివర్ణించింది.

విద్యార్థులను పరీక్షలకు అనుమతించకుంటే

నిరాహారదీక్ష చేస్తా

కేరళం యుడిఎఫ్ ప్రభుత్వానికి నటుడు ప్రకాశ్‌రాజ్ హెచ్చరిక



కొచ్చి : కొచ్చి సమీపంలోని కాలడిలో ఉన్న శ్రీ శంకరాచార్య సంస్కృత విశ్వవిద్యాలయంలో విద్యార్థులను సస్పెండ్ చేయడంపై నటుడు ప్రకాష్ రాజ్ శనివారం యుడిఎఫ్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. విద్యార్థులు పరీక్షలు రాయడానికి అనుమతించకపోతే, తాము కూడా వారి నిరాహార దీక్షలో పాల్గొంటామని ఆయన హెచ్చరించారు. పరీక్షలకు హాజరయ్యేందుకు అనుమతి నిరాకరించడంతో, సస్పెండ్ అయిన 16 మంది విద్యార్థులు గత ఆరు రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న విశ్వవిద్యాలయాన్ని ప్రకాశ్ రాజ్ సందర్శించారు. క్యాంపస్‌లో తగినన్ని సౌకర్యాలు లేవని ఆగస్టు 13న జరిగిన సిండికేట్ సమావేశం సందర్భంగా ఓ విద్యార్థి సంఘం నేతృత్వంలో నిరసనలు చేయడంతో విద్యార్థులను సస్పెండ్ చేశారు. వైస్‌ఛాన్సలర్ సిజా థామస్ దిష్టిబొమ్మను దహనం చేయడం, ఆమెపై దాడి చేయడం, విశ్వవిద్యాలయ ఆస్తిని ధ్వంసం చేయడానికి ప్రయత్నించడం వంటి ఆరోపణలు వారిపై ఉన్నాయి. విద్యార్థులను పరీక్షలకు హాజరయ్యేందుకు అనుమతించాలని కేరళ హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం విశ్వవిద్యాలయాన్ని ఆదేశించింది. అయితే, ఆ తర్వాత ఒక డివిజన్ బెంచ్ ఆ ఉత్తర్వుపై స్టే విధించింది. దీంతో విద్యార్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించగా, ఈ విషయంపై హైకోర్టు ఏకసభ్య ధర్మాసనమే తేల్చాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కాగా, తమను ప్రభావితం చేసే సమస్యలపై ప్రశ్నలు వేసే, నిరసన తెలిపే విద్యార్థుల పట్ల విశ్వవిద్యాలయం, రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ వైఖరిని అవలంబిస్తున్నాయని ప్రకాశ్ రాజ్ ఆరోపించారు. 'విశ్వవిద్యాలయం లేదా ఈ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి అరాచకం, నిరంకుశ ప్రవర్తన ఏమిటి? యువత నిరసనలు చేయకుండా, ప్రశ్నలు అడగకుండా ఆపడానికి అందరూ మోదీ, కేంద్ర ప్రభుత్వంలా ఇంకెంతకాలం తయారవుతారు?' అని ఆయన ప్రశ్నించారు. విశ్వవిద్యాలయంలోని అవసరాలపై తమ ఆందోళనను వ్యక్తం చేయడానికి విద్యార్థులు ఒక నాటకాన్ని ప్రదర్శించారని, నాటకం ప్రదర్శించడం నేరంగా మారిందా అని ఆయన ప్రశ్నించారు. 'ఇప్పుడు ఈ దేశంలో నాటకం వేయడం నేరమా? మీరు వారిని సస్పెండ చేసి, ఇప్పుడు క్షమాపణ అడుగుతున్నారు' అని ఆయన నిలదీశారు. 'ఈ తరం క్షమాపణ పిటిషన్లు రాసే సావర్కర్ తరం కాదు. ఈ తరం గాంధీ నేర్పిన స్ఫూర్తితో నిరసన తెలుపుతుంది, బాబాసాహెబ్ అంబేద్కర్ ఇచ్చిన హక్కులతో ప్రశ్నలు అడుగుతుంది. ఇది మనుస్మృతి కాదు, ఇది రాజ్యాంగం' అని ఆయన అన్నారు. ఆ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉన్నత విద్యాశాఖ మంత్రి జోక్యం చేసుకుని, విద్యార్థులను పరీక్షలు రాసేందుకు అనుమతించడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. తాను నిరసన తెలిపేందుకు ఇక్కడికి వచ్చానని, కానీ ఇది ఇలాగే కొనసాగితే, తాను వచ్చి వారితో పాటు ఇక్కడే కూర్చుంటానని వాగ్దానం చేశారు. తనకు ఎలాంటి అభ్యంతరం లేదు అని, అన్ని పనులు ఆపేసి ఇక్కడికి వచ్చి కూర్చోగలనన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంలా కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం ఎందుకు ప్రవర్తిస్తోందని ఆయన ప్రశ్నించారు. క్షమాపణ లేఖలు అడగడం, సస్పెన్షన్లకు పాల్పడటం మాని, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నమ్మకాన్ని గెలుచుకోవాలని ఆయన మంత్రిని కోరారు. నిరసన చేస్తున్న విద్యార్థులకు మద్దతు తెలిపినందుకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఇతర యువజన సంస్థలకు రాజ్ ధన్యవాదాలు తెలిపారు.

అభిషేక్ బెనర్జీ నివాసంపై మరోసారి

బిజెపి గూండాలు దాడి

ఆరు నెలల్లో ఇది ఏడవ హత్యాయత్నం

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన నాటి నుంచి బిజెపి గూండాలు ప్రతిపక్ష టిఎంసి నేతలపై దాడులకు పాల్పడుతున్నారని ఆ పార్టీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసున్నా రు. తాజాగా శనివారం తెల్లవారుజామున టిఎంసి ఎంపి అభిషేక్ బెనర్జీ ఇంటిపై మరోసారి దాడులు జరిగాయి. తన తన నివాసంపై బిజెపి గూండాలు దాడి చేశారని అభిషేక్ బెనర్జీ ఆరోపించారు. పండుగ సీజన్‌లో శాంతిభద్రతలను కాపాడటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ప్రతిపక్ష పార్టీ ఆరోపించింది. మూడుసార్లు డైమండ హార్బర్ ఎంపిగా ఎన్నికైన బెనర్జీ, తనను చంపే కుట్రలో భాగంగానే ఈ దాడి జరిగిందని పేర్కొన్నారు. గత ఆరు నెలల్లో తనపై ఇది ఏడవ హత్యాయత్నమని ఆయన ఆరోపించారు. ఈ ఘటనకు ముందు వరుసగా రెండు రోజుల పా టు తన కార్యాలయం, నివాసంపై నిఘా ఉంచార ని, ఈ దాడిలో తన మద్దతుదారులలో చాలా మ ంది తీవ్రంగా గాయపడ్డారని ఆయన ఆరోపించా రు. 'రెండు రోజుల నిరంతర రెక్కీ తర్వాత, శనివారం తెల్లవారుజామున 2 గంటలకు బిజెపి గూండాలు నా ఇంటిపై ఈ విధంగా దాడి చేశారు. ఫుటేజ్ చూసి మీరే తెలుసుకోండి. ఎన్నికైన పార్లమెంట్ సభ్యుడికే ఇలా జరగగలిగితే, పశ్చిమ బెంగాల్‌లోని సామాన్యుడి దుస్థితిని ఊహించుకోండి' అని అని బెనర్జీ ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ ఘటనకకు సంబంధించిన వీడియోను ఆయన షేర్ చేశారు. శనివారం అభిషేక్ పుట్టినరోజు వేడుకల కోసం మమతా బెనర్జీ నేతృత్వంలోని టిఎంసి కార్యకర్తలు కాళీఘాట్‌లోని ఆయన నివాసం వద్ద గుమిగూడగా, బిజెపి మద్దతుదారులు దొంగ అని నినాదాలు చేయడంతో ఈ ఘటన ప్రారంభమైనట్లు సమాచారం. ఈ నినాదా ల అనంతరం ఇరు వర్గాల మధ్య ఎదురు నినాదా లు, వాగ్వాదాలు, ఘర్షణ చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో దాడి, రాళ్ల దాడి, విధ్వంసం వంటి ఆరోపణలు కూడా వ్యక్తమయ్యాయి. గాయపడిన పార్టీ కార్యకర్తలను పరామర్శించడానికి రాత్రివేళ తన నివాసం నుంచి బయటకు వచ్చిన ఆ ఎంపి, దాడి చేసినవారు మేకులు అమర్చిన కర్రలతో పార్టీ స్థానిక కార్యాలయాన్ని ధ్వంసం చేశారని ఆరోపించారు. తన మద్దతుదారులలో నలుగురు నుంచి ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారని, వారిలో ఒకరికి ప్లాస్టిక్ సర్జరీ అవసరమవగా, మరొకరికి ఎముక విరిగిందని ఆయన పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది ఘటనా స్థలంలోనే ఉన్నప్పటికీ దాడిని నివారించడంలో విఫలమయ్యారని కూడా అభిషేక్ బెనర్జీ ఆరోపించారు.

యుద్ధం.. సరిహద్దు కాల్పులకే పరిమితం కాదు



• సైబర్, డ్రోన్ల దాడులు, పరోక్ష యుద్ధాలు, సమాచార కార్యకలాపాల వరకు విస్తరణ • భద్రత పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారింది : రాజ్‌నాథ్‌సింగ్

బాగ్డోగ్రా : సంప్రదాయ సరిహద్దు కాల్పులకు మించి సైబర్, డ్రోన్ల దాడులు, పరోక్ష యుద్ధాలు, సమాచార కార్యకలాపాల వరకు యుద్ధం విస్తరించడంతో భద్రతా పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శనివారం అన్నారు. దీపావళి పండుగ సందర్భంగా బాగ్డోగ్రా ఎయిర్‌ఫీల్డ్ భారత వైమానిక దళ సిబ్బందినుద్దేశించి రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడుతూ, ప్రత్యక్ష ఘర్షణకు దిగకుండా శత్రువులు మన బలహీనతలను ఉపయోగించుకోవడానికి ఎక్కువగా ప్రయత్నిస్తున్నారన్నారు. 'యుద్ధం ఇకపై కేవలం సరిహద్దు కాల్పులకు మాత్రమే పరిమితం కాలేదు. ఇది అసమాన యుద్ధం, పరోక్ష యుద్ధాలు, సైబర్ దాడులు, డ్రోన్ల దండనం, సమాచార కార్యకలాపాలు వంటి వాటిని కలుపుకొని బాగా విస్తరించింది' అని ఆయన అన్నారు. నేడు శత్రువు తరచుగా ప్రత్యక్ష ఘర్షణకు దానికి బదులుగా మన బలహీనతలను ఉపయోగించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు అని రక్షణ మంత్రి అన్నారు. సోషల్ మీడియా ద్వారా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం ద్వారా స్థానిక ప్రజలు, సైనికులలో అనుమానాలను రేకెత్తించడానికి కూడా శత్రువు ప్రయత్నిస్తున్నాడని సింగ్ తెలిపారు. సాయుధ దళాల సిబ్బంది మారుతున్న బాధ్యతలను నొక్కిచెబుతూ, సైనికులు తమ కార్యాచరణ రంగాలలోనే కాకుండా, కొత్తగా వస్తున్న సైబర్, సమాచార ముప్పుల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు. కేవలం అప్రమత్తత, విచక్షణ ద్వారా మాత్రమే శత్రువు ప్రతి ప్రయత్నాన్ని విఫలం చేయగలమన్నారు. వాయుసేన సిబ్బందికి దీపావళి శుభాకాంక్షలు తెలియజేయాలనే ఉద్దేశ్యంతోనే తాను బాగ్డోగ్రా వైమానిక స్థావరాన్ని సందర్శించినట్లు సింగ్ తెలిపారు. ఈ పండుగ వేడుకల సమయంలో తమ ప్రియమైన వారికి దూరంగా ఉన్న జవాన్ల కుటుంబాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈశాన్య ప్రాంత భద్రతను పర్యవేక్షించడంలో బాగ్డోగ్రా వైమానిక స్థావరం భారతదేశ రక్షణ వ్యవస్థలో ఒక అంతర్భాగమని పేర్కొంటూ, దాని వ్యూహాత్మక ప్రాముఖ్యతను, సున్నితత్వాన్ని సింగ్ నొక్కి చెప్పారు. 'ఆత్మనిర్భర్ భారత్' నినాదాన్ని హైలైట్ చేస్తూ, భారతదేశపు స్టార్టప్‌లు, స్వదేశీ పరిశ్రమలు ఇప్పుడు డ్రోన్‌లను తయారు చేస్తున్నాయని, డ్రోన్ నిరోధక సాంకేతికతలను అభివృద్ధి చేస్తున్నాయని, సైనికుల కోసం మెరుగైన ఉత్పత్తులను ఉత్పత్తి చేస్తున్నాయని సింగ్ అన్నారు. మన దేశంలో అభివృద్ధి చేసిన సాంకేతిక పరిజ్ఞానాలకు మన జవాన్లు క్రమంగా అలవాటు పడుతున్నారని ప్రకటించడానికి గర్వపడుతున్నానని, సైనికులను మరింత సాంకేతిక పరిజ్ఞానంతో తీర్చిదిద్ది, వారిని భవిష్యత్తుకు సిద్ధంగా ఉంచాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. సైనికుల మనోధైర్యాన్ని ఉన్నతంగా ఉంచాల్సిన అవసరాన్ని సింగ్ నొక్కిచెప్పారు.

ఆస్పత్రి నుంచి శరద్ పవార్ డిశ్చార్జ

ముంబయి : ఎన్‌సిపి చీఫ్ శరద్ పవార్ ముంబయిలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రి నుంచి శనివారం డిశ్చార్జ్ అయ్యారు. ఛాతి, శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్‌కు ఆయన చికిత్స పొందారు. శరద్ పవార్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. ఇక నుంచి ఇంటి వద్దే రికవరీ జరగనున్నట్లు తెలిపారు. చికిత్సకు శరద్ పవార్ మంచిగానే స్పందిస్తున్నారని, మందులు తీసుకోవాలని ఆయనకు సూచన చేశామని, వయసు దృష్ట్యా అదనపు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించామని డాక్టర్ ప్రీతమ్ సమ్దానీ తెలిపారు. 2వ తేదీన పుణెలోని రూబీ హాల్ క్లినిక్‌లో శరద్ పవార్ చేరారు. అయితే అదే రోజు మెరుగైన చికిత్స కోసం ఆయన్ను ముంబయిలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రికి తరలించారు. గత మూడు రోజుల నుంచి వైద్యుల పర్యవేక్షణలో ఆయన ఉన్నారు. శరద్ పవార్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో ఆయనతో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. మహారాష్ట్ర డిప్యూటీ సిఎం ఏకనాథ్ షిండేతో పాటు అనేక మంది ప్రముఖులు పవార్‌ను ఆస్పత్రి వద్ద కలిశారు.



మేఘాలయలో1901 తరువాత

2025లో అత్యంత వేడి

షిల్లాంగ్: మేఘాలయలో 1901 తర్వాత అత్యంత వేడి 2025లో నమోదైంది. రాష్ట్రంలో నైరుతి రుతుపవన వర్షపాతం సాధారణం కంటే 43 శాతం తక్కువగా ఉన్నప్పటికీ, వార్షిక సగటు ఉష్ణోగ్రత 20.77 డిగ్రీల సెల్సియస్‌కు పెరిగినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండి) నివేదిక వెల్లడించింది. వార్షిక సగటు ఉష్ణోగ్రత 1991–2020 దీర్ఘకాలిక సగటు కంటే 0.96 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా ఉండటంతో, మేఘాలయలో నమోదైన వాతావరణ చరిత్రలో 2025 అత్యంత వేడి సంవత్సరంగా నిలిచింది. రాష్ట్రంలో వార్షిక కనిష్ట ఉష్ణోగ్రత 1901 తర్వాత అత్యధికంగా ఉండగా, గరిష్ట ఉష్ణోగ్రత మూడవ స్థానంలో ఉందని కూడా ఈ నివేదిక వెల్లడించింది. ఈ పరిశోధన ఫలితాలు, మేఘాలయ ప్రభుత్వ సహకారంతో పుణెలోని ఐఎండి వాతావరణ పరిశోధన, సేవల కార్యాలయం రూపొందించిన 'మేఘాలయ కోసం వాతావరణంపై ప్రకటన: 2025'లో భాగంగా ఉన్నాయి. ఈ అంచనా, 1901 నుండి ఉన్న వాతావరణ రికార్డులను ఉపయోగించి ఉష్ణోగ్రత పోకడలు, వర్షపాత సరళి, తీవ్రమైన వాతావరణ సంఘటనలను పరిశీలిస్తుంది. నివేదిక ప్రకారం, 1901–2025 మధ్య మేఘాలయ వార్షిక సగటు ఉష్ణోగ్రత శతాబ్దానికి 0.73 డిగ్రీల సెల్సియస్ చొప్పున పెరిగింది. కనిష్ట ఉష్ణోగ్రతలు శతాబ్దానికి 0.62 డిగ్రీలు పెరగగా, గరిష్ట ఉష్ణోగ్రతలు అంతకంటే వేగంగా శతాబ్దానికి 0.85 డిగ్రీల చొప్పున పెరిగాయి. నైరుతి రుతుపవనాల సమయంలో ఈ వేడి స్పష్టంగా కనిపించింది. ఆ సమయంలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1.2 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా నమోదయ్యాయి. దీంతో, 1901 తర్వాత గరిష్ట ఉష్ణోగ్రతల పరంగా ఇది రికార్డు స్థాయిలో అత్యంత వేడి రుతుపవన కాలంగా నిలిచింది. రికార్డు స్థాయిలో వేడి ఉన్నప్పటికీ, 2025లో రాష్ట్రంలో గణనీయమైన వర్షపాత లోటు ఏర్పడింది. ఇది తన వార్షిక దీర్ఘకాల సగటు వర్షపాతంలో కేవలం 73



శాతాన్ని మాత్రమే పొందింది, కాగా నైరుతి రుతుపవనాల వర్షపాతం సాధారణంలో 57 శాతంగా ఉంది. మేఘాలయ వార్షిక వర్షపాతంలో 71.8 శాతం రుతుపవనాల నుండే వస్తుంది. వార్షిక వర్షపాతంలో సుమారు 19.1 శాతం వాటా కలిగిన రుతుపవనాలకు ముందు కాలంలో కురిసిన అధిక వర్షపాతం, లోటును పాక్షికంగా భర్తీ చేసింది. అయితే, జూన్ నుండి అక్టోబర్ వరకు వర్షపాతం ప్రధానంగా సాధారణం కంటే తక్కువగా నమోదైంది, జులైలో అత్యధిక లోటు నమోదైంది. శీతాకాలం, రుతుపవనాల కాలం, రుతుపవనాల అనంతర కాలాల్లో కూడా వర్షపాతం లోటుగా నమోదైంది. 11 జిల్లాల వారీగా జరిపిన అంచనా ప్రకారం, ఆరు జిల్లాల్లో వర్షపాతం లోటుగా, మూడు జిల్లాల్లో సాధారణ వర్షపాతం, ఒక జిల్లాలో అధిక వర్షపాతం, మరొక జిల్లాలో తీవ్ర లోటు నమోదయ్యాయి. నైరుతి ఖాసీ హిల్స్‌లో అధిక వర్షపాతం నమోదు కాగా, పశ్చిమ జైంతియా హిల్స్‌లో తీవ్ర వర్షపాతం లోటు నమోదైంది. ఈ నివేదిక దీర్ఘకాలిక వర్షపాత ధోరణులలోని వైరుధ్యాలను కూడా వెలుగులోకి తెచ్చింది. 1951 నుండి 2024 మధ్య వార్షిక వర్షపాతాన్ని విశ్లేషించగా, పశ్చిమ మేఘాలయలోని మూడు పొరుగు జిల్లాల్లో వర్షపాతం పెరుగుతున్న ధోరణి కనిపించగా, మిగిలిన జిల్లాల్లో తగ్గుదల ధోరణులు నమోదయ్యాయి. ఈ అంచనా కోసం ఐదు జిల్లాల డేటా అందుబాటులో లేదు. మొత్తం వర్షపాతం లోటు ఉన్నప్పటికీ, 2025లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తీవ్రమైన వర్షపాతం నమోదైంది.

ట్రంప్ ప్రతిపాదన ప్రమాదకరం: జెలెన్‌స్కీ

కీవ్:రష్యా–ఉక్రేన్ మధ్య యుద్ధం ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ వారారంభంలో ప్రతిపాదించిన ''శక్తిమంతమైన భద్రతా ఒప్పందం'' ప్రమాదకరం కావచ్చునని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సిఎన్ఎన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో హెచ్చరించారు.గతవారంలో ట్రంప్ ఓవల్ ఆఫీస్‌లో పాత్రికేయులతో మాట్లాడుతూ, పుతిన్ ప్రతినిధి కిరిల్ దిమిత్రియేవ్‌ను తాను కలిశానని, మాట్లాడానని ధృవీకరించారు. ట్రంప్ సతీమణి ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమానికి కిరిల్ దిమిత్రియేవ్ హాజరయ్యారు.రష్యా–ఉక్రేన్ మధ్య యుద్ధం విరమింపజేసి శాంతి సాధించడానికి ట్రంప్ కొన్ని అంశాలతో ఒక ప్రతిపాదన చేశారు.కిరిల్ డిమిత్రియేవ్‌తో ఏం చర్చించారని ప్రశ్నించినప్పుడు, ఆ విషయాలు మీకు చెప్పలేనని,కానీ రష్యా–ఉక్రేన్ మధ్య చాలా పెద్ద ఒప్పందం కుదరబోతోందని అన్నారు.ఈ ఒప్పందంలో యూరప్ దేశాలు కూడా భాగస్వామిగా ఉంటాయని అన్నారు. యూరప్‌తోసహా రష్యా, ఉక్రేన్‌లకు కూడా మేలు చేసేవిధంగానాలుగు సూత్రాలతో ఒక ప్రతిపాదన సిద్ధమైనట్లు గతనెలారంభంలో వార్తలు వెలువడ్డాయి.ఈ ప్రతిపాదనల్లో రష్యా చమురు యూరప్‌కు సరఫరాచేసే అంశం కూడా ఉంది.ఐతే జెలెన్‌స్కీ తన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ,యుద్ధ విరమణ గురించి రష్యా ఎలాంటి ప్రతిపాదనలు,ప్రకటనలు చేయదంలేదని,కానీ ఇప్పుడిప్పుడే యూరప్‌తో ఒక పరిష్కారం గురించి కొత్త భద్రతా నిర్మాణాంశాల గురించి ఆలోచిస్తోందని, ఇది ఉక్రేన్‌కంటే యూరప్‌కే ఎక్కువ ప్రమాదం తెచ్చిపెడుతుందని అన్నారు.''మాకు యాల్టా,యాల్టా–2 వంటివి వద్దు,రష్యా వల్ల విభజనకు గురికావడానికి ఉక్రేన్ సిద్ధంగా లేదు'' అన్నారు.ఈ పేరుతో 1945లో జరిగిన సమావేశాన్ని ఆయన ప్రస్తావించారు.ఈనెల 10–11 తేదీలలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని అబుధాబి నగరంలో అమెరికా–రష్యా,ఉక్రేన్ మధ్య త్రైపాక్షిక సమావేశానికి సన్నాహాలు జరుగుతున్న తరుణంలో జెలెన్‌స్కీ ఈ విషయం చెప్పారు.

ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా ప్రజాతీర్పు: అమెరికా కమ్యూనిస్టు పార్టీ

సోషలిజమే శాశ్వత పరిష్కారం

వాషింగ్టన్: అమెరికా మధ్యంతర ఎన్నికల్లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు, మగా (మేక్ అమెరికా గ్రేట్ అగెయిన్) రాజకీయ విధానాల కు వ్యతిరేకంగా ప్రజా తీర్పు వచ్చిందని అమెరికా కమ్యూనిస్టు పార్టీ (సిపియుఎస్ఎ) వ్యాఖ్యానించింది. జాత్యాహంకార, తీవ్ర మితవాద విధానాలను అమెరికన్లు తిరస్కరించినట్లు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. కార్మిక సంఘాలు, అణగారిన వర్గాలు, నల్లజాతీయులు, లాటినో ప్రజలు, మతసంఘాలు, మహిళలు భాగస్వాములైన వామపక్షమధ్యేవాదులు డెమోక్రటిక్ పార్టీ వేదికగా పోటీచేసి అమెరికా ప్రతినిధుల సభ (హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్), సెనేట్‌లలో మెజారిటీ సాధించిందని పార్టీ ప్రకటన వెల్లడించింది. గతంలో రిపబ్లికన్ పార్టీకి బలమైన మద్దతు ఉన్న రాష్ట్రాలతో సహా దేశవ్యాప్తంగా డెమోక్రటిక్ పార్టీ వైపు ఓటర్ల మద్దతు మళ్లడం, విభజన రాజకీయాలు, అణచివేత విధానాలపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని ప్రతిబింబిస్తోందని పేర్కొంది. అదే సమయంలో కార్మిక వర్గం, అణగారిన వర్గాల సమస్యలకు తాత్కాలిక ఉపశమనాలు సరిపోవని, వాటి మూలాలు పరిష్కరించేందుకు వ్యవస్థాగత మార్పు అవసరమని అమెరికా కమ్యూనిస్టు పార్టీ అభిప్రాయపడింది. ఆ మార్పునకు సోషలిజమే మార్గమని వక్కాణించింది. లాభాలకంటే ప్రజలకు, ప్రకృతికి ప్రాధాన్యతనిచ్చే సమాజ నిర్మాణం కోసం పోరాటాన్ని మరింత విస్తరించాలని పిలుపునిచ్చింది. 'వెనక్కి కాదు ముందుకు! లాభాల కోసం కాదు – ప్రజల కోసం, భూగోళం కోసం! కార్మికవర్గ ఐక్యత వర్ధిల్లాలి! సోషలిజం వర్ధిల్లాలి'! అంటూ నినాదాలు ఇచ్చింది.

పార్టీ రాజకీయ కార్యాచరణ కమిషన్ అధ్యక్షులు జోయెల్ ఫిష్‌మన్, సహాధ్యక్షులు రోసానా కాంబ్రోన్, జో సిమ్స్ మాట్లాడుతూ, ఈ ఫలితాలు ప్రజల పోరాట ఫలితమన్నారు. ఓటర్ల సంఖ్యను పరిమితం చేయడం, పోస్టల్ బ్యాలెట్లపై ఆంక్షలు విధించడం, వలసదారులు, అణగారిన వర్గాల ప్రజలను వేధింపులకు గురిచేయడం, నియోజకవర్గాల సరిహద్దులను రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా మార్చడం వంటి వాటి ప్రభావం ఎన్నికలపై పడిందన్నారు. జాతి, జాతీయత, లింగం, లైంగిక ధోరణి, మతం ప్రాతిపదికన ప్రజలను విభజించేందుకు మేక్ అమెరికా గ్రేట్ అగెయిన్ శక్తులు చేపట్టిన జాత్యహంకార, అణచివేత రాజకీయాలను వ్యతిరేకిస్తున్నట్లు నాయకులు స్పష్టం చేశారు. గృహ సంక్షోభం, నిత్యావసరాల ధరలు, యుద్ధోన్మాదానికి పెట్టుబడిదారీ వ్యవస్థ, గరిష్ఠ లాభాల వేటే దేశానికి అత్యంత పెద్ద ముప్పుగా నాయకులు వ్యాఖ్యానించారు. 'ఇరాన్‌పై అమెరికా సాగిస్తున్న యుద్ధానికి ముగింపు పలకాలని... పెట్రోల్, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని... దేశవ్యాప్తంగా తీవ్రమవుతున్న గృహ వసతి సంక్షోభాన్ని పరిష్కరించాలని... కార్మిక సంఘాల హక్కులకు భరోసా కల్పించాలని... గుత్తాధిపత్య సంస్థలు సాగిస్తున్న ధరల దోపిడీని అరికట్టాలని ప్రజలు చేస్తున్న డిమాండ్‌పై నూతన ప్రజాప్రతినిధులు కచ్చితంగా చర్యలు తీసుకోవాలని అమెరికా కమ్యూనిస్టు పార్టీ సూచించింది. ప్రజల జీవితాల్లో మార్పు రాకపోతే 2028 ఎన్నికల్లో గుణపాఠం తప్పబోదని హెచ్చరించింది. ఫాసిస్టు తరహా రాజకీయ దాడుల తీవ్రత కొంత తగ్గినప్పటికీ, ప్రజా ఉద్యమం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని అమెరికా కమ్యూనిస్టు పార్టీ పేర్కొంది. సంపన్నుల ప్రయోజనాలు కాదు ప్రజల కోసం పనిచేయాలని ఈ ఎన్నికల ఫలితాల ద్వారా అమెరికన్లు స్పష్టమైన సందేశమిచ్చారని అభిప్రాయపడింది. ట్రంప్ ప్రభుత్వం ఐసిఇ (వలస, కస్టమ్స్ అమలు సంస్థ ద్వారా వలసదారులపై అణచివేతను పెంచినా, ఇరాన్‌పై యుద్ధాన్ని తీవ్రతరం చేసినా ప్రజలు సమిష్టిగా వ్యతిరేకించాలని, అమెరికా సహా ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యం, శాంతి, సామాజిక న్యాయం కోసం పోరాటం కొనసాగాలని అమెరికా కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది.

చర్చల్లో అమెరికా–ఇరాన్ కీలక పురోగతి?



టెల్అవీవ్: చర్చల్లో అమెరికా–ఇజ్రాయెల్ కీలక పురోగతి సాధించినట్లు ఇజ్రాయెల్ పత్రిక తెలియజేసింది. ఒక దౌత్యవేత్తను ఉటంకిస్తూ, బ్లూంబెర్గ్ డాట్ కామ్ పేర్కొన్న సమాచారాన్ని శనివారం ప్రచురించింది. రెండు దేశాల మధ్య చాలాకాలంగా నిలిచిపోయిన యుద్ధాన్ని ముగించే దిశగా తెర వెనుక చర్చలు కీలక పురోగతి సాధించాయని పేర్కొంది. ఉద్రిక్తతలు తగ్గించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఖతార్ ఎమీర్ తమీమ్ అల్–థానీ మధ్య ఫోన్ సంభాషణ తర్వాత బ్లూంబెర్గ్ పత్రిక ఖతార్ దౌత్యాధికారులను ఉటంకిస్తూ వార్త ప్రచురించింది. అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్‌పార్టీ ఘోర పరాజయం,తనను చూసి ఓటు వేయాలని కీలక రాష్ట్రాలలో ట్రంప్ గొంతెత్తి మొత్తుకున్నాగానీ పరాజయం ఎదురైన పరిస్థితులే దీనికి కారణం కావొచ్చునని అంతర్జాతీయ మీడియాలో వ్యాఖ్యలు వచ్చాయి. అణు కార్యక్రమానికి సంబంధించి గతంలో లేనివిధంగా మధ్యవర్తి దేశం ద్వారా ట్రంప్ నుండి ఇరాన్‌కు ఒక సందేశం అందడం కూడా ఈ పురో గతికి కారణమని ఇజ్రాయెల్ పత్రిక పేర్కొంది. రెండు దేశాల మధ్యా ఎలాంటి చర్చలూ జరగడం లేదని అటు అమెరికా, ఇటు ఇరాన్ చెబుతున్నప్పటికీ, మధ్యవర్తి దేశాల ద్వారా సమాచారం, ఆదాన ప్రదానాలు కొనసాగుతున్నాయి.

అమెరికాకు ఇరాన్ తొలుత చేసిన ఏడురోజుల ప్రణాళికను రెండు రోజులకు కుదించుకుంది. ఈ ప్రణాళిక ప్రకారం, అమెరికాగనుక ఉద్రిక్తతలు తగ్గించేందుకు చర్యలు తీసుకుంటే మొదటిరోజు హోర్ముజ్ జలసంధిని ఇరాన్ సాధారణస్థితిలో వాణిజ్య నౌకల రాకపోకలకు తెరుస్తుంది. రెండోరోజు ఇరు దేశాలమధ్యా చర్చలు ప్రారంభం అవుతాయి. కానీ గతంలో ఈ ప్రతిపాదన ఈ రూపంలో లేదు. ఐతే ఇరాన్ షరతులు నెరవేర్చినప్పుడు మాత్రమే ఈ రెండు రోజుల ప్రణాళిక అమలు జరుగుతుందని ఇరాన్ స్పష్టం చేస్తూ వస్తోంది. పరిస్థితులు తమకు అనుకూలంగా ఉండాలని, ఇరాన్ శాశ్వతంగా తన అణు కార్యక్రమాన్ని రద్దుచేసుకోవాలని ట్రంప్ మొదటినుండీ డిమాండ్ చేస్తున్నారు.

ఇదిలా ఉండగా, ఈ రెండు దేశాలమధ్యా సంఘర్షణకు మూలకారణమైన అణుసమస్యపై కనీసంచర్చిండానికి కూడా ఇన్నినాళ్ళుగా సిద్ధంగా లేని ఇరాన్, తన అణు కార్యక్రమాన్ని కట్టడిచేసే ప్రతిపాదనను సమీక్షిస్తోందని ఈ విషయం గురించి తెలిసిన అమెరికా అధికారి ఒకరు ''టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్'' ప్రతినిధికి ధృవీకరించారు.కాగితంగా మాటలను తాము విశ్వసించబోమని, ఆచరణాత్మక చర్యలు కావాలని ఇరాన్ అత్యున్నత భద్రతాసంస్థ ఉప ప్రధానాధిపతి అలీ బఘేరీ శనివారం చెప్పారు.

హోర్ముజ్ తెరిచేది ఎప్పుడంటే....

అమెరికా తమ షరతులు అంగీకరించినప్పుడే హోర్ముజ్ జలసంధిని తెరుస్తామని ఇరాన్ సైనిక ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ మొహమ్మద్ అక్రమినియా చెప్పారు.టెహ్రాన్ రాష్ట్రం పిష్వా కౌంటీలో 1963 జూన్ ఐదో తేదీన జరిగిన తిరుగుబాటులో ప్రాణత్యాగం చేసినవారికి నివాళులర్పించే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హోర్ముజ్ జలసంధిపై ఇరాన్‌కు పూర్తి ఆధిపత్యం ఉందని, తమను కాదని ఏ ఒక్క నౌకా జలసంధి దాటి వెళ్ళలేదని అన్నారు. నిషేధిత మార్గంలో రహస్యంగా ప్రయాణం చేస్తున్న ఒక చమురు నౌక శనివారంనాడు హోర్ముజ్ జలసంధి తూర్పు ప్రాంతంలో సముద్ర మందుపాతరను ఢీకొని దగ్ధమైపోయిందని చెప్పారు.తమ అనుమతితోనే నౌకలు జలసంధిలో తిరగ గలుగుతాయని,అందువల్ల ఇరాన్ షరతులు అంగీకరించినప్పుడే జలసంధిని తెరుస్తామని అక్రమినియా చెప్పారు. అమెరికాతో యుద్ధం తర్వాత ఇరాన్ సైన్యాలు మరింత రాటు దేలాయని, ఎంతో నైపుణ్యం సంతరించుకున్నాయని చెప్పారు.

ఇరాన్ అణు రహస్యాలు చెబితే బహుమతి:సెంట్‌కామ్

పెంటగాన్: ఇరాన్ అణు కార్యక్రమానికి సంబంధించిన సమాచారాన్ని చెప్పినవారికి 20 మిలియన్ డాలర్లు బహుమతి ఇస్తామని అమెరికా రక్షణవిభాగం సెంట్‌కామ్ ప్రకటించింది. ఇలాంటి ప్రకటన అమెరికా గతంలో కూడా చేసింది. ఇరాన్ అణు కార్యక్రమం, దాని పరికరాలు, మౌలిక సదుపాయాలు, శాస్త్రవేత్తలు, సిబ్బంది వంటి వివరాలు చెప్పినవారికి ఈ బహుమతి ఇస్తామని ''రివార్డ్స్ ఫర్ జస్టిస్ అనే ప్రభుత్వ కార్యక్రమం ద్వారా సెంట్‌కామ్ తెలియజేసింది. ఈ మేరకు ఎక్స్‌వేదికగా సెంట్‌కామ్ ఒక పోస్టింగ్ పెట్టింది. అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ ఏర్పాటు చేసిన నిబంధనలను ఇరాన్ పాటించడంలేదని, అందువల్ల ఇరాన్ సెంట్రీఫ్యూగల్ ఉత్పత్తి, ఇతర కీలక భాగాల ఉత్పత్తికి సంబంధించిన సమాచారం బహిర్గతం కావడంలేదని, ఈ రహస్యాలు బాహ్య ప్రపంచానికి తెలియాల్సి ఉందని సెంట్‌కామ్ పేర్కొంది. ఐతే ఇరాన్ అణు కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమెరికా నాశనం చేసిందని ఇప్పటికే ట్రంప్ పలుసార్లు ప్రకటించారు.

ఎండబెట్టారు

(మొదటి పేజీ తరువాయి)

దగ్గరుండి కట్టించానని హరీశ్‌రావు గొప్పగా చెప్పుకున్నారని, తన పేరు హరీశ్‌రావు కాదని, కాళేశ్వరరావు అని నాటి గవర్నర్‌తో భజన చేయించుకున్నారని ఎద్దేవా చేశారు. తామే కట్టామని గొప్పలు చెప్పుకున్న వాళ్లు ఇప్పుడు మేడిగడ్డ కూలిపోతే ఎందుకు బాధ్యత వహించట్లేదని నిలదీశారు. మేడిగడ్డ వద్ద వాళ్లను పాతిపెట్టడమే వాళ్లకు సరైన శిక్ష అని సిఎం నిప్పులు చెరిగారు. మేడిగడ్డ బ్యారేజీలో నీళ్లు నిల్వ లేకపోతే కన్నెపల్లి పంపులు పనిచేయవని, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టుల్లోనూ నీళ్లు నిల్వ చేయలేని దుస్థితి అని పేర్కొన్నారు. కాళేశ్వరంపై బిఆర్ఎస్ నేతలు అబద్ధాలు చెప్పి ప్రజలను మభ్య పెడుతున్నారని అన్నారు. మేడిగడ్డతో సంబంధం లేకుండా నీళ్లు ఎత్తిపోసేది ఉంటే మరి అది ఎందుకు కట్టినట్లు? అని నిలదీశారు. పదేళ్లపాటు పాలమూరు జిల్లాను పట్టించుకున్నవాళ్లే లేరని వెల్లడించారు. 'కెసిఆర్ పదేళ్లలో కొడంగల్‌కు ఏమైనా ఇచ్చారా?, పదేళ్లపాటు కొడంగల్‌కు నీళ్లు, నిధులు, ప్రాజెక్టులు ఏమీ ఇవ్వలేదు. ప్రాజెక్టులకు భూములు కోల్పోతున్న వారికి ఎకరాకు రూ.20 లక్షలు ఇస్తున్నాం. ఆనాడు ఎకరాకు రూ.2 లక్షలు ఇచ్చేందుకు కూడా కెసిఆర్‌కు మనసొప్పలేదు. కొడంగల్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై తమ పత్రికల్లో విషం చిమ్ముతున్నారు. మూడేళ్లలో ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా ప్రజల కోసం పనిచేస్తున్నా' అని అన్నారు. లగచర్ల విషయంలోనూ అబద్ధాలు చెప్పి రైతులను భయపెట్టారని సిఎం ఆరోపించారు. ఢిల్లీ – నొయిడా తరహాలో హైదరాబాద్ –లగచర్ల అభివృద్ధి చెందుతుందని, లగచర్లలో పెట్టుబడులు పెట్టేందుకు పెద్దపెద్ద కంపెనీలు వస్తున్నాయని తెలిపారు. హకీంపేటలో 250 ఎకరాల్లో ఎడ్యుకేషన్ హబ్ నిర్మిస్తున్నామని స్పష్టం చేశారు. ఉన్నత విద్యా సంస్థలన్నీ ఒకేచోట ఉండేలా హకీంపేట ఎడ్యుకేషన్ హబ్ నిర్మిస్తున్నామని వెల్లడించారు. తాండూరు కందిపప్పు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని కొనియాడారు. ఇప్పుడు తాండూరు కందిపప్పు చాలా దేశాలకు ఎగుమతి అవుతోందని ఆనందం వ్యక్తం చేశారు. 'ఆదివారం కొడంగల్‌లో రూ.10 వేల కోట్ల పనులను ప్రారంభించనున్నాం. వేషాలు మార్చినంత మాత్రాన కెటిఆర్ ఎప్పుడూ రేవంత్‌రెడ్డి కాలేరు. తెలంగాణ ప్రజలు ఎప్పుడూ క్షమించరాని తప్పులు కెసిఆర్ కుటుంబం చేసింది. ఇసుక వ్యాపారానికి అడ్డువస్తున్నారని నేరెళ్ల దళితులను వేధించింది ఎవరూ మర్చిపోలేదు. గిట్టుబాటు ధర అడిగినందుకు ఖమ్మంలో రైతులకు బేడీలు వేసిన విషయాన్ని మర్చిపోలేదు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో ఎండలు మరింత తీవ్రం అవుతాయని, యాసంగిలో ఆరుతడి పంటలు మాత్రమే వేయాలని, విపక్ష నేతల తప్పుడు మాటలు నమ్మి మోసపోవద్దని రైతులకు రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. జులై వరకు వర్షాలు వచ్చే అవకాశాలు లేవని ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. అందరం కలిసికట్టుగా ఉండి ఎల్‌నినోను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. తమను గెలిపించలేదని ప్రజలపై కెసిఆర్ కుటుంబం పగబట్టిందని, ఓటు వేయలేదనే కక్షతో అబద్ధాలు చెప్పి ఆగం చేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు.

కొడంగల్‌ను దేశానికే అభివృద్ధి నమూనాగా తీర్చిదిద్దుతా

దేశంలోనే కొడంగల్‌ను అభివృద్ధికి నమూనాగా తీర్చిదిద్దుతానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వెనుకబడిన ప్రాంతంగా ఉన్న కొడంగల్‌ను, విద్య, వ్యవసాయం పారిశ్రామిక రంగాల్లో ముందంజలో నిలిపేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నట్లు వెల్లడించారు.



వ్యవసాయ శాఖ అనుబంధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి, రైతులకు అందుబాటులో ఉన్న ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, వివిధ పంటల సాగు విధానాలను పరిశీలించారు. కొడంగల్ ప్రాంతంలో పరిశ్రమలను ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఈ ప్రాంతాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేయడంతోపాటు పారిశ్రామికంగా కూడా ముందుకు తీసుకెళ్తామని వెల్లడించారు. మక్తల్ – నారాయణపేట్, కొడంగల్ ఎత్తిపోతల పథకం రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి భూసేకరణ పనులు చేపట్టామని, త్వరలోనే రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వ్యవసాయమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, బిసి సంక్షేమశాఖ మంత్రి వాకాటి శ్రీహరి, మహబూబ్‌నగర్ ఎంపి మల్లురవి, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ఎమ్మెల్యేలు యాదయ్య, రామ్మోహన్‌రెడ్డి , మనోహర్‌రెడ్డి, వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సురేందర్ మోహన్, వికారాబాద్, నారాయణపేట్ జిల్లా కలెక్టరుల దీపక్‌తివారి, ప్రియంక, ఎస్‌పి స్నేహమెహ్రా, గ్రంథలయ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గృహనిర్బంధం

(మొదటి పేజీ తరువాయి)

పెన్షనర్లు అనేకమంది మధ్యతరగతి ప్రజలు తమ డిపాజిట్లు సేవింగ్‌ను ఇంటి ఖర్చుల నిమిత్తం నగదు తీసుకోలేకపోయారు. దీంతో ప్రజలు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. నిరసన తెలియజేశారు. తమ ధనాన్ని కొల్లగొట్టారని, తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని ప్రజలు నిరసన ప్రదర్శనలు చేశారు. అనేకచోట్ల పోలీసులు, ప్రజలకు మధ్య ఘర్షణలు చెలరేగాయి. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. లాఠీఛార్జీ చేశారు. ఫలితంగా రాజకీయ సంక్షోభం తలెత్తింది. దీంతో చట్టసభలో దేశాధ్యక్షుడు శాంటియాగో పెనాపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టారు. ఆయనను అరెస్టు చేశారు. సొంతపార్టీకి చెందినవారు సహా పరాగ్వే చట్టసభ సభ్యులు దేశాధ్యక్షుణ్ణి బాధ్యుణ్ణిచేస్తూ, పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ, ఏకగ్రీవ తీర్మానం చేసిన కొద్ది నిమిషాలకే పెనాను అరెస్టు చేశారు. పెనా దేశాధ్యక్ష పదవి నుండి వైదొలగేందుకు గడచిన శుక్రవారంనాడే సుముఖత వ్యక్తం చేశారు. కానీ శనివారం నాడు చట్టసభలో ఆయనపై అభిశంసన తీర్మానం ద్వారా అరెస్టు చేశారు. గత సంవత్సరం వరకూ ఆ బ్యాంకులో దేశాధ్యక్షుడు పెనాకు వాటాలు ఉన్నాయి. తాను ఏ తప్పూ చేయలేదని ఆయన వాదిస్తున్నారు. బ్యాంకు నిధులను దారిమళ్లించారని, తన రాజకీయ పలుకుబడితో అధికార దుర్వినియోగంతో ఖాతాదారులకు వ్యతిరేకంగా చర్యలకు పాల్పడ్డారని ఆయన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. బ్యాంకు లావాదేవీలు జరగకపోవడం, నిధులు లేకపోవడంతో నష్టపోయిన దేశంలోని లక్షల మంది ఖాతాదారులకు నష్టపరిహారం చెల్లిస్తామని కొత్త తాత్కాలిక అధ్యక్షుడు అలియానా ప్రకటించారు. నిర్ణీత ప్రకారం ఎన్నికలు జరిగేవరకూ అంటే 2028 వరకూ అలియానా అధ్యక్ష పదవిలో కొనసాగుతారు.

ఆత్మగౌరవం

(మొదటి పేజీ తరువాయి)

భద్రత, భరోసా కల్పించే చిరునామా అని ఆయన అన్నారు. సచివాలయంలో హౌసింగ్ అధికారులతో శనివారం 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చి అర్హులైన పేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. తొలి విడతలో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. విడతల వారీగా ఆర్థిక సహాయం అందిస్తూ లబ్ధిదారులపై భారం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదల సొంతింటి కల కలగానే మిగిలిపోయిందని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్ల పథకం క్షేత్రస్థాయిలో అమలవుతూ లక్షలాది కుటుంబాల్లో కొత్త ఆశలు నింపుతోందన్నారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. పేదలకు కేవలం నివాసాన్ని కల్పించడం మాత్రమే కాకుండా వారి కుటుంబాల్లో ఆనందం, ఆత్మవిశ్వాసం, భవిష్యత్తుపై భరోసా నింపడమే ప్రభుత్వ అసలు లక్ష్యమని చెప్పారు. ఈ లక్ష్యంతోనే 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని రూపొందించినట్లు మంత్రి తెలిపారు. పేదల ఇళ్లలో దీపావళి వెలుగులు నింపుతూ, లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి పండుగ సంతోషాలను పంచుకోవడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ఇందులో భాగంగా ఆదివారం పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్ మండలం కామంచికల్, నేలకొండపల్లి మండలం కోరట్లగూడెం, కూసుమంచి మండలం పాలేరు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారితో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొని, పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తామన్నారు.

కోట్లు మాయం

(మొదటి పేజీ తరువాయి)

సంస్థకు చెందిన కార్పొరేట్ బ్యాంకు ఖాతా నుంచి ఈ నగదు బదిలీ జరిగినట్లు సంస్థ ప్రతినిధులు గుర్తించారు. నవంబర్ 6న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య ఈ లావాదేవీలు జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సంస్థ డైరెక్టర్ చాగంటి వరప్రసాద్ తరఫున శిల్పా జైన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పరిధిలోని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ (హెడ్‌క్వార్టర్స్)లో కేసు నమోదైంది.కీర్తన ఫిన్‌సర్వ్ లిమిటెడ్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో నమోదైన నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీగా పనిచేస్తోంది. సంస్థకు చెందిన ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులోని కార్పొరేట్ ఖాతా నంబర్ 10111853303 నుంచి అనుమతి లేని లావాదేవీలు జరిగినట్లు శుక్రవారం గుర్తించారు. మొత్తం రూ.7,09,98,000 నగదు వివిధ గుర్తుతెలియని లబ్ధిదారుల ఖాతాలకు బదిలీ అయినట్లు ఫిర్యాదులో వివరించారు. ఈ లావాదేవీలు ఐఎంపీఎస్, ఆర్టీజీఎస్ విధానాల్లో జరిగినట్లు పేర్కొన్నారు. పునీత్ ట్రేడర్స్, రాహుల్ ఎంటర్‌ప్రైజెస్, జీవా కలెక్షన్, హరే రామ్ బ్రహ్మచారి కన్‌స్ట్రక్షన్ కంపెనీ, ఏ టు జెడ్ అల్యూమినియం అండ్ ఎస్ఎస్ పైప్స్ సహా పలు సంస్థలు, వ్యక్తుల పేర్లతో ఉన్న ఖాతాలకు నగదు బదిలీ అయినట్లు లావాదేవీల వివరాల్లో వెల్లడైంది. ఒక్కో ఖాతాకు పలుమార్లు నగదు పంపినట్లు గుర్తించారు. నగదు మరింతగా చేతులు మారకుండా ఉండేందుకు సంస్థ భాగస్వామ్య బ్యాంకును సంప్రదించి అనుమానాస్పద బ్యాంకింగ్ మార్గాలను తక్షణమే నిలిపివేయాలని కోరింది. ఇప్పటికే జాతీయ సైబర్ నేరాల హెల్ప్‌లైన్ 1930 ద్వారా ఫిర్యాదు చేయగా, 33711260059470 నంబరుతో గుర్తింపు లభించింది. బదిలీ అయిన నగదును గుర్తించి, సంబంధిత లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసి, నిధులను తిరిగి రాబట్టేందుకు పోలీసుల సహకారం కోరారు. ఫిర్యాదు ఆధారంగా సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వో జి. శ్రీనివాసు కేసు నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహితలోని 318(4), 319(2) సెక్షన్లతో పాటు సమాచార సాంకేతిక చట్టంలోని 43, 66, 66(సి), 66(డి) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ డి. ఆశిష్ రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు. నగదు బదిలీ అయిన ఖాతాల వివరాలు, లావాదేవీల వెనుక ఉన్న వ్యక్తుల గుర్తింపు, నిధుల ఆచూకీపై దర్యాప్తు కొనసాగుతోంది.

కొత్త పింఛన్లు

(మొదటి పేజీ తరువాయి)

పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. సమాజంలో అత్యంత ఆసరా అవసరమైన వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, నేత కార్మికులు, గీత కార్మికులు తదితర వర్గాలకు చెందిన అర్హులను గుర్తించి ఈ కొత్త పింఛన్‌లను మంజూరు చేశారు. కోడంగల్‌లో నిర్వహించే బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొంతమంది నూతన లబ్ధిదారులకు స్వయంగా మంజూరు పత్రాలను అందజేస్తారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో స్థానిక మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుల చేతుల మీదుగా మిగిలిన లబ్ధిదారులకు ఈ పత్రాల పంపిణీ కార్యక్రమం కొనసాగనుంది. నూతనంగా ఎంపికైన లబ్ధిదారులందరికీ ఈ నెల నుంచే పింఛను మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం లేదా నేరుగా అందజేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

ఇ20 కాదు.. 420

(మొదటి పేజీ తరువాయి)

20 శాతానికి మించి ఉన్నట్లు పేర్కొన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఒసిఎల్) పెట్రోల్ నమూనాలో 31.2 శాతం, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పిసిఎల్) నమూనాలో 30.5 శాతం ఇథనాల్ ఉన్నట్లు పరీక్షల్లో తేలిందని ఆయన వెల్లడించారు. ఐఒసిఎల్, హెచ్‌పిసిఎల్‌తో పాటు భారత్ పెట్రోలియం (బిపిసిఎల్), నయారా, షెల్ వంటి సంస్థలు కూడా నిర్దేశిత పరిమితిని మించి ఇథనాల్ కలుపుతున్నాయని ఆరోపించారు. ఆయా కంపెనీల సొంత ప్రయోగశాలలు సైతం ఇథనాల్ శాతానికి సంబంధించిన వివరాలను వెల్లడించలేదని విమర్శించారు.

ఇ–20 కాస్త 420గా మారిందని వ్యాఖ్యానిస్తూ, ప్రజల వాహనాల నుంచి పెట్రోల్ పేరుతో డబ్బులు వసూలు చేసి, అధికంగా ఇథనాల్ కలిపిన ఇంధనాన్ని అందిస్తున్నారని ఆరోపించారు. అధికంగా ఇథనాల్ కలపడం వల్ల వాహనాల పనితీరు దెబ్బతింటుందని, ఫలితంగా మైలేజ్ తగ్గడంతో పాటు నిర్వహణ ఖర్చులు కూడా పెరుగుతాయని రాహుల్ పేర్కొన్నారు. పెట్రోల్ బంకులలో పెట్రోల్‌లోని ఇథనాల్ శాతాన్ని వెల్లడించే లేబుళ్లు లేకపోవడాన్ని కూడా ఆయన ప్రశ్నించారు. 'మోదీ జీ, మాకు చెప్పండి – దేశపు ట్యాంకుల్లో ఏం పోస్తున్నారు? పెట్రోల్‌లో అసలు ఎంత ఇథనాల్ ఉంది? 20 శాతానికి పైగా ఇథనాల్ కలుపుతున్న కంపెనీలపై ఎప్పుడు చర్య తీసుకుంటారు?' అని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ చర్చకు రావాలని మరోసారి సవాల్ విసిరారు. ఈ చర్చలో ఇథనాల్ మిశ్రమం అంశాన్ని కూడా చేర్చవచ్చని ఆయన అన్నారు. ప్రధాన ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఒఎంసిలు) నిర్దేశించిన 20 శాతం పరిమితిని మించి ఇథనాల్ కలిపిన పెట్రోల్‌ను సరఫరా చేస్తున్నాయని, పరీక్షల్లో ఈ స్థాయిలు 31.2 శాతం వరకు నమోదయ్యాయని కర్ణాటక ప్రభుత్వం ఆరోపించిన మరుసటి రోజు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం కోరింది. కర్ణాటక ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు, న్యాయ కొలమాన శాఖ మంత్రి రిజ్వాన్ అర్షద్ విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తూ బెంగళూరు, కోలార్, చిక్కబళ్లాపుర, బెంగళూరు రూరల్, రామనగర, మంగళూరు, తుమకూరుల నుండి సేకరించిన నమూనాలపై నిర్వహించిన పరీక్షల ఆధారంగా ఈ ఆరోపణలు ఉన్నాయని అన్నారు. బెంగళూరులోని, నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్ (ఎన్‌సిటిబిఎల్) గుర్తింపు, ఐఎస్‌ఒ ధృవీకరణ పొందిన శ్రీరామ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ జారీ చేసిన పరీక్షా ఫలితాల ప్రకారం, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఒసిఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పిసిఎల్) నమూనాలలో ఇథనాల్ శాతం వరుసగా 31.2 శాతం, 30.5 శాతంగా నమోదైంది. ప్రధాన ఇంధన కంపెనీల నుండి సేకరించిన నమూనాలలో ఇథనాల్ శాతం 20 శాతానికి మించి ఉన్నట్లు వెల్లడైందని మంత్రి తెలిపారు. అయితే, ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఒసి), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బిపిసిఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పిసిఎల్) కర్ణాటక ప్రభుత్వ వాదనలను ఖండించాయి. ఈ ఫలితాలకు రావడానికి ఉపయోగించిన నమూనా సేకరణ, పరీక్షా విధానాలను అవి ప్రశ్నించాయి.

కష్టాలకు చెక్

(మొదటి పేజీ తరువాయి)

శుభ్రపరచడం, ఆరబెట్టడం, నిల్వ వంటి అన్ని సదుపాయాలు ఒకే ప్రాంగణంలో కల్పించనున్నారు. యాంత్రిక పద్ధతుల్లో ధాన్యాన్ని ఆరబెట్టి భారీ ఉక్కు గిడ్డంగుల్లో నిల్వ చేయడం ద్వారా నాణ్యతను కాపాడటంతోపాటు నిల్వ నష్టాలను తగ్గించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం కోత అనంతరం ధాన్యంలో సుమారు 25 శాతం తేమ ఉంటోందని, నిల్వ సదుపాయాలు లేక రైతులు అప్పటి మార్కెట్ ధరలకే అమ్ముకోవాల్సి వస్తోందని మంత్రి తెలిపారు. తేమను శాస్త్రీయంగా 12 శాతానికి తగ్గించి నిల్వ చేస్తే ప్రీమియం వరి రకాల ధర క్వింటాలుకు రూ.5 వేల నుంచి రూ.5,500 వరకు పలికే అవకాశముందని వివరించారు. ప్రస్తుతం అధిక తేమతో ఉన్న ధాన్యానికి రూ.3,500 నుంచి రూ.4,500 మాత్రమే లభిస్తోందన్నారు.జేఎస్ఆర్, ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ వంటి తెలంగాణ వరి రకాలకు అంతర్జాతీయ మార్కెట్‌లో పెరుగుతున్న డిమాండ్‌ను సద్వినియోగం చేసుకునేలా సైలోల వ్యవస్థను అభివృద్ధి చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. నిర్మాణ, నిర్వహణ వ్యయాలు, నిధుల సమీకరణ, అద్దె చెల్లింపులపై సమగ్రంగా అధ్యయనం చేసి త్వరగా ప్రతిపాదనలు ఖరారు చేయాలని ఆదేశించారు.ఈ సమీక్ష సమావేశంలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర, అదనపు డైరెక్టర్ రోహిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

త్రివర్ణ జెండా మోసుకెళ్తా

(మొదటి పేజీ తరువాయి)

జరిగింది. దేశంలో నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని, ఆ మేరకు భరోసా ఇచ్చేవరకూ తమ నిరసన పోరాటంకొనసాగుతుందని దీప్కే స్పష్టం చేశారు. సిజెపి నాయకుడు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేయడాన్ని బహిరంగ సభలో ప్రస్తావించారు. వారు త్రివర్ణ పతాకాలు చేతబట్టుకుని జంతర్ మంతర్‌లోకి ప్రవేశిస్తే పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని విమర్శించారు. ''త్రివర్ణ పతాకాన్ని ఎగరేసినందుకు నన్ను జైలులో పెట్టారు, సౌరవ్–అశు ఇద్దరూ నా సోదరులే, వారని కూడా కటకటాల వెనక్కు నెట్టారు, బ్రిటిష్ పాలకులు భారతదేశాన్ని పరిపాలించినప్పుడు గతంలో ఇలాంటి ఘటనలు జరిగాయి, మళ్ళీ ఇప్పుడు జరుగుతున్నాయి'' అన్నారు.మోదీ ప్రభుత్వాన్ని బిటిష్ కాలంనాటి పరిపాలనతో పోల్చారు. దేశంలో ప్రజల స్వేచ్ఛను నియంత్రించడం కోసమే ఈ చర్యలన్నీ జరుగుతున్నాయని విమర్శించారు. ''నేను నరేంద్రమోదీకి ఒక్కటే చెప్పదలచుకున్నాను, నేను ఈ త్రివర్ణ పతాకాన్ని దేశంలో ప్రతిచోటకూ మోసుకువెళతాను, మీరు గనుక నన్ను అరెస్టు చేయదలిస్తే, నన్ను ఢిల్లీలో అరెస్టు చేయండి, మహారాష్ట్ర, తమిళనాడు,కేరళలో అరెస్టు చేయండి, దేశంలో ఏ ప్రాంతం నుండైనా అరెస్టు చేయండి, మళ్ళీ మళ్ళీ నేను తిరిగి వచ్చి ఈ త్రివర్ణ పతాకాన్ని ఎగరవేస్తాను'' అన దీప్కే చెప్పారు. ప్రజలు తినే తిండితోపాటు ఎవరిని ప్రేమించాలి, ఎవరిని పెళ్ళి చేసుకోవాలి అనే విషయాలను నియంత్రించే ప్రయత్నం చేసింది,ఇప్పుడు ఎవరికి ఓటు వేయాలనే విషయాన్ని నియంత్రించే వరకూ కూడా వచ్చిందన్నారు. బి.ఆర్.అంబేద్కర్,మహాత్మాగాంధీ,జవహర్‌లాల్ నెహ్రూ ఈ ముగ్గురు నాయకుల ఆదర్శాలతో ఈ దేశం నిర్మితమైంది, గాంధీ ఈ దేశానికి ఆత్మ, అంబేద్కర్ వెన్నుముక, నెహ్రూను మేధస్సులో పేర్కొంటూ మోదీకి అంతటి స్థాయి లేదని అన్నారు.

ఢిల్లీలోని జంతర్ మంతర్ ప్రదేశాన్ని ప్రజా నిరసనల వేదికల జాబితా నుండి తొలగించడంతో ప్రభుత్వం చర్యకు వ్యతిరేకంగా కోచీలో జంతర్ మంతర్ ర్యాలీ నిర్వహించారు. దేశంలో చేపట్టిన ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సమరణ ప్రక్రియ(సర్)ను తక్షణం ఉపసంహరించుకోవాలని సిజెపి కార్యకర్తలు నినాదాలు చేశారు. సర్ ప్రక్రియకు,జంతర్ మంతర్ వేదిక మూసివేతకు వ్యతిరేకంగా ఢిల్లీలో సిజెపి నాయకులు అరెస్టయిన తర్వాత మొదటిసారి ఆ పార్టీ కోచీ వేదికగా భారీ నిరసన ర్యాలీ నిర్వహించింది.

సర్ ప్రక్రియను ఎన్నికల సంఘం వెనక్కు తీసుకోవాలని ఈ సందర్భంగా ప్రకాశ్ రాజ్ డిమాండ్ చేశారు.కోచీలో ట్రాఫిక్ నియంత్రణకు వీలుగా ప్రదర్శన మార్గంలో పోలీసులను భారీగా మోహరించారు.

నిష్పక్షపాత ఎన్నికల వ్యవస్థకు భరోసా ఇచ్చేవరకూ పోరాటం

ర్యాలీలో పాల్గొనేందుకు వచ్చిన అభిజిత్ దీప్కే కోచీ అంతర్జాతీయ విమానాశ్రయంలో మొదట పాత్రికేయులతో మాట్లాడుతూ,ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా తమ నిరసన ప్రదర్శనలు కొనసాగుతాయని చెప్పారు.దేశంలో నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడానికి వీలుగా ఒక సర్వస్వతంత్రమైన ఎన్నికల వ్యవస్థకు భరోసా ఇచ్చేవరకూ ఆందోళన కొనసాగుతుందని అన్నారు. జ్ఞానేశ కుమార్ నాయకత్వంలో దేశంలో ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగే అవకాశం లేదని అన్నారు. ఆయన పదవి వైదొలగాల్సిందేనన్నారు.''ఆయన పదవి నుండి దిగిపోవాలి, అది అనివార్యం, ఎందుకంటే ఆయన పైన నమ్మకం లేదు, ఒక పార్టీకి అనుకూలంగా వారు ఎన్నికల రిగ్గింగ్‌కు పాల్పడతారు, ఈ విషయంమేమేం అనేక ఉదాహరణలు చూశాం'' అని చెప్పారు.ఈ ప్రదర్శనలో భారీసంఖ్యలో యువకులు పాల్గొంటారన్న ఆశాభావం వ్యక్తం చేశారు.దేశంలో చూసినప్పుడు కేరళలోనే అత్యధికంగా సిజెపి సభ్యత్వం నమోదైందని చెప్పారు.కేరళలో ఉన్న యువకులు భారీ సంఖ్యలో ఈ రోజు ఈ ర్యాలీకి తరలి వస్తారు,ఎందుకంటే మా సభ్యత్వం కేరళలోనే ఎక్కువ,పైగా వారంతా యువకులే అన్నారు.సిపిఐ(ఎం)అనుబంధ డివైఎఫ్ఐ కేరళరాష్ట్ర అధ్యక్షుడు చింతాజెరోమ్ కూడా ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

జంతర్ మంతర్ వేదిక గురించి కాక్రోచ్ జనతాపార్టీ–ఢిల్లీ పోలీస్ మధ్య వరుస వివాదం కొనసాగిన తరుణంలో కోచీలో ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ వివాదంలో ఢిల్లీ పోలీసులు సిజెపి నాయకులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలను అరెస్టు చేశారు. వారు తాళాలువేసి ఉన్న జంతర్ మంతర్ ప్రధాన గేట్లు దూకి లోపలికి ప్రవేశించి నిబంధనలకు విరుద్ధంగా ప్రదర్శన చేశారని, జెండా ఎగురవేశారని ఆరోపిస్తూ ఢిల్లీ పోలీసులు అరెస్టుచేశారు. రిమాండ్‌కు తరలించారు. తర్వాత గతనెలలో పూచికత్తుతో బెయిలుపై విడుదల చేశారు. ఆ తర్వాత అభిజిత్ దీప్కేను తిరంగా మార్చ్ నిర్వహించకముందుగానే పోలీసులు నిర్బంధించారు.



రెండో వన్డేలోనూ న్యూజిలాండ్‌పై

భారత్ విజయం

• 4 రన్స్ తేడాతో ఇండియా విజయం • కివీస్‌తో వన్డే సిరీస్‌లో 2-0 ఆధిక్యం

వెల్లింగ్టన్: న్యూజిలాండ్‌తో జరిగిన రెండో వన్డేలో ఇండియా 4 రన్స్ తేడాతో గెలుపొందింది. డక్‌వర్త్ లూయిస్ విధానంలో మ్యాచ్‌ను గెలిచింది. ఆట నిలిచే సమయానికి ఇండియా ఏడు వికెట్ల నష్టానికి 113 రన్స్ చేసింది. వాస్తవానికి వర్షం వల్ల మ్యాచ్‌ను కుదిరించారు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో వర్షం ఆటను అడ్డుకునే సమయానికి ఇండియా నిర్దేశిత లక్ష్యం కన్నా మూడు రన్స్ అధికంగానే ఉన్నది. దీంతో డక్‌వర్త్ లూయిస్ ప్రకారం టీమిండియా జట్టు విజయాన్ని సొంతం చేసుకున్నది. ఈ విక్టరీతో 5 వన్డేల సిరీస్‌లో భారత్ 2–0 ఆధిక్యాన్ని సాధించింది. వాతావరణం బౌలర్లకు అనుకూలంగా ఉన్నా.. దురదృష్టవశాత్తు న్యూజిలాండ్ విజయాన్ని అందుకోలేకపోయింది. కివీస్ బ్యాటర్లను ఇబ్బంది పెట్టిన గుర్నూర్ బ్రార్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ జట్టు 41 ఓవర్లలో 134 రన్స్‌కే ఆలౌటైంది. కివీస్ బ్యాటర్లలో డారెల్ మిచెల్ 55 రన్స్, సాంట్నర్ 31 రన్స్ చేశారు. అక్షర్, కాంబోజ్, నబీలు రెండేసి వికెట్లు తీసుకున్నారు. లక్ష్యం స్వల్పమే అయినా.. భారత్ కూడా వెల్లింగ్టన్ పిచ్‌పై తడబడింది. భారత బ్యాటర్లలో రోహిత్ శర్మ 23, శ్రేయాస్ అయ్యర్ 30 రన్స్ చేశారు. ఇక కేఎల్ రాహుల్ 26 రన్స్‌తో నాటౌట్‌గా నిలిచాడు. కివీస్ బౌలర్లలో జేమీసన్, డఫీలు చెరి మూడేసి వికెట్లు తీసుకున్నారు.

టెస్టు క్రికెట్‌కు మహమ్మద్ షమీ అల్‌విదా



న్యూఢిల్లీ: భారత స్టార్ పేసర్ మహమ్మద్ షమీ టెస్ట్ క్రికెట్‌కు అల్‌విదా చెప్పేశాడు. తన రిటైర్మెంట్ గురించి సోషల్ మీడియాలో షమీ ఓ వీడియో పోస్టు చేశాడు. తెలుపు దుస్తులకు గుడ్‌బై చెబుతున్నట్లు ఆ వీడియోలో అతను పేర్కొన్నాడు. కానీ ఆ జ్ఞాపకాలను కాదని తెలిపాడు. భారత జట్టు జెర్సీని తొలిసారి ధరించినప్పుడు, దేశానికి ఏదైనా చేసి చూపాలన్న తపన ఉండేదన్నారు. ఆ తర్వాత ప్రతి వికెట్ తీసినా, సంఘర్షణ పడినా, గాయమైనా, మళ్లీ రాణించినా.. ప్రతి సందర్భం ఏదో ఒకటి నేర్పిందని షమీ అన్నాడు. టెస్టు క్రికెట్ అంటే కేవలం ఓ ఫార్మాట్ కాదు అని, నా జీవితంలో ఓ అద్భుత ఘట్టమని తెలిపాడు. ఎంతో భారమైన హృదయంతో రిటైర్మెంట్ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పాడు. తన ప్రయాణంలో తోడుగా నిలిచిన జట్టు సభ్యులకు, కోచ్‌కు, కుటుంబానికి, కోట్లాది భారతీయులకు హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలిపాడు. 36 ఏండ్ల షమీ తన టెస్ట్ కెరీర్‌లో మొత్తం 64 మ్యాచ్‌లు ఆడి 229 వికెట్లు పడగొట్టాడు. గత కొంతకాలంగా గాయాల సతమతమవుతున్న సమస్యలతో అతను 2025 చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ తర్వాత నుంచి జాతీయ జట్టుకు దూరంగా ఉంటున్నాడు. బెంగాల్ తరఫున దేశవాళీ క్రికెట్లో అద్భుత ప్రదర్శన ఇచ్చినప్పటికీ సెలెక్టర్ల నుంచి మళ్లీ పిలుపు లభించలేదు. ఈ నేపథ్యంలో టెస్ట్ ఫార్మాట్ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. అయితే, వైట్‌బాల్ క్రికెట్లో మాత్రం కొనసాగుతానని స్పష్టం చేశాడు. భారత్ తరఫున ఆడిన గర్వం మదిలో ఎప్పటికీ ఉండిపోతుందని షమీ తెలిపాడు.



న్యూజిలాండ్‌పై సిక్సర్ల రికార్డ్ బ్రేక్ చేసిన రోహిత్ శర్మ

న్యూజిలాండ్ రెండో వన్డే మ్యాచ్‌లో రోహిత్ శర్మ (23; 28) బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులు) క్రీజులో ఉన్నంతసేపు ఆకట్టుకున్నాడు. రెండు అద్భుతమైన సిక్సులు కొట్టాడు. ఈ క్రమంలో హిట్‌మ్యాన్ ఓ రికార్డును ఖాతాలో వేసుకున్నాడు. వన్డేల్లో న్యూజిలాండ్ అత్యధిక సిక్సర్లు బాదిన బ్యాటర్‌గా నిలిచాడు. ఇప్పటివరకు పాక్ మాజీ ఆల్‌రౌండర్ షాహిద్ అఫ్రిది (50) పేరిట ఈ రికార్డు ఉండేది. కివీస్తో రెండో వన్డేలో రెండు సిక్సులు కొట్టడం ద్వారా రోహిత్ (51) ఆ రికార్డును బ్రేక్ చేశాడు. ఈ జాబితాలో వెస్టిండీస్ స్టార్ క్రిస్ గేల్ (45) మూడో స్థానంలో ఉన్నాడు. ఇక, ఓవరాల్‌గా అంతర్జాతీయ క్రికెట్‌లో న్యూజిలాండ్ అత్యధిక సిక్సర్లు బాదిన వారిలో క్రిస్ గేల్ (87) అగ్రస్థానంలో ఉన్నాడు. 85 సిక్సర్లతో రెండో స్థానంలో ఉన్న రోహిత్.. ఈ వన్డే సిరీస్లో గేల్ రికార్డును బ్రేక్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది.



ఈ వారం స్టాక్ మార్కెట్లు

బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బిఎస్ఇ)లో సెన్సెక్స్: ప్రారంభం 74,459.53 పాయింట్లు. ముగింపు 81,028.02 పాయింట్లు. లాభం 6,568,49 పాయింట్లు.
జాతీయ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఇ)లో నిఫ్టీ: ప్రారంభం 23,053.10 పాయింట్లు. ముగింపు 25,030.35 పాయింట్లు. లాభం 1,977.25 పాయింట్లు.

భారత స్టాక్ మార్కెట్‌లో బుల్ రన్



ఈ వారం వరకు భారత స్టాక్ మార్కెట్లు అద్భుతమైన ర్యాలీని నమోదు చేశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో టెక్నాలజీ షేర్ల పతనం, అమెరికా మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగినప్పటికీ, భారత మార్కెట్లు మాత్రం అందుకు భిన్నంగా దూసుకెళ్లాయి. విదేశీ పెట్టుబడుల ప్రవాహం, ముడి చమురు ధరల తగ్గుదల, కార్పొరేట్ కంపెనీల మెరుగైన త్రైమాసిక ఫలితాలు దేశీయ మార్కెట్లకు ప్రధాన బలాన్నిచ్చాయి. ఈ వారంలో బిఎస్ఇ సెన్సెక్స్ 8.82 శాతం, ఎన్ఎస్ఇలో నిఫ్టీ సుమారు 8.57 శాతం లాభపడ్డాయి. ఈ రెండు సూచీలు ఫిబ్రవరి 2021 తర్వాత అత్యుత్తమ వారపు లాభాలు కావడం విశేషం. వరుసగా ఏడు సెషన్ల పాటు మార్కెట్లు లాభాల్లో కొనసాగడం ఇన్వెస్టర్లలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ ర్యాలీకి ప్రధాన కారణాల్లో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల (ఎఫ్ఐఐ) కొనుగోళ్లు ఒకటి. నవంబర్ 5న విదేశీ ఇన్వెస్టర్లు భారత ఈక్విటీ మార్కెట్లో సుమారు రూ.14,975 కోట్ల నికర పెట్టుబడులు పెట్టారు. దాదాపు ఆరేళ్లలో ఒకే రోజులో నమోదైన అతిపెద్ద కొనుగోళ్లలో ఇది ఒకటి. విదేశీ పెట్టుబడులు తిరిగి రావడం మార్కెట్ సెంటిమెంట్ను గణనీయంగా మెరుగుపరిచింది. మరో ముఖ్యమైన అంశం ముడి చమురు ధరల తగ్గుదల. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ ధరలు తగ్గడం భారతదేశం వంటి చమురు దిగుమతులపై ఆధారపడే దేశానికి సానుకూల పరిణామం. దీనివల్ల దిగుమతి బిల్లు, ద్రవ్యోల్బణ ఒత్తిడి తగ్గే అవకాశం ఉంటుంది. రూపాయి బలపడటానికి కూడా ఇది దోహదపడుతుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ రెండో త్రైమాసిక ఫలితాలు, బ్యాంకింగ్, ఆటోమొబైల్, ఫైనాన్షియల్ రంగాల షేర్లలో కొనుగోళ్లు మార్కెట్‌కు మరింత బలాన్నిచ్చాయి. రిలయన్స్ షేరు ఈ వారంలో 13 శాతానికిపైగా లాభపడగా, బ్యాంకింగ్ రంగం కూడా గణనీయమైన వృద్ధిని నమోదు చేసింది. ముఖ్యంగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్ షేర్లలో కొనుగోళ్లు సూచీల పెరుగుదలకు తోడ్పడ్డాయి. ప్రపంచ మార్కెట్ల పరిస్థితి మాత్రం భారత మార్కెట్లకు భిన్నంగా ఉంది. అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాల నేపథ్యంలో రాజకీయ పరిణామాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) రంగంలో భారీ పెట్టుబడులపై ఆందోళనలు అంతర్జాతీయ మార్కెట్లను ప్రభావితం చేశాయి. ముఖ్యంగా అమెరికా టెక్నాలజీ షేర్లలో భారీ అమ్మకాలు నమోదయ్యాయి. నవంబర్ 5న నాస్డాక్ 5.52 శాతం, ఎస్ అండ్ పి 500 సూచీ 4.36 శాతం, డౌ జోన్స్ 3.44 శాతం పడిపోయాయి. ఆసియా మార్కెట్లలో జపాన్ నిక్కీ 5.96 శాతం, దక్షిణ కొరియా కోస్పి 6.02 శాతం నష్టపోయాయి. హాంకాంగ్, షాంఘై మార్కెట్లు కూడా బలహీనంగా ముగిశాయి. అయితే, ప్రపంచవ్యాప్తంగా ఈక్విటీ ఫండ్లలో వరుసగా ఏడో వారం కూడా పెట్టుబడుల ప్రవాహం కొనసాగడం గమనార్హం. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గడం, ప్రధాన కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించడం కొంత ఊరటనిచ్చాయి. అమెరికా, ఆసియా మార్కెట్లలో టెక్నాలజీ షేర్ల పతనం ఉన్నప్పటికీ, భారత మార్కెట్లు దేశీయంగా బలమైన కొనుగోళ్ల మద్దతుతో నిలదొక్కుకున్నాయి.

వచ్చే వారం మార్కెట్..


ఈ నెల 9 నుంచి ప్రారంభమయ్యే వచ్చే వారంలో భారత స్టాక్ మార్కెట్లలో ఒడిదుడుకులు పెరిగే అవకాశం ఉంది. ఒకవైపు విదేశీ పెట్టుబడుల ప్రవాహం, తగ్గుతున్న చమురు ధరలు, కంపెనీల త్రైమాసిక ఫలితాలు మార్కెట్కు సానుకూల అంశాలు. మరోవైపు అమెరికా మార్కెట్లలో కొనసాగుతున్న అమ్మకాలు, అంతర్జాతీయ అనిశ్చితి, భారీ ర్యాలీ తర్వాత ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగే అవకాశం ప్రతికూల అంశాలుగా కనిపిస్తున్నాయి. సాంకేతికంగా చూస్తే నిఫ్టీకి 25,000 పాయింట్లు కీలకమైన మానసిక స్థాయి. ఈ స్థాయికి పైన నిలదొక్కుకుంటే 25,200 నుంచి 25,500 వైపు కదిలే అవకాశం ఉంటుంది. అయితే 25,000 దిగువకు జారితే 24,800 నుంచి 24,700 స్థాయిల వద్ద మద్దతు లభించవచ్చు. సెన్సెక్స్‌కు 80,000 పాయింట్లు కీలక మద్దతు స్థాయిగా, 81,500 నుంచి 82,000 ప్రాంతం సమీప నిరోధ స్థాయిగా పరిగణించవచ్చు. నిఫ్టీ వారపు ఆప్షన్లలో నవంబర్ 9 గడువు సందర్భంగా మార్కెట్ అంచనా పరిధి సుమారు 24,687 నుంచి 25,373 పాయింట్లుగా కనిపిస్తోంది. ఇది మార్కెట్‌లో స్వల్పకాలిక అస్థిరతకు సంకేతం. ముఖ్యంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్, ఆటోమొబైల్ షేర్లలో కొనుగోళ్ల ధోరణి కొనసాగుతుందా అనేది గమనించాలి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలో మాత్రం భారీ ర్యాలీ తర్వాత అప్రమత్తత అవసరం. అమెరికా మార్కెట్ల కదలికలు, డాలర్‌తో రూపాయి మారకం విలువ, ముడి చమురు ధరలు, ఎఫ్ఐఐల కొనుగోళ్ల వచ్చే వారం మార్కెట్ దిశను నిర్ణయించనున్నాయి. స్థూలంగా చెప్పాలంటే, భారత స్టాక్ మార్కెట్లలో దీర్ఘకాలిక సానుకూల ధోరణికి కొన్ని బలమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. అయితే కేవలం ఒక్క వారంలోనే సెన్సెక్స్, నిఫ్టీలు దాదాపు 9 శాతం లాభపడిన నేపథ్యంలో వచ్చే వారం కొంత కన్సాలిడేషన్ లేదా లాభాల స్వీకరణ కనిపించినా ఆశ్చర్యం లేదు. మార్కెట్ మరింత పైకి వెళ్లాలంటే నిఫ్టీ స్థిరపడటం కీలకం. ఇన్వెస్టర్లు తొందరపడి కొనుగోళ్లు చేయకుండా, నాణ్యమైన కంపెనీలపై దృష్టి పెట్టడం, సరైన స్థాయిల్లో పెట్టుబడులు పెట్టడం మంచిది. గమనిక: ఇవి ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు, సాంకేతిక స్థాయిల ఆధారంగా రూపొందించిన అంచనాలు మాత్రమే. మార్కెట్ కదలికలకు హామీ కాదు.

బులియన్ మార్కెట్

10 గ్రాముల బంగారం ధర (రూపాయలలో)
24 క్యారెట్లు: రూ. 1,43,460
22 క్యారెట్లు: రూ. 1,31,510
18 క్యారెట్లు: రూ. 1,07,600
(గమనిక: నగరం, జ్యువెలరీ సంస్థ, మేకింగ్ ఛార్జీలు, జిఎస్‌టిలను బట్టి ధరల్లో స్వల్ప తేడాలు ఉండవచ్చు).

తెలంగాణ కరువు నివారణకు కేంద్రం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి


• 20వేల కోట్లు తక్షణమే కరువు సహాయంగా అందించాలి • సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు



ప్రజాపక్షం/ జనగామ : రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో అల్ప వర్షాపాతం కారణంగా 31 జిల్లాల్లోని 365 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడి కరువుతో విలవిలలాడుతున్నామని ఈ నేపథ్యంలో కేంద్రంలో తెలంగాణ కరువు నివారణకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కరువు సహాయంగా తక్షణమే రూ.20వేల కోట్ల రూపాయలు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం సిపిఐ శాఖా కార్యదర్శుల సమావేశం జనగామ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని, దీనితో రైతాంగం తీవ్ర ఆర్థిక సంక్షభంలో కూరుకుపోయిందన్నారు. తెలంగాణలో నెలకొన్న కరువు పరిస్థితిపై కేంద్రం తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉందని, జాతీయ విపత్తు కింద ప్రత్యేక సహాయాన్ని అందించాలన్నారు. కేంద్ర విపత్తు నిర్వాహణ బృందాలను వెంటనే తెలంగాణలోని కరువు ప్రభావిత జిల్లాలకు పంపి పంట నష్టం, తాగునీటి కొరతపై క్షేత్ర స్థాయిలో పరిశీలన జరపాలన్నారు. ఎండిపోయిన వరి, పత్తి తదితర పంటలకు గాను ఎకరాలకు రూ.25వేల చొప్పుర ఆర్థిక సహాయం అందిస్తూ రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద పనిదినాలను 150 రోజులకు పెంచాలని, కరువు ప్రభావిత ప్రాంతాల్లోని రైతుల పంట రుణాలను రీ షెడ్యూల్ చేయడంతో పాటు ఈ ఏడాదికి వడ్డీ మినహాయింపు ఇవ్వాలన్నారు. సాగునీటి పంపింగ్ కోసం ఉచిత విద్యుత్ సరఫరాకు అవసరమైన అదనపు గ్రిడ్ సహాన్ని కేంద్రం అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం పట్ల కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపడం సరియైంది కాదని, కరువు రాకాసి కోరల్లో చిక్కుకున్న తెలంగాణ రైతును కాపాడడం కేంద్ర ప్రభుత్వ రాజ్యాంగ బాధ్యత అని వెంటనే స్పందించని పక్షంలో తెలంగాణ వ్యాప్తంగా రైతాంగ తరుపున భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి మాట్లాడుతూ జనగామ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 10నజిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, నాయకులు చొప్పరి సోమయ్య, కావటి యాదగిరి, జువ్వారి రమేష్, రావుల సదానందం, చామకూర యాకూబ్, సఖీ, నూర్‌నిషా, కందుకూరి మల్లేశం, వడ్లకొండ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు తక్షణ నష్టపరిహారం చెల్లించాలి

- కరువు నివారణ చర్యలు చేపట్టాలని ఈ నెల 10న సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా
- పంట రుణాలు రీషెడ్యూల్ చేసి వడ్డీ మాఫీ చేయాలి
- రాష్ట్రంలో అత్యధిక కరువు మునుగోడు నియోజకవర్గంలోనే : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



ప్రజాపక్షం/చండూరు: ఎలి నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొని పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న జిల్లా వ్యాప్తంగా మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. చండూరు మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయం మాధగోని నరసింహ భవనంలో నిర్వహించిన పార్టీ మునుగోడు నియోజకవర్గ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధికంగా కరువు ప్రభావిత మండలాలు మునుగోడు నియోజకవర్గంలోనే ఉన్నాయని, అయినప్పటికీ ప్రభుత్వం రైతుల పరిస్థితిపై తగిన స్థాయిలో స్పందించడం లేదని అన్నారు. ఎండిపోయిన పంటలతో రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులపై ఉన్న పంట రుణాలను తక్షణమే రీషెడ్యూల్ చేయాలని,రుణాలపై వడ్డీని పూర్తిస్థాయిలో మాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అలాగే కరువు నివారణ చర్యలు చేపట్టడంతో పాటు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పత్తి పంటకు, రూ.40 వేల చొప్పున వరి పంటకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. నల్లగొండ జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కరువు పరిస్థితులపై ప్రభుత్వం తక్షణమే స్పందించి సమగ్ర కార్యాచరణ ప్రకటించాలని, రైతులకు న్యాయం జరిగే వరకు సిపిఐ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.
సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నలపరాజు రామలింగయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్. అంజయ్యచారి, గురుజు రామచంద్రం, బొలుగూరి నరసింహా, తీర్పారి వెంకటేశ్వర్లు, టి.రాములు, సూర్గి చలపతి,బొమ్మరబోయిన లాలు,ఈదుల బిక్షంరెడ్డి, చాపల శ్రీను,నూదన పోయిన రమేష్,బుర్ర శేఖర్,భీమనపల్లి రమేష్, గిరి రమతదితరులు పాల్గొన్నారు.

అశాస్త్రీయ పద్ధతిలో కరువు మండలాల ప్రకటన

- ఖానాపురం, నల్లబెల్లి,గీసుగొండ, వర్ధన్నపేట,రాయపర్తి మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి
- సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె బాష్ మియా



ప్రజాపక్షం/ వరంగల్ : అశాస్త్రీయ పద్ధతిలో కరువు మండలాల ప్రకటన చేశారని, ఖానాపురం, నల్లబెల్లి, గీసుగొండ, వర్ధన్నపేట, రాయపర్తి మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె బాష్‌మియా అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా కార్యదర్శి బాష్‌మియా, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, అక్క పెళ్లి రమేష్ ,జిల్లా సమితి సభ్యులు దిడ్డి పార్థసారథి మియాపురం గోవర్ధన్ ఆధ్వర్యంలో పంటలను సందర్శించి గ్రామ రైతులతో మాట్లాడి వారి బాధలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో 13 మండలాలు ఉండగా 8 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి 5 మండలాలను ప్రకటించకుండా ప్రభుత్వం రైతులను నిరాశపరిచింది వరంగల్ ఖిలా వరంగల్ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడం వ్యవసాయ ఆధారిత మండలాలైన ఖానాపురం, నల్లబెల్లి, గీసుగొండ, వర్ధన్నపేట, రాయపర్తి మండలాలను కరువు మండలాలుగా ప్రకటించకపోవడం ప్రభుత్వ అజ్ఞానానికి నిదర్శనమన్నారు. నర్సంపేట మండలలో పంట నష్టపోయిన రైతుల కు వెంటనే నష్టపరిహారం అందించాలని, ఖానాపురంమండలాన్ని కరువు మండలంగా ప్రకటించే విధంగా స్థానిక ఎమ్మెల్యే మాధవ రెడ్డి ప్రభుత్వంతో మాట్లాడి చొరవ చూపాలని, పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్ మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని, లేకుంటే రానున్న రోజుల్లో రైతులను చైతన్యపరిచి ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 10నవరంగల్ కలెక్టరేట్ ముందు జరుగు ధర్నాలో రైతులు, వ్యవసాయ కార్మికులు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు.



కేంద్ర ప్రభుత్వం పక్షపాత వైఖరి వీడాలి

ఈ నెల 10న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా : విజయసారధి

ప్రజాపక్షం/తొర్రూరు : తెలంగాణలో కరువు నివారణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలని సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి. విజయసారధి అన్నారు. శనివారం ఎండిపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా విజయసారధి మాట్లాడుతూ తొర్రూరు మండలంలోని వెలికట్ట గ్రామంలో రాపాక శ్రీనివాసాచారి అనే యువ రైతు అప్పు తెచ్చి పంట వేయగా బోర్లలో నీరు ఎండిపోయి వానలు లేక ఐదు ఎకరాల వరి పంట ఎండిపోయిందన్నారు. తొర్రూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలన్నారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో కురిసిన అల్పవర్షపాతం కారణంగా 31 జిల్లాల వ్యాప్తంగా 365కు పైగా మండలాలు తీవ్ర వర్షాభావం, కరువు బారిన పడి విలవిలలాడుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో కరువు నివారణకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలన్నారు. సుమారు ఇరవై లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతాంగం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. తెలంగాణ లో నెలకొన్న ఈ కరువు పరిస్థితిపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రాష్ట్రాన్ని ఆదుకోవాలని, కరువు కారణంగా ఇబ్బందులు పడుతున్న రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తు సహాయ నిధి నుంచి వెంటనే ఇరవై వేల కోట్ల ప్రత్యేక సహాయాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఓమా భిక్షపతి, సిపిఐ తొర్రూరు మండల కార్యదర్శి బందు మహేందర్, సిపిఐ తొర్రూరు మండల సహాయ కార్యదర్శులు గణపురం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు తక్షణమే పరిహార ప్యాకేజీ ప్రకటించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల నరసింహ



ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల్ : తీవ్ర కరువు పరిస్థితులతో రైతులు పంటలు కోల్పోయి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలనరసింహ ఆవేదన వ్యక్తం చేశారు. గద్వాల్ జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరువు బాధిత రైతులకు ఎకరాకు తగిన పంట నష్టపరిహారం చెల్లించడంతో పాటు, వ్యవసాయ కూలీలు, పేద ప్రజలను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పరిహార ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎన్నికల ప్రక్రియపై వస్తున్న ఓట్ల చోరీ ఆరోపణలు, ఎస్ఐఆర్ పేరుతో ఓటర్ల జాబితాలో జరుగుతున్న మార్పులపై సమగ్ర విచారణ జరిపించాలని, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించాలని డిమాండు చేశారు. అలాగే రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు సిపిఐ శ్రేణులు కృషి చేయాలని జిల్లా సమితి సమావేశంలో నిర్ణయించారు. రాజకీయ పరిస్థితులను సమీక్షించి, ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణ పై చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా పరిస్థితులు, రాజకీయ పరిణామాలు, కరువు సమస్యలపై జిల్లా కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు మాట్లాడుతూ కరువు బాధిత రైతులకు న్యాయం చేయాలని, ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండు చేస్తూ ఈ నెల 10న కలెక్టరేట్ ముందు సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాలో రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సభ్యుడు కృష్ణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సభ్యులు రంగన్న, ఆశన్న, ప్రజానాట్య మండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి మల్లేష్, యువజన సంఘం రాష్ట్ర నాయకులు శివ, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రవీణ్, భరత్, ఎఐవైఎఫ్ వెంకటేశ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్

కేంద్రంగా హైదరాబాద్

- ఫిన్‌టెక్, డిజిటల్ బ్యాంకింగ్ రంగాలకు అంతర్జాతీయ వేదికగా తీర్చిదిద్దుతాం
- ఆర్థ ఫిన్‌టెక్ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు



ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రపంచ ఆర్థిక సేవల రంగంలో హైదరాబాద్‌ను అంతర్జాతీయ కేంద్రంగా నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందు కు సాగు తోంది. ఇప్పటికే ఐటి, ఐటిఇఎస్ రంగాల్లో ప్రపంచవ్యా ప్తంగా గుర్తింపు పొందిన నగరాన్ని ఫిన్‌టెక్, డిజిటల్ బ్యాంకింగ్, గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాల్లోనూ అగ్రగామిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇందు కోసం ప్రపంచస్థాయి డిజిటల్ మౌలిక సదుపాయాలు, అధు నాతన సాంకేతిక పరిశోధనలు, నైపుణ్యం కలిగిన మానవ వనరుల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నట్లు రాష్ట్ర ఐటి, పరిశ్ర మల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. సింగ పూర్ కేంద్రంగా పనిచేస్తున్న ఆర్థ ఫిన్‌టెక్ సంస్థ హైదరా బాద్ కార్యాలయాన్ని శనివారం హైటెక్‌సిటీలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో భాగం గా రాష్ట్రాన్ని పెట్టుబడులు, ఆవిష్కరణలు, అభివృద్ధి చెందుతున్న సాంకే తిక పరిజ్ఞానాలకు దేశంలోనే అత్యుత్తమ గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ సంస్థ లు తమ కార్యకలాపాలను హైదరాబాద్‌కు విస్తరిం చేలా పారిశ్రామిక, సాంకేతిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. ఫిన్‌టెక్ రంగంలో అత్యాధునిక పరిష్కా రాలకు హైదరాబాద్ వేదికగా మారుతోందని మంత్రి తెలి పారు. బ్యాంకింగ్ యాజ్ ఎ సర్వీస్, ఓపెన్ బ్యాంకింగ్ ఎపి ఐలు, ఆటోమేటెడ్ ఆన్‌బోర్డింగ్, కెవైసి, కెవైబి, యాంటీ మనీ లాండరింగ్ (ఎఎంఎల్), అంతర్జాతీయ చెల్లింపులు, డిజి టల్ వాలెట్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు వంటి సేవలను ఆర్థ ఫిన్‌టెక్ అందిస్తోందని వివరించారు. ఇలాంటి అంతర్జాతీయ సంస్థల రాకతో హైదరాబాద్ ఆర్థిక సాంకేతిక రంగంలో మరింత కీలకపాత్ర పోషించే అవకాశా లున్నాయని ఆశాభావం వ్యక్తం చేశా రు. కార్యక్రమంలో ఆర్థ ఫిన్‌టెక్ సిఇఒ మధుబాబు గడిపాటి, ఆర్మిన్ ఒర్డోదరీ, ఇమాన్యుయేల్ సి.ఫెర్నాండెస్ పాల్గొన్నారు.

మన ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు

- లబ్ధిదారులతో కలిసి దీపావళి సంబరాల్లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్



ప్రజాపక్షం/హుస్నాబాద్ : దశాబ్ద కాలం నాటి పేదల సొంతింటి కలను ప్రజాపాలన ప్రభుత్వంలో సాకారం చేసుకుంటున్న శుభ సందర్భంగా లబ్ధిదా రులతో కలిసి 'మన ఇందిమ్మ ఇంట్లో దీపావళి' వేడుకలను జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని బిసి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. శనివారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని 12 వార్డులో పొన్నం కొమల సమ్మయ్య దంపతులకు ఇంది రమ్మ ఇల్లు మంజూరై నిర్మాణం పూర్తి చేసుకుని మన ఇంది రమ్మ ఇంట్లో దీపావళి వేడుకల్లో పాల్గొని దంపతులకు నూతన వస్త్రాలను అందించి దంపతులకు స్వీట్లు తినిపించి శుభాకాం క్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో ఇంది రమ్మ ఇళ్లు నిర్మాణం పేద కుటుంబాల్లో వెలుగులు నింపుతుం దన్నారు. నియోజకవర్గంలో మొదటి విడత 3500 ఇళ్లు మంజూరు కాగా నేటి వరకు 2500పైగా ఇల్లు పూర్తి చేసుకుని గృహప్రవేశాలు పూర్తి చేసుకుని దీపావళి వేడుకలను జరుపు కుంటున్నారని ఆన్నారు. నియోజకవర్గంలో పూర్తి చేసుకున్న ప్రతి లబ్ధిదారుడు దీపావళి వేడుకలను ఘనంగా జరుపుకోవా లని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి కొమురయ్య, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ రవిందర్‌పటేల్, ఆర్‌డిఒ రామ్మూర్తి, కమిషనర్ మల్లికార్జున్, తహశీల్దార్ లక్ష్మారెడ్డి, సహకార సంఘం చైర్మన్ బొల్లిశెట్టి శివయ్య, పట్టణ అధ్యక్షుడు వెల్దండి వెంకటరమణ, గ్రంథాలయ చైర్మన్ కేదం లింగమూర్తి, కౌన్సిలర్లు రవిందర మంజుల, వరప్ర సాదు, రజిత, బి.రాజు, శోభన్, కిరణ్, రమేశ్‌తోపాటు స్థానిక నాయకులు రజిత, మైదం శెట్టి వీరన్న, నర్సగౌడు, కిష్టస్వామి, బిక్కియా, తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల్లో ఎస్‌సి వర్గీకరణ అమలు.. ఉద్యోగుల హర్షం

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రభుత్వ ఉద్యోగుల పదోన్న తుల్లో ఎస్‌సి వర్గీకరణను అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మెమో జారీ చేయడంపై మాదిగ ఉద్యోగుల సమన్వయ కమిటీ హర్షం వ్యక్తం చేసింది. సుదీర్ఘకాలంగా ఎదురుచూ స్తున్న వర్గీకరణ అమలుకు పదోన్నతుల్లోనూ మార్గం సుగమం కావడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపింది.ఈ మేరకు శనివారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్‌కుమార్ నేతృత్వంలో కమిటీ ప్రతిని ధులు జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో రేవంత్‌రె డ్డిని కలిశారు. ఎస్‌సి వర్గీకరణను ఉద్యోగుల పదోన్నతుల్లో అమలు చేయడం సామాజిక న్యాయం, సమాన అవకాశాల కల్పనలో కీలక పరిణామమని పేర్కొన్నారు. వర్గీకరణ ద్వారా అణగారిన వర్గాలకు ఉద్యోగ నియామకాలతోపాటు పదోన్నతుల్లోనూ న్యాయమైన ప్రాతినిధ్యం లభించే అవ కాశం ఉంటుందని ప్రతినిధులు తెలిపారు. విద్య, ఉద్యోగ, పదోన్నతి అవకాశాల్లో సామాజిక న్యాయం ప్రతిఫలించేలా ప్రభుత్వం తీసుకున్న చర్యలను అభి నందించారు.వర్గీకరణ చట్టం అమలులో చొరవ చూపిన సిఎం రేవంత్‌రెడ్డికి, ప్రక్రియలో కీలక పాత్ర పోషిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్‌కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో పదోన్నతుల ప్రక్రియలో ఉద్యోగులకు ఎలాంటి పరిపాలనాపర మైన ఇబ్బందులు తలెత్తకుండా స్పష్టమైన మార్గదర్శ కాలు జారీ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. కాశీం, చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లేశం, విద్యుత్ శాఖ ఎడిఈ మేడి రమేష్, ఆర్థిక శాఖ అసిస్టెంట్ సెక్రటరీ శ్యాంసుందర్, తహశీ ల్దార్ల ఉద్యోగుల సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రాధ తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టుల భర్తీపై కసరత్తు

- ఇష్టాగోష్టిలో టిపిసిసి మహేష్ కుమార్ గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రభుత్వంలోని వివిధ కార్పొరే షన్లు, సంస్థలకు సంబంధించిన నామినేటెడ్ పోస్టుల భర్తీపై కసరత్తు జరుగుతుందని టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. వివిధ సంస్థలు, కార్పొరేషన్ల చైర్మన్‌లతో పాటు డైరెక్టర్‌ల పదవులను కూడా భర్తీ చేస్తామన్నారు. హైదరాబాద్‌లో శనివారం తనను కలిసిన మీడియా ప్రతినిధు లతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో ఏమి జరుగుతుంది అనేది అధిష్టానానికి నివేదిక ఇచ్చానని ఆయన తెలిపారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్య ర్థుల ఎంపికపై ఇంకా చర్చ జరగలేదన్నారు. పార్టీ అధిష్టానం ఒకప్పుడు ఉన్నట్టు లేదని, నాయకుల పనితీరుపై ఎఐసిసిలో పెద్ద వ్యవస్థ పనిచేస్తుందని, మూడు రోజులు పార్టీ కార్యక్ర మాల నివేదిక ఢిల్లీకి వెళ్లకుంటే మెసేజ్ వస్తుందని మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాలలో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం మంత్రు లతో కలిసి ఎమ్మెల్యేలు, నాయకులు సమన్వయంతో పనిచేస్తు న్నారని ఆయన చెప్పారు.



















ట్రై కార్పొరేషన్‌లలో 9 నుంచి పారిశుద్ధ్య మాసోత్సవాలు

- మూడు కార్పొరేషన్ల పరిధిలో ప్రత్యేక డ్రైవ్
- ఆదేశించిన సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: మహానగరంలో పేరుకుపోతున్న చెత్తాచెదారం, అధ్వానంగా మారిన పారిశుద్ధ్య పరిస్థితులపై తీవ్రంగా స్పందించిన ప్రభుత్వం ఈ నెల 9 నుంచి వచ్చేనెల 4వ తేదీ వరకు 'పారిశుద్ధ్య మాసోత్సవాలు' నిర్వహించాలని నిర్ణయించింది. జిహెచ్ఎంసి, సిఎంసి, ఎంఎంసి (ట్రై కార్పొరేషన్లు) పరిధిలోని 300 వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణను పూర్తిగా గాడిలో పెట్టడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నారు. నగరంలో కాలనీలు, ప్రధాన రహదారులు, నాలాల పక్కన చెత్త పేరుకుపోతోందని ప్రజల నుంచి వెల్లువెత్తుతున్న ఫిర్యాదుల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి తక్షణ చర్యలకు ఆదేశించారు. క్షేత్రస్థాయిలో కేవలం సమీక్షలకే పరిమితం కాకుండా డంపింగ్ పాయింట్లను పూర్తిగా తొలగించడం, రోజువారీ చెత్త సేకరణను వేగవంతం చేయడం, పారిశుద్ధ్య సిబ్బంది హాజరును పర్యవేక్షించడంపై దృష్టి సారించనున్నారు. కేవలం హడావుడి కార్యక్రమాలతో సరిపెట్టకుండా నగరంలో శాశ్వత ప్రాతిపదికన పారిశుద్ధ్య మార్పులు తీసుకురావాలని ట్రై కార్పొరేషన్‌ల అధికారులను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

30న తుది ఓటర్ల జాబితా



ప్రజాపక్షం/హైదరాబాద్: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్(ఎన్నికలు) బి.సంతోష్ కుమార్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో అధికారులు సవరించిన షెడ్యూల్‌ను ఈ కొత్త తేదీలను వెల్లడించారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం తుది ఓటర్ల జాబితా ప్రచురణను ఈనెల 30న చేపట్టనున్నారు. తొలుత తుది జాబితాను అక్టోబర్ 19న విడుదల చేయాలని నిర్ణయించినప్పటికీ, ప్రక్రియలో వచ్చిన మార్పుల కారణంగా తేదీని వాయిదా వేశారు. ఎస్ఐఆర్2026లో భాగంగా ఓటర్ల నుంచి అభ్యంతరాలు, క్లెయిమ్‌లు స్వీకరణ గడువును ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 7 వరకు పొడిగించారు. అందిన అభ్యంతరాలు, దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ఈనెల 26 వరకు కొనసాగనుంది. అనంతరం ఈనెల 30న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. హైదరాబాద్ జిల్లా పరిధిలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 4,094 పోలింగ్ స్టేషన్లు ఉండగా, వివిధ రాజకీయ పార్టీల నుంచి ఇప్పటివరకు 11,709 మంది బూత్ లెవల్ ఏజెంట్లు మాత్రమే నియమితులయ్యారు. పోలింగ్ స్టేషన్‌ల వారీగా పరిశీలిస్తే, కాంగ్రెస్ పార్టీ అత్యధికంగా 3,647 పోలింగ్ స్టేషన్‌లలో (89.08 శాతం) బిఎల్ఏలను నియమించింది. బిజెపి 3,309 పోలింగ్ స్టేషన్‌లలో (80.83 శాతం), ఎంఐఎం 2,519 పోలింగ్ స్టేషన్‌లలో (61.53 శాతం) తమ ప్రతినిధులను నియమించాయి. బిఆర్ఎస్ పార్టీ 2,212 పోలింగ్ స్టేషన్‌లలో (54.03 శాతం) బూత్ స్థాయి ఏజెంట్లను ఏర్పాటు చేసింది.



తమ్మిడికుంట ప్రారంభానికి సన్నాహాలు

- ఏర్పాట్లను పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఎమ్మెల్యే గాంధీ

ప్రజాపక్షం/హైదరాబాద్: మాదాపూర్‌లోని తమ్మిడికుంట చెరువు ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. ఈ నెల 11న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా చెరువు ప్రారంభం కానున్న నేపథ్యంలో, శనివారం అక్కడి ఏర్పాట్లను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో కలిసి హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సభా ప్రాంగణంతో పాటు చెరువు సుందరీకరణ పనులను, అక్కడ కల్పించిన సౌకర్యాలను అధికారుల బృందం పరిశీలించింది. చెరువులోకి ఎస్‌టిపిల ద్వారా శుద్ధి చేసిన నీటిని తరలించే ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ గతంలో భారీ వర్షాలు పడితే శిల్పారామం పరిసర ప్రాంతాలు నడుంలోతు నీటితో నిండిపోయేవి అని, అయితే తమ్మిడికుంట చెరువు ఇన్‌లెట్‌ల అభివృద్ధితో ఆయా ప్రాంతాలకు వరద ముప్పు పూర్తిగా తప్పిందన్నారు. కొండాపూర్ పోలీస్ బెటాలియన్ నుంచి వచ్చే వరద నీరు నేరుగా చెరువుకే చేరేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిఎంసి కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్, హైడ్రా అదనపు కమిషనర్లు ఆర్.సుదర్శన్, డి.ఆనందకుమార్, సైబరాబాద్ జాయింట్ సిపి సంప్రీత్ సింగ్, ట్రాఫిక్ డిసిపి రవికుమార్, అదనపు డిసిపి హనుమంతరావు, ఎసిపిలు ఉమామహేశ్వరరావు,శ్రీకాంత్,మాదాపూర్ ఎసిపి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ అండాల సేకరణ వ్యవహారంపై మహిళా కమిషన్ తీవ్ర ఆగ్రహం

- బాధ్యులైన ఆసుపత్రులపై ఎందుకు చర్యలు తీసుకోలేదు?
- ప్రశ్నించిన మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శారద



ప్రజాపక్షం/హైదరాబాద్: నిరుపేద మహిళల నుంచి అక్రమంగా అండాలు సేకరిస్తున్న వ్యవహారంలో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆసుపత్రులు, ఐవిఎఫ్ కేంద్రాలు, ల్యాబ్‌లపై చర్యలు తీసుకోవడంలో జాప్యం జరుగుతుండటంపై రాష్ట్ర మహిళా కమిషన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంలో కేవలం కొంతమంది ఏజెంట్లపై మాత్రమే కేసులు నమోదు చేసి, ప్రధాన సూత్రధారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆసుపత్రులు, కేంద్రాలపై చర్యలు తీసుకోకపోవడం పట్ల మహిళా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న సంస్థలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు కనిపించకపోవడంపై అసహనం వ్యక్తం చేసింది. మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నెరెళ్ల శారద బాధిత మహిళలను పరామర్శించిన సమయంలో పలువురు బాధితులు ఇందిరా ఐవిఎఫ్ సెంటర్, నర్మద ఫర్టిలిటీ సెంటర్, ఓయాసిస్ ఫర్టిలిటీ సెంటర్, సద్గురు ఏఆర్‌టి సెంటర్, పద్మజ ఫర్టిలిటీ సెంటర్‌లతో పాటు డాక్టర్ హుస్సేన్ పేరును ప్రస్తావిస్తూ ఫిర్యాదులు చేసినట్లు కమిషన్ వెల్లడించింది. అయితే ఇప్పటివరకు డాక్టర్ హుస్సేన్ ఆచూకీ గుర్తించకపోవడం, కనీసం కేసు నమోదు చేయకపోవడంపై మహిళా కమిషన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆరోపణలు వచ్చిన ఆసుపత్రులు, ఐవిఎఫ్ కేంద్రాలపై తక్షణమే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులను ఆదేశించినప్పటికీ ఇప్పటివరకు విచారణ ప్రారంభించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసింది. మహిళల శారీరక స్వేచ్ఛ, గౌరవం, ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై ఎలాంటి ఆలస్యం లేకుండా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా కమిషన్ స్పష్టం చేసింది. బాధ్యులను రక్షించే ప్రయత్నాలు జరిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించింది.

నల్లగొండలో ఎఐకెఎస్ జాతీయ మహాసభలు గర్వకారణం

- వక్తలు ఉద్ఘాటన
- ఎయిర్ బెలూన్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/చిక్కడపల్లి: నల్లగొండలో ఈ నెల 15 నుంచి 18 వరకు జరగబోయే అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్)36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ఏఐకేఎస్ ఎయిర్ బెలూన్‌ను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆహ్వాన సంఘం అధ్యక్షుడు జూలకంటి రంగారెడ్డి, సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ మాట్లాడుతూ...తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట గడ్డ నల్లగొండలో తొలిసారి ఏఐకేఎస్ జాతీయ మహాసభలు జరగబోతుండటం గర్వకారణంగా ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రజలు, రైతులందరు కూడా మహాసభలు జయప్రదం కావాలని ముందుకు రావడం, ఆదరించడం గొప్ప విషయమన్నారు. ఇప్పటికే 1,50,000 కుటుంబాలను కలిశామని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమకు తోసినంత ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నారని చెప్పారు. ఇంటింటి ప్రచారం చేస్తున్నామనీ, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావాలంటే రైతు సంఘం వంటి సంఘాలు ముందుండి పోరాడాలని ప్రతి ఒక్కరూ అంటున్నారనీ, పార్టీలకు అతీతంగా బహిరంగ సభకు వస్తామని ప్రజలు హామీనిస్తున్నారని చెప్పారు. 15న నల్లగొండలో మహారైతు ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందనీ, దానికి మాజీ ఎంపీ బృందాకరత్, అశోక్‌ధావలే, విజ్జుకృష్ణన్ హాజరవుతారని తెలిపారు. రైతు సంఘం జాతీయ నాయకుడు రామకృష్ణ మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగిన నడిగడ్డ నల్లగొండలో ఏఐకేఎస్ మహాసభలు జరగడం గొప్ప విషయమన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ అన్నదాతలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తున్నదని విమర్శించారు. ఢిల్లీలో గొప్ప రైతాంగ పోరాటం చేసినా మోడీ సర్కారు మొండిగా ముందుకెళ్తున్నదని విమర్శించారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న రైతాంగ పోరాటాలకు ఏఐకేఎస్ మహాసభలు దిక్సూచిగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రైతు సంఘం ఉపాధ్యక్షులు నంద్యాల నర్సింహారెడ్డి, అరిబండి ప్రసాదరావు, కోశాధికారి మూడ్ శోభన్, సహాయ కార్యదర్శి ఉడత రవీందర్, లెల్లెల బాలకృష్ణ, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ప్రజా సంఘాల నాయకులు ఎమ్డీ అబ్బాస్, ఆర్.వెంకట్రాములు, జి.రాములు, ఆశయ్య, అరుణజ్యోతి, శ్రీరాంనాయక్, ధర్మానాయక్, బి.పద్మ, శ్రీకాంత్, కిరణ్, సుందర్, తదితరులు పాల్గొన్నారు.

నైనీ గని నుంచి బొగ్గు అధికోత్పత్తికి చర్యలు

- రోజుకు కనీసం 20 వేల టన్నుల బొగ్గు తెలంగాణకు రవాణా చేయాలి: సింగరేణి సిఎండి బుద్ధ ప్రకాష్ జ్యోతి

ప్రజాపక్షం/హైదరాబాద్: ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ నుంచి నిర్దేశిత లక్ష్యాల మేరకు బొగ్గు అధికోత్పత్తి సాధించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సిఎండి డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఓవర్‌బర్డెన్ తొలగింపును వేగవంతం చేయాలని సూచించారు. సింగరేణి భవన్‌లో శనివారం నైనీ గనిపై సంస్థ డైరెక్టర్లు, సంబంధిత జనరల్ మేనేజర్లతో సిఎండి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర విద్యుత్ అవసరాల నేపథ్యంలో నైనీ గని నుంచి రోజుకు కనీసం 20 వేల టన్నులకు పైగా బొగ్గును తెలంగాణకు రవాణా చేయాల్సిన అవసరం ఉందన్నారు. బొగ్గు ఉత్పత్తి, రవాణా నిరంతరాయంగా జరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఓవర్‌బర్డెన్ తొలగింపుపై ప్రత్యేక దృష్టి..

ఓవర్‌బర్డెన్ తొలగింపును పెంచడం ద్వారా మరింత బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశం ఉంటుందని సిఎండి తెలిపారు. అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. బొగ్గు రవాణాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నైనీ గని జనరల్ మేనేజర్ బైద్య గనిలో ప్రస్తుతం జరుగుతున్న బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓవర్‌బర్డెన్ తొలగింపు తదితర అంశాలను సిఎండికి వివరించారు. సమీక్షలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె.వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (పర్సనల్ అండ్ ఫైనాన్స్) గౌతమ్ పొట్రు, డైరెక్టర్ (ఇ అండ్ ఎం) ఎం.తిరుమలరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్‌మెంట్) బి. వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్ అండ్ మార్కెటింగ్) తాడబోయిన శ్రీనివాస్, జనరల్ మేనేజర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) దేవేందర్‌తో పాటు వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.



వెలమ కార్పొరేషన్ చైర్మన్‌గా జువ్వాడి నర్సింగరావు ప్రమాణ స్వీకారం

- వెలమల అభ్యున్నతికి కృషి చేయాలి: మంత్రి వివేక్

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ తొలి వెలమ కార్పొరేషన్ చైర్మన్‌గా జువ్వాడి నర్సింగరావు ప్రమాణ స్వీకారం చేశారు. వెలమ సామాజిక వర్గంలోని పేద, వెనుకబడిన కుటుంబాల అభ్యున్నతికి కృషి చేయాలని రాష్ట్ర శక్తి, గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి సూచించారు. హకీంపేటలో శనివారం జరిగిన వెలమ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడుతూ జువ్వాడి కుటుంబానికి ప్రజాసేవలో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. మాజీ దివంగత మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు సేవలు, అభివృద్ధి స్ఫూర్తి చిరస్మరణీయమని కొనియాడారు. తాను రాజకీయాల్లోకి వచ్చిన సమయంలో రత్నాకర్‌రావు ఇచ్చిన ప్రోత్సాహం, అభివృద్ధిపై ఆయన సూచనలు ఎంతో విలువైనవని గుర్తుచేశారు. నర్సింగరావుకు ప్రజలతో సత్సంబంధాలు, సమస్యల పరిష్కారంపై పట్టుదల ఉన్నాయని ప్రశంసించారు. వెలమ కార్పొరేషన్ ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక, సామాజిక అండతోపాటు యువతకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జువ్వాడి కుటుంబ ప్రజాసేవా సంప్రదాయాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ,వెలమ సామాజిక వర్గ ప్రముఖులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బండి అనుచరుడి వేధింపులంటూ దివ్యాంగుడి ఆత్మహత్య

- బిఆర్ఎస్ వీడితే రూ.4 లక్షలు ఇస్తామన్నారని ఆరోపణ..
- ఇంటిని కూల్చివేస్తామంటూ నోటీసు పంపారని వీడియోలో వెల్లడి
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న బాధితుడి వీడియో



ప్రజాపక్షం/హైదరాబాద్: కరీంనగర్‌కు చెందిన దివ్యాంగుడు శివ కలపెల్లి హైదరాబాద్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ అనుచరుడు, కార్పొరేటర్ సోమిడి వేణు తమ కుటుంబాన్ని వేధిస్తున్నాడని ఆరోపిస్తూ శివ ఆత్మహత్యకు ముందు వీడియో రికార్డు చేశాడు. శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. కరీంనగర్‌లోని కిసాన్ నగర్‌కు చెందిన శివ కలపెల్లి తన వీడియోలో కుటుంబ పరిస్థితులను వివరించాడు. పుట్టుకతోనే దివ్యాంగుడినని, చిన్నప్పటి నుంచి ఇప్పటివరకు పది శస్త్రచికిత్సలు చేయించుకున్నానని, గత ఏడాది కిడ్నీ ఆపరేషన్ కూడా జరిగిందని తెలిపాడు. తన అన్న నవీన్ బిఆర్ఎస్ యువజన విభాగంలో పనిచేస్తున్నాడని, కుటుంబానికి అతడే ఆర్థికంగా అండగా ఉన్నాడని పేర్కొన్నాడు. తన అన్నను బిఆర్ఎస్ నుంచి బయటకు తీసుకొచ్చేందుకు సోమిడి వేణు ప్రయత్నించాడని శివ ఆరోపించాడు. కార్పొరేటర్‌గా ఎన్నిక కాకముందు తమ ఇంటికి వచ్చి బిఆర్ఎస్‌ను వీడి తనకు మద్దతు ఇస్తే రూ.4 లక్షల చెక్కు ఇస్తానని ఆఫర్ చేశాడని వెల్లడించాడు. అయితే నవీన్ ఆ ప్రతిపాదనను తిరస్కరించడంతో ఎన్నికల్లో గెలిచిన తర్వాత కుటుంబాన్ని వేధిస్తానని బెదిరించాడని ఆరోపించాడు. అనంతరం తమ ఇంటిని కూల్చివేస్తామంటూ నోటీసు పంపించారని, ఆ నోటీసును కూడా వీడియోలో చూపించాడు. తనకు దివ్యాంగత్వం ఉందని, తన అన్నే కుటుంబాన్ని పోషిస్తున్నాడని తెలిసినా వేధింపులు ఆగలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. తన అన్నకు ఇద్దరు పిల్లలు ఉన్నారని, ఇల్లు కూల్చివేస్తే వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించాడు. బండి సంజయ్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ, దివ్యాంగుల కుటుంబాలను సైతం వేధించే కార్పొరేటర్లకు ఎందుకు మద్దతు ఇస్తున్నారని ప్రశ్నించాడు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ఇఎస్ఐ కాంట్రాక్టుల్లో రూ.50 కోట్ల అక్రమాలపై విచారణ జరపాలి

- కార్మిక శాఖ మంత్రికి వివేక్‌కు ఎం.శ్రీనివాస్ వినతి

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలోని ఈఎస్ఐ ఆసుపత్రులు, డిస్పెన్సరీల్లో స్వీపింగ్, సెక్యూరిటీ కాంట్రాక్టుల కేటాయింపు, అధిక రేట్ల చెల్లింపుల్లో భారీ అక్రమాలు జరిగాయని, రూ.50 కోట్ల మేర కార్మిక నిధుల దుర్వినియోగం చోటు చేసుకున్నయన్నాఅంశంపై విచారణ జరపాలని కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్‌ను అర్బన్ డెవలప్‌మెంట్ ఫోరం కన్వీనర్ ఎం. శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు శనివారం ఆయన మంత్రి వివేక్‌కు లేఖ రాశారు. నాచారం, జీడిమెట్ల, వరంగల్ ఈఎస్ఐ ఆసుపత్రుల్లో చదరపు అడుగుకు రూ.49.50 చెల్లిస్తుండగా, మరికొన్ని ఆసుపత్రుల్లో రూ.9.50 మాత్రమే చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. కొన్ని డిస్పెన్సరీల కాంట్రాక్టుల్లో రూ.72 నుంచి రూ.136 వరకు అధిక రేట్లు చెల్లించారని ఆరోపించారు. లాటరీ పద్ధతిని పక్కనపెట్టి నామినేషన్, ప్రత్యేక సిఫార్సులతో కాంట్రాక్టులు కేటాయించారని విమర్శించారు.మరోవైపు కాంట్రాక్ట్ కార్మికులకు నెలకు రూ.10,400 మాత్రమే వేతనం చెల్లిస్తూ, కనీస వేతనాలు,ఈఎస్ఐ, పిఎఫ్ బకాయిలు చెల్లించడం లేదని ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఎసిబితో సమగ్ర విచారణ జరిపించాలని, అధిక రేట్ల చెల్లింపులను రద్దు చేసి ఇప్పటికే చెల్లించిన అదనపు మొత్తాలను వసూలు చేయాలని, బాధ్యులైన అధికారులు, కాంట్రాక్ట్ సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

డిఫెన్స్ మద్యం దందాలో భార్యాభర్తలు

- రెండు కేసుల్లో రూ.2.11 లక్షల విలువైన 163 బాటిళ్లు స్వాధీనం



ప్రజాపక్షం/హైదరాబాద్: డిఫెన్స్ క్యాంటీన్‌ల నుంచి తక్కువ ధరకు మద్యం తీసుకొచ్చి.. ఇళ్లలో భార్యలతో ఎక్కువ ధరలకు విక్రయాలు సాగిస్తున్న ఘటనలు అల్వాల్ ప్రాంతంలో వెలుగు చూశాయి. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, స్టేట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో రెండు వేర్వేరు కేసుల్లో 163 డిఫెన్స్ మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. వీటి విలువ సుమారు రూ.2.11 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మల్కాజిగిరి ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ప్రదీప్‌రావు ఆధ్వర్యంలో సిబ్బంది సరస్వతీనగర్, లోతుకుంటలోని మన్యం నాగప్రసన్న, రామాంజనేయులు ఇంటిపై తనిఖీలు నిర్వహించారు. డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో చేపట్టిన దాడుల్లో 96 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. రామాంజనేయులు డిఫెన్స్ మద్యం బాటిళ్లు తీసుకురాగా, ఆయన భార్య నాగప్రసన్న వాటిని ఇంటి వద్ద విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. భార్యాభర్తలపై కేసు నమోదు చేసి, నాగప్రసన్నను అరెస్టు చేసి అల్వాల్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించినట్లు ప్రదీప్‌రావు తెలిపారు. మరో ఘటనలో న్యూ బోయిన్‌పల్లి సౌజన్యకాలనీలో ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు నిర్వహించింది. సిఐ గణపతిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన తనిఖీల్లో ముసిమి లెంక (39) అనే మహిళ ఇంట్లో 67 డిఫెన్స్ మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. మద్యం విక్రయిస్తున్న ఆమెను అరెస్టు చేసి అల్వాల్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించినట్లు సిఐ తెలిపారు. అక్రమ మద్యం నిల్వ చేసిన, విక్రయాలు జరిపిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

బుచ్చవ్వ మరణం పట్ల కెసిఆర్ సంతాపం

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, ప్రముఖ రచయితలు అల్లం రాజయ్య, అల్లం వీరయ్యల మాతృమూర్తి అల్లం బుచ్చవ్వ మరణం పట్ల బిఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావు(కెసిఆర్) సంతాపం ప్రకటించారు. తెలంగాణ సాహిత్యం, జర్నలిజం రంగాల్లో తమదైన ముద్ర వేయడమే కాకుండా, ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ముగ్గురు ఉత్తమ కుమారులను సమాజానికి అందించిన గొప్ప మాతృమూర్తి అల్లం బుచ్చవ్వ అని ఆయన కొనియాడారు. తల్లిని కోల్పోయి తీరని శోకంలో ఉన్న అల్లం సోదరులకు, వారి కుటుంబ సభ్యులకు కెసిఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

గురుకుల బెడ్‌షీట్‌ల కొనుగోళ్లలో.. రూ.100 కోట్ల కుంభకోణం

- బిఆర్ఎస్ నేత దాసోజు శ్రావణ్ ఆరోపణ



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాత గుడ్డలను రీసైక్లింగ్ చేసే కంపెనీకి గురుకుల టెండర్లు కట్టబెట్టి రూ.100 కోట్ల కుంభకోణానికి పాల్పడిందని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రావణ్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెడ్‌పి మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, బిఆర్ఎస్ నేత రవి నాయక్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పోలీస్ రాజ్యం నడుస్తోందని, నిరుపేద కుటుంబానికి చెందిన దూదిమెట్ల బాలరాజు యాదవ్‌పై అక్రమంగా ఎస్‌సి, ఎస్‌టి కేసు పెట్టగా, బిఆర్ఎస్ లీగల్ టీమ్ బెయిల్ తెప్పించిందని చెప్పారు. పోలీసులు అక్రమ కేసులు పెట్టడం మానుకోవాలని, ఎన్ని కేసులు పెట్టినా ప్రభుత్వ అక్రమాలను బయటపెడుతూనే ఉంటామని హెచ్చరించారు. గురుకులాల్లో పేద విద్యార్థులకు ఇచ్చే బెడ్‌షీట్‌ల విషయంలో గుజరాత్‌కు చెందిన మఫత్‌లాల్ కంపెనీకి సెంట్రలైజ్డ్ టెండర్లు ఇచ్చి, సిఎం రేవంత్ రెడ్డి విద్యా వ్యవస్థను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. టెస్కో ద్వారా చేనేత కార్మికులకు కేవలం మూడున్నర లక్షల టెండర్ మాత్రమే ఇచ్చి, మిగిలిన సగం ఆర్డర్‌ను పాత గుడ్డలతో పేలవమైన బెడ్‌షీట్‌లు తయారు చేసే గుజరాత్ కంపెనీకి కేటాయించారన్నారు. ఐఎఎస్ అధికారి సవ్యాసాచి ఘోష్ సిఎం చెప్పుచేతుల్లో పనిచేస్తున్నారని విమర్శించారు. వీటితో పాటు లిడ్‌క్యాప్ పరిధిలోని 6 ఎకరాల భూమితో పాటు రూ.200 కోట్ల విలువైన ఏక్తా మాల్‌ను అపర్ణ సంస్థకు కట్టబెట్టారని ఆరోపించారు. రేవంత్ రెడ్డికి పేద విద్యార్థుల పట్ల చులకన భావం ఉందని శ్రావణ్ అన్నారు.

వెక్టర్ బోర్న్ వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు

- ఎన్‌విబిడిసిపి అదనపు సంచాలకులు డాక్టర్ కె.పద్మజ



ప్రజాపక్షం/హైదరాబాద్ : వెక్టర్ బోర్న్ వ్యాధుల నియంత్రణ చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర నేషనల్ వెక్టర్ బోర్న్ డిసీజెస్ కంట్రోల్ ప్రోగ్రామ్ (ఎన్‌విబిడిసిపి) అదనపు సంచాలకులు డాక్టర్ కె. పద్మజ అధికారులను ఆదేశించారు. ఎల్.బి.నగర్ జోన్‌లో నిర్వహించిన క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం బాలాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎల్.బి.నగర్ జోన్‌లో అమలవుతున్న యాంటీ లార్వల్ ఆపరేషన్స్, డెంగీ పాజిటివ్ కేసులపై చేపడుతున్న నివారణ చర్యలను పరిశీలించారు. సమీక్ష సందర్భంగా డెంగీ పాజిటివ్ కేసు నమోదైన 24 గంటల్లోపు ఆరోగ్య, ఎంటమలాజీ సిబ్బంది సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి, నివారణ చర్యలు చేపట్టాలని డాక్టర్ పద్మజ ఆదేశించారు. చేపట్టిన చర్యలపై యాక్షన్ రిపోర్ట్ తప్పనిసరిగా సమర్పించాలన్నారు. నాట్ ట్రేస్డ్ నాన్ రెసిడెంట్ కేసుల విషయంలో సంబంధిత చిరునామాలను పరిశీలించి, ఆ ప్రాంతాల్లో దోమల నివారణ చర్యలు చేపట్టడంతో పాటు సంబంధిత ప్రాంత అధికారులకు సమాచారం అందించాలన్నారు. 2030 నాటికి మలేరియా, లింఫాటిక్ ఫైలేరియాసిస్ నిర్మూలన లక్ష్యాలను సాధించేందుకు ప్రతి కేసును సకాలంలో గుర్తించి సమర్థవంతమైన నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆమే స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎన్‌విబిడిసిపి బృందం తరఫున డిప్యూటీ డైరెక్టర్ విజయ్ కుమార్, జోనల్ మలేరియా అధికారి చంద్రశేఖర్, ఎంఎంసి చీఫ్ ఎంటమలాజిస్ట్ మాధవరెడ్డి, ఏఎంఒహెచ్‌లు, జిహెచ్ఎంసి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఎంటమలాజీ సిబ్బంది, బాలాపూర్ యుపిహెచ్‌సి వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఇద్దరు చిన్నారులతో తల్లి ఆత్మహత్య

- పాకాల సరస్సులో విషాదం

ప్రజాపక్షం/ఖానాపురం: పాకాల సరస్సులో శనివారం విషాదం చోటు చేసుకుంది. ఇద్దరు కుమార్తెలతో కలిసి ఓ మహిళ సరస్సులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనలో వరంగల్ జిల్లా గీసుకొండ మండలం హవేలి గ్రామానికి చెందిన ఈరెల్లి మమత(28), ఆమె కుమార్తెలు మౌనిక(3), స్వప్న(5) మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం..మమత అదే గ్రామానికి చెందిన సుమాన్‌ను కులాంతర వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడే ఆరోపణలతో దంపతుల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నట్లు సమాచారం. వారం రోజుల క్రితం గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన మమత శనివారం ఇద్దరు పిల్లలతో కలిసి పాఖాల సరస్సు వద్దకు చేరుకొని బోటింగ్ ప్రాంతంలో నీటిలో దూకినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న డిసిపి అంకిత్ కుమార్, సిఐ శంకరయ్య, ఎస్ఐ గుగులోత్ రామ్మోహన్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను వెలికి తీసి విచారణ చేపట్టారు. ఘటనకు గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
ఆదివారం
08-11-2026
www.prajapaksham.in



























Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com